తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
19-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 139 పేజీలు: 8+4 వెల: 6.50





గురువారం కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారితో భేటీ అయిన మంత్రి లోకేష్

# పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారితో మంత్రి లోకేష్ భేటీ

### సిఎంకు ఏపి సంక్షేమ పథకాల అమలు, టెక్నాలజీ వినియోగం, పెట్టుబడుల సాధనను వివరించిన మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ బంధం మరింత బలోపేతం కావాలని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. గురువారం సాయంత్రం తరువాత కోల్‌కత్తాకు లోకేష్ చేరుకున్నారు. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని కోల్ కతాలోనే ఎపి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంగళగిరి చేనేత శాలువాతో సిఎంను లోకేష్ సత్కరించారు. ఎపిలో అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం గురించి లోకేష్ వివరించారు.

దేశంలోనే ఏ రాష్ట్రంలో ఇవ్వనటువంటి గరిష్ట ప్రయోజనంతో కూడిన సంక్షేమ పథకాలు అర్హులైన వారికి పారదర్శకంగా అందజేస్తున్న ఏపీ ప్రభుత్వ మెకానిజం సీఎంకు వివరించారు. పశ్చిమ బెంగాల్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును సిఎంను అడిగి తెలుసుకున్నారు. ఏపీలో అమలవుతున్న డిజిటల్ గవర్నెన్స్, రియల్ టైమ్ మానిటరింగ్ ఫలితాలను సిఎంకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ పశ్చిమ బెంగాల్ మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేద్దామని కోరారు. పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని, తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి అన్ని విధాలా సాయం అందిస్తామని సీఎంకు విన్నవించారు. మత్స్య సంపద పెంపు, ఎగుమతుల విషయంలో పరస్పర సహకారంతో మరింత అభివృద్ధి సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. మంత్రి నారా లోకేష్ ప్రతిపాదనలపై పశ్చిమ బెంగాల్ సిఎం సానుకూలంగా స్పందించారు.

# హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

>> బెయిల్ రక్షణగా మారకూడదని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పిటిషనర్‌ను ఉద్దేశించి 'ఎప్పటిలోగా సరెండర్ అవుతారు?' అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని న్యాయస్థానం పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు, ఒక పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సంఘటనల్లో పాల్గొనకుండా ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి తనను తాను నియంత్రించుకోవాల్సిన బాధ్యత ఉందని వ్యాఖ్యానించింది. ఎంపిని వేధింపులకు గురిచేయబోతున్నారని సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసునని హైకోర్టు తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆయన స్వచ్ఛందంగా వెళ్లి పోలీసుల ఎదుట సరెండర్ కావడం మంచిదని హైకోర్టు సూచించింది. ముందస్తు బెయిల్ కోరుతూ కొనసాగాలా?, లేక సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకోవాలా? అనే విషయంపై నిర్ణయం తీసుకుని కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్‌తో సంప్రదించి తదుపరి నిర్ణయాన్ని హైకోర్టుకు తెలియజేస్తామని అన్నారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి న్యాయస్థానం ముందు తమ వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోకుండా, ఈ కేసు విచారణను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

# చారిత్రాత్మక ఎఫ్‌టిఏ

>> చెప్పారు. ఈ యేడాది ఫ్రాన్స్ ఒక కీలక వారధిగా మారి, భారత్ మరియు యూరప్ టెక్ ఎకోసిస్టమ్‌లను మరింత దగ్గర చేస్తోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. టెక్నాలజీ, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, డిజిటల్ సహకారం వంటి రంగాల్లో భారత్‌ఫ్రాన్స్ భాగస్వామ్యం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ వివాటెక్ 10వ ఎడిషన్‌లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. సదస్సుగా పేరుగాంచిన వివాటెక్ విజయవంతంగా నిర్వహించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తోపాటు నిర్వాహకులను మోడీ అభినందించారు.

# లూటీపై ఇడి విచారణ

>> యార్డుల్లో 64లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ ఉంచామని స్పష్టంచేశారు. అక్రమ మైనింగ్‌కు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు ఐఐటి ధన్‌బాద్‌కు చెందిన 'టచ్‌మిల్ ఫౌండేషన్'తో త్రైపాక్షిక అవగాహన ఒప్పందం చేసుకున్నామని, ఇకపై మైనింగ్ క్వారీలను డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా గగనతలం నుంచి నిరంతరం నిఘా పెడతామని మంత్రి వెల్లడించారు. కర్నూలు జిల్లా జొన్నగిరి (తుగ్గలి మండలం)లో జియో మైసూర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక బంగారు గని ప్రాజెక్టును త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించబోతున్నామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. దీనితో పాటు చిత్తూరు జిల్లా చిగురుకుంట పరిసర ప్రాంతాల్లో బంగారం, ఇనుము, మాంగనీస్ నిల్వలున్న 17కొత్త మేజర్ బ్లాకులను ఐడెంటిఫై చేశామని, కావలికుల ఏరియాలో 1000హెక్టార్ల పరిధిలో జి-2 లెవల్ ఖనిజాన్వేషణకు ఒప్పందాలు జరుగుతున్నాయని తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధి ఫలాలు

>> యంపై ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరపాలి. అలాగే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు తీసుకురావడంతో పాటు.. విద్యుత్ సరఫరా అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. ఈ ఏడాది డిమాండ్‌లో 17 శాతం వృద్ధి నమోదైంది. ఐటి, పరిశ్రమలు, వాణిజ్య విభాగాల వినియోగానికి అనుగుణంగా విద్యుత్ ఎంత అవసరం అవుతుందో అంచనాలు తయారు చేయాలి. సోలార్ విండ్, పంప్డ్ స్టోరేజీతో పాటు బిఇఎస్ఎస్ టెక్నాలజీకే ఇక భవిష్యత్తు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీకి అనుగుణంగా పంప్డ్ స్టోరేజి సహా ఇతర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు చేపట్టాలి. లీథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఇవిలకు ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీలపై దృష్టి పెట్టాలి. బ్యాటరీ టెక్నాలజీపై ఎక్కువ దృష్టి పెట్టండి. డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో విద్యుత్ వినియోగం అనేది అత్యంత కీలకం. డేటా సెంటర్ల అనుమతుల విషయంలో దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి. సెమీ కండక్టర్లపై ఎక్కువ దృష్టి సారించాలి. దానికి సంబంధించిన ఎకోసిస్టంపై ఎక్కువ ఫోకస్ చేద్దాం. ఇక మైక్రో ఇరిగేషన్ రైతుల కోసం మైక్రో ఇరిగేషన్ ఎక్విప్మెంట్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి. మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీ కంపెనీలను ఎంకరేజ్ చేద్దాం. అమరావతిలో ఎఐ, ఆల్గారిథమ్స్ క్వాంటం అప్లికేషన్ల రూపకల్పన మొదలైంది. ప్రాజెక్టుల అనుమతులు, భూ కేటాయింపులు వంటివి సులభతరంగా అందించాలి. అమరావతి క్వాంటం వ్యాలీకి సంబంధించి ఓ ఎకోసిస్టమ్ రావాలి. టవర్లతో పాటు టెక్నాలజీ పార్క్ రావాలి. క్వాంటం అప్లికేషన్లతో పాటు క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు కూడా రావాలి. మరోవైపు ఆటోమొబైల్ పరిశ్రమలకు శ్రీసిటీ సహా అనంతపురం జిల్లా కూడా కీలకం. తిరుపతి, శ్రీసిటీలు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇసుజు, హీరో లాంటి ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయి. అనంతపురంలో కియా కార్ల ఉత్పత్తి జరుగుతోంది. పుట్టపర్తిలో 5వ జనరేషన్ ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కేంద్రం వేగంగా గ్రౌండ్ కావాలి. ఫైటర్ జెట్ తయారీ కేంద్రం పనుల విషయంలో నిరంతరం ఫాలో అప్ చేస్తూ ఉండాలి. కేంద్రానికీ ఎప్పటికప్పుడు నివేదికలివ్వాలి. ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కారం చూపాలి. బెంగళూరు- పుట్టపర్తి డిఫెన్సు కారిడార్‌గా మారుతుంది. ఏరోస్పేస్ కారిడార్‌గా ఈ ప్రాంతాన్ని మార్చాలి. తాడిపత్రి-అనంతపూర్ మధ్య ఓ ఎయిర్ స్ట్రిప్ వచ్చేలా చూడాలి" అని సిఎం చంద్రబాబు సూచించారు.

**జొన్నగిరి... స్వర్ణగిరి:**

"పర్యాటకులు ఎక్కువ సమయం రాష్ట్రంలో గడిపేలా హోటళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. మహీంద్రా క్లబ్ సంస్థ బీచ్ రిసార్ట్స్, పులికాట్ లేక్ వద్ద కూడా ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. అరకు లాంటి ప్రాంతాల్లోనూ ఐటిడిఎ భాగస్వామ్యంతో మహీంద్రా ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. టెంపుల్ టూరిజంను ప్రోత్సహించేలా కొత్తగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలను గుర్తించి వాటి వద్ద పెట్టుబడులు వచ్చేలా చూడాలి. తిరుపతి, అమరావతి, విశాఖలలో బాబా రామ్‌దేవ్ యోగా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. గండికోట, పోలవరం ప్రాజెక్టు, అనంతపురం, కర్నూలు వద్ద పెద్ద ఎత్తున హోటళ్లు రావాల్సి ఉంది. హార్సిలీ హిల్స్ వద్ద మంచి రిసార్టులు ఏర్పాటు చేస్తే టూరిస్టులు మరింతగా పెరుగుతారు. సూర్యలంక బీచ్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలి. బెస్ట్ బీచ్ టూరిజం స్పాట్‌గా సూర్యలంకను తీర్చిదిద్దాలి. పర్యాటక కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరిగేలా చర్యలు చేపట్టాలి. అమరావతిలో వచ్చే పెట్టుబడులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఓ కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేయాలి. డిస్ట్రిక్ట్ కూలింగ్, పైప్డ్ గ్యాస్, విద్యుత్ లాంటివి పూల్‌గా ఇచ్చే పరిస్థితి వస్తే ప్రాజెక్టుల వ్యయం తగ్గుతుంది. రేర్ ఎర్త్ మినరల్స్‌కు ఎపి కేంద్రంగా మారాలి. రేర్ ఎర్త్ మినరల్స్‌కు సంబంధించిన ఎండ్ టూ ఎండ్ సొల్యూషన్స్ ఎపిలో అందుబాటులో ఉండేలా ఎకోసిస్టమ్ రావాలి. రేర్ ఎర్త్ మినరల్స్‌పై ఓ ప్రత్యేక విద్యా సంస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుందేమో ఆలోచన చేయాలి. జొన్నగిరి గోల్డ్ మైన్ 1000 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. జొన్నగిరి అత్యంత పురాతన చరిత్ర ఉంది. ఒకప్పుడు జొన్నగిరికి స్వర్ణగిరి అని పేరుంది. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రాధాన్యత, ప్రోత్సాహం ఇవ్వాలి. విశాఖ నగరంలో ప్రస్తుత సదుపాయాలను మరింత మెరుగు పరుస్తూనే శాటిలైట్ టౌన్ షిప్‌లు అభివృద్ధి జరిగేలా చూడాలి. పరిశ్రమలతో పాటు.. హౌసింగ్ కూడా ఉండాలి. పారిశ్రామిక ప్రాంతాల వద్ద అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు జరిగేలా చూడాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ప్రాజెక్టు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేష్**

ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు, మినహాయింపులను అమలు చేయాలని ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ సూచించారు. భూ కేటాయింపులు జరిగిన తర్వాత వేగంగా ప్రాజెక్టులు ప్రారంభం కావాలి... అప్పుడే జిఎస్‌టి సహా వివిధ మార్గాల ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వవచ్చని లోకేష్ అభిప్రాయపడ్డారు. ఇక ఐటిఐ, పాలిటెక్నిక్ కాలేజీలను స్థానిక పరిశ్రమలతో మ్యాపింగ్ చేసి దానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుతున్నామని లోకేష్ వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్ పరిశోధనపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇటీవల చేపట్టిన రష్యా పర్యటనలో తాను గమనించిన అంశాలను లోకేష్ ప్రస్తావించారు. రష్యాలో క్వాంటం అప్లికేషన్లకు సంబంధించి ఓ ప్రత్యేకమైన ఎకోసిస్టమ్ ఏర్పాటై ఉందని లోకేష్ చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని, టిజి భరత్, కందుల దుర్గేష్, పయ్యావుల కేశవ్, బిసి జనార్దన్ రెడ్డి, సిఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

>> నది కావడంతో, ఎలాంటి కాలయాపన చేయకుండా సొసైటీ త్వరగా కార్యరూపం దాల్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా పంచాయతీలో ఏర్పాటు సాధ్యం కాకపోతే, కనీసం మూడు, నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీ ఉండేలా వెంటనే పనులు ప్రారంభించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'విబి జి రామ్ జి' పథకం కిందకు నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాం. ఈ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా ఉపయోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి" అన్నారు.

**ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లండి:**

పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అధికారులు డిప్యూటీ సిఎం పవన్‌కి తెలియజేశారు. ఈ వర్షాకాలంలోనే వీటిని అటవీ, ఖాళీ ప్రాంతాలలో వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండ కోనల్లో విత్తనాలను చల్లడానికి ఈసారి సుమారు 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు అధికారులు వివరించారు.

ఈ ప్రణాళికపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, "సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకొని దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలి" అని సూచించారు.

**అరుదైన మొక్కల సంరక్షణపై అభినందనలు:**

రాష్ట్రంలో అంతరించిపోతున్న అరుదైన వృక్ష జాతులను రక్షించేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులైన పిసిసిఎఫ్, హెచ్‌ఓఎఫ్‌ఎఫ్ లను, వాళ్ల బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పాములేరు వాగు వెంబడి కేవలం 10 మాత్రమే మిగిలి ఉన్న అత్యంత అరుదైన, అంతరించిపోతున్న వెదురు జాతిని అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో చేసిన లోతైన పరిశోధనలు, ఆధునిక మాలిక్యులర్ సైన్స్ ద్వారా ఈ కొత్త జాతిని గుర్తించారు. దీనికి 'బాంబూసా ఆంధ్రీకమ్' అని నామకరణం చేశారు.

ఈ చివరి పది మొక్కలను కాపాడటమే కాకుండా, వాటి సంఖ్యను మరింత పెంచేందుకు అటవీ శాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయడం పట్ల డిప్యూటీ సిఎం పవన్ అభినందించారు. అదేవిధంగా, శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే, ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరిన ఈత చెట్టు మాదిరి ఉండే 'సైకాస్ శేషాచలన్సిస్' మొక్కల పెంపకానికి, వాటి సంరక్షణకు కూడా అటవీ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుందని తెలుసుకొని అభినందించారు. ఈ సమావేశంలో అటవీ పర్యావరణశాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్ చంద్, పిసిసిఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సిసిఎఫ్ సోషల్ ఫారెస్ట్, జూలాజికల్ పార్క్స్ బి.ఎన్.ఎన్. మూర్తి, సిసిఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ మాతో వస్తే మేం చేసిన అభివృద్ధి ఏంటో చూపిస్తా

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్18(ప్రభాతవార్త):** ప్రధాని మోడీ చలువ సిఎం చంద్రబాబు చొరవ తోనే రాష్ట్రానికి రెండేళ్లలోనే ఎన్నడు లేని విధంగా 10 లక్షల కోట్ల రూపాయలు నిధులు వచ్చాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బిజెపి అధ్యక్షుడు మాధవ్ పర్యటించారు. పోస్టల్ శాఖ ద్వారా ప్రవేశపెట్టిన పథకాల నమోదు స్టాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులు కేంద్రం 35 వేల కోట్ల రూపాయలు ఇచ్చిందని, విశాఖ రైల్వే జోన్ ప్రధాని ప్రధాని సాధ్యం చేశారని గుర్తు చేశారు. జగన్, షర్మిల పాదయాత్ర చేసి ఈ అభివృద్ధిని చూసుకోవాలని ఎద్దేవా చేశారు డీఎస్సీ పోస్టుపై అధికారులు వివరణ ఇచ్చిన జగన్ ఫ్రెస్టేషన్లో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

పేదల సంక్షేమానికి 160కిపైగా పథకాలను ప్రధాని మోడీ ప్రవేశపెట్టారన్నారు. పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా పొదుపు, బీమా పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కేవలం రూ.750 చెల్లిస్తే రూ.15లక్షల ప్రమాద బీమా కల్పించారని, డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు.

అమరావతి నిర్మాణానికే కేంద్రం రూ.30 వేల కోట్ల నిధులు ఇచ్చిందన్నారు. జగన్ మాతో వస్తే , మేం చేసిన అభివృద్ధి ఏంటో చూపిస్తామని మాధవ్ అన్నారు. ఫ్రస్టేషన్, సెన్సేషన్ కోసమే జగన్ కొత్త నాటకాలని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ అత్యంత పారదర్శకంగా జరిగిందని మాధవ్ స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

19-06-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
పంచమి సా.5.06,
ఆశ్లేష ఉ.10.10
వర్జ్యం : రా.9.49-రా.11.23
దు.ఉ.8.12-ఉ.9.04, 2)మ.12.35-మ.1.27
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** బ్యాంకు లావాదేవీలు అనుకూలిస్తాయి. కీలక నిర్ణయంలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

**వృషభం:** సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. భూముల విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. వస్త్రలాభం.

**మిథునం:** వృత్తిలో మెలకువలు అవసరం. వాతావరణంలో స్వల్ప మార్పుల వలన ఆరోగ్యం మీద కొంతమేర ప్రభావం ఉంటుంది.

**కర్కాటకం:** అయిష్టంగా కొన్ని కార్యక్రమాలు చేయవలసి రావడం కొంత ఇబ్బందికి లోను చేస్తుంది. ఆస్తి వివాదాలు.

**సింహం:** జీవిత భాగస్వామి సహకారం మీకు మనోధైర్యాన్నిస్తుంది. భాగస్వామ్య వ్యాపారాలు మినహా ఇతర వ్యాపారాలు అనుకూలం.

**కన్య :** ఉద్యోగాల పరంగా అదనపు బాధ్యతలు నిర్వహించవలసి వస్తుంది. నమ్మి ఎవరికి పనిని అప్పగించవద్దు.

**తుల :** ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు కీలకమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:** ప్రతి వాతావరణంలో కొన్ని అనుకూలంగా ఫలితాలు సాధిస్తారు. మీ వైరి వర్గం మిమ్ములను బాధించకపోవడం ఊరట కలిగిస్తుంది.

**ధనుస్సు:** ఓర్పు నేర్పులతో మందకొండిగా సాగుతున్న వ్యవహారాలలో కొంత పురోభివృద్ధి సాధిస్తారు. వాహన సౌఖ్యం.

**మకరం:** కార్యాలయంపై అధికారులకు వివరణ ఇచ్చుకోవలసి వస్తుంది. వివాదాలకు దూరంగా ఉండండి. స్పెక్యులేషన్ లాభించదు.

**కుంభం:** పుకారులకు ప్రాధాన్యత నివ్వడం వలన నిజానిజాలు తెలుసుకోవడంలో వైఫల్యం చెందుతారు. బంధువుల కలయిక.

**మీనం:** సెల్ఫ్ డ్రైవింగ్ సాధ్యమైనంత వరకు చేయకపోవడం ఉత్తమం. ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



వారణాసిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం నమామి గంగే సభ్యులు గంగానదిలో 'జలయోగా' చేస్తున్న దృశ్యం

# అనాథ పిల్లలకు 'తల్లికి వందనం'

>> భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి లోకేష్ అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెం.1 స్థానంలో ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులను మంత్రి లోకేష్ అభినందించారు. కడప మోడల్‌లో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించామని, మెగా పిటిఎం నాటికి పూర్తిస్థాయిలో కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 430 కెజిబివిల్లో విద్యనభ్యసిస్తున్న 1,06,360 మంది విద్యార్థినులకు 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. కెజిబివిలతో పాటు ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు.

**జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు కిట్స్ పంపిణి**

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్ల పంపిణీ చేపట్టినట్లు మంత్రి లోకేష్ చెప్పారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసరమైన నిబంధనలను తొలగించాలని అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో నిర్ణయించిన ఫీజులను స్కూళ్ల వెలుపల బోర్డులపై ప్రదర్శించడంతోపాటు పబ్లిక్ డొమైన్‌లో పొందుపర్చాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

**తెలుగు అకాడమీ పుస్తకాలు ఇక ఆన్‌లైన్‌లో:**

తెలుగు అకాడమీ ముద్రించే టెక్స్టుబుక్స్ ప్రజలందరికీ సులభంగా అందుబాటులోకి వచ్చేలా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ ఇ-కామర్స్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్స్ ద్వారా విక్రయించాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ప్రజలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే సదుపాయాన్ని వీలైనంత త్వరగా కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరుపై ప్రత్యేక దృష్టి:**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు వారి హాజరు శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి సీతారామరాజు, పోలవరం తదితర జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆయా జిల్లాలలో ఉపాధ్యాయుల లభ్యతను సమీక్షిస్తూ విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఒక ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల పాఠశాల హాజరు 95శాతానికి తగ్గకుండా పక్కా చర్యలు తీసుకోవాలని, అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అత్యంత పారదర్శకంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**మాతృభాషను విస్మరించొద్దు**

పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలవుతున్న విద్యార్థుల్లో అధికశాతం మ్యాథ్స్, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్న విషయాన్ని అధికారులు మంత్రి లోకేష్‌దృష్టికి తెచ్చారు. "ఎట్టిపరిస్థితుల్లో మాతృభాష తెలుగును విస్మరించొద్దు, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయండి, ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి విద్యార్థులకు అందజేయాలి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఇప్పటినుంచే వారికి అదనపు తరగతులు నిర్వహించి శిక్షణ ఇవ్వాలి" అని అధికారులకు మంత్రి లోకేష్ సూచించారు.

# అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం

>> ఆమోదం తెలపడంతో ఈ ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చింది. అయితే, ఈ చారిత్రాత్మక ఒప్పందం అంత సులభంగా సాధ్యపడలేదు. కొన్ని నెలలుగా ఒమన్ తో ఇతరదేశాలు నేతృత్వంలో తెరవెనుక తీవ్రమైన దౌత్య సంప్రదింపులు జరిగాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న తరుణంలో, ఇరు దేశాలు పట్టువిడుపులకు వెళ్లకుండా ఒప్పందానికి ముందుకు వచ్చాయి. అమెరికా ఇరాన్ మధ్య ఒప్పం దంలో ఇరు దేశాలు అంతర్జాతీయ శాంతిని దృష్టిలో ఉంచుకుని ఈ ఒప్పందానికి అంగీకరించాయి. లెబనాన్ సరిహద్దులతో సహా పశ్చిమాసియాలోని అన్ని ప్రాంతాలలో ఇరు దేశాలకు సంబంధించిన ప్రత్యక్ష, పరోక్ష సైనిక చర్యలు, దాడులను తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య కూడా ఒక సంధి జరగనుంది. కొంతకాలంగా ఉద్రిక్తతలకు కేంద్రంగా మారి, అంతర్జాతీయ వాణిజ్యానికి అడ్డుకట్టగా మారిన హార్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. ప్రారంభంలో 60 రోజుల పాటు ఎలాంటి అదనపు రుసుము లేకుండా అంతర్జాతీయ నౌకల సురక్షిత ప్రయాణాన్ని ఇరాన్ కల్పించనుంది. ఇరాన్ ఆర్థిక వనరులను దెబ్బతీయడానికి ఆ దేశసరిహద్దుల వద్ద అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధాన్ని అమెరికా తక్షణమే ఉపసంహరించకోనుంది.

**నేడు స్విట్జర్లాండ్‌లో చర్చలు:** అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా, ఇప్పుడు దాన్ని అమలు చేసేందుకు ఇరు దేశాలు సిద్ధ మవుతున్నాయి. ఈమేరకు తొలి దశ చర్చలు స్విట్జర్లాండ్‌లో జరగనున్నాయి. శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని బుర్గెన్‌స్టాక్ పర్వత ప్రాంత రిసార్ట్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు సమావేశం కానున్నట్లు స్విస్ ప్రభుత్వం వెల్లడించింది. అందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. స్విస్ విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, అమెరికా, ఇరాన్‌తో పాటు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులుకూడా ఆ సమావేశంలో పాల్గొననున్నారు.

**60 రోజుల్లో తుది ఒప్పందం:** ఈ తాత్కాలిక అవగాహన ఒప్పందాన్ని పూర్తి స్థాయి శాశ్వత ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలకు 60 రోజుల గడువును విధించారు. అవసరమైతే ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో ఈ గడువును మరింత పొడిగించుకునే అవకాశం ఉంది. రాబోయే 60 రోజుల్లో సమగ్ర, శాశ్వత ఒప్పందం కుదుర్చుకోవడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం ఇరు దేశాలు వరుస చర్చలు జరపనున్నాయి. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి కూడా ఈ ఒప్పందం ఖరారైనట్లు ధ్రువీకరించారు. ఒమన్‌తో పాటు ఇతర దేశాల సహకారంతో సంప్రదింపులు జరిపి ఈఅవగాహన ఒప్పందాన్ని తుది రూపం ఇచ్చినట్లు వెల్లడించారు.

**చమురు ధరలపై ప్రభావం:** అమెరికా- ఇరాన్ మధ్య ఒప్పందం అమల్లోకి రాగానే ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు స్థిరపడటం ప్రారంభమైంది. ప్రపంచ ఇంధన సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు పెరగడంతో ఇంధన మార్కెట్లలో స్థిరత్వం ఏర్పడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే, అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం పశ్చిమాసియా రాజకీయాల్లోనే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా గణనీయ ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మద్యం స్కాం కేసు.. సునీల్ అరెస్ట్

>> ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఎ) కింద ఈ అరెస్ట్ జరిగింది. తాజా పరిణామాలతో ఈ స్కామ్‌లో ఇడి అధికారికంగా అరెస్ట్ చేసిన వారి సంఖ్య మూడుకు చేరింది. వైద్యపరీక్షల అనంతరం సునీల్‌ను నాంపల్లి కోర్టులో ఇడి అధికారులు హాజరుపరిచారు. సునీల్ తరఫున సీనియర్ న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపించారు. సిగ్మా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు మద్యం రవాణాలో అక్రమాలు జరిగాయని ఇడి కోర్టుకు తెలిపింది. కారుమూరి నాగేశ్వరరావు పలుకుబడితో కాంట్రాక్టులు దక్కించుకున్నారని పేర్కొంది. ఈ కేసులో కారుమూరి కుమారుడు సునీల్ భారీగా లబ్ధి పొందినట్లు ఆధారాలు ఉన్నాయని చెప్పింది. కారుమూరి కుటుంబసభ్యుల మధ్య రూ.7 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఆధారాలున్నాయని ఇడి కోర్టుకు వివరించింది. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన సందీప్, ప్రతాప్‌రెడ్డికి కాంట్రాక్టులు వచ్చాయని తెలిపింది. కాంట్రాక్టులు ఇప్పించిందుకు సునీల్‌కు సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ నుంచి రూ.28 కోట్లు ముడుపులు వచ్చాయని పేర్కొంది. ఈ కేసులో లోతైన దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. అన్ని ఆధారాలను సరైన సమయంలో కోర్టుకు సమర్పిస్తామని చెప్పింది. మద్యం రవాణా స్కామ్‌లో ప్రభుత్వానికి రూ.195 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపింది. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు కారుమూరి సునీల్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం సునీల్‌ను చంచల్‌గూడ జైలుకు ఈడీ అధికారులు తరలించారు.

**కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు**

మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు జారీ చేసింది. ఈనెల 23న హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని తెలిపింది. సిగ్మా సంస్థ నుంచి సునీల్‌కు చెందిన సుదర్శన కన్‌స్ట్రక్షన్ సంస్థ సబ్ కాంట్రాక్ట్ పొందింది. కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మద్యం రవాణా బాధ్యతలను సునీల్ హైదరాబాద్ కార్యాలయం నుంచే పర్యవేక్షించారు. ఈ రవాణా సబ్ కాంట్రాక్ట్ ద్వారా వచ్చిన లాభాల్లో ఏకంగా 85 శాతం సొమ్ము సునీల్, ఆయన సతీమణి కీర్తి వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లోకి మళ్లినట్లు న్యాయస్థానానికి తెలిపింది. ముఖ్యంగా సునీల్ భార్య కీర్తి బ్యాంక్ ఖాతాలోకి రూ.9.4 కోట్లు వచ్చి చేరినట్లు దర్యాప్తు సంస్థలు ఆధారాలతో సహా గుర్తించాయి. మద్యం సిండికేట్ సభ్యుల నుంచి సునీల్, ఆయన తండ్రి నాగేశ్వరరావుకు నగదు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా సుమారు రూ.15 కోట్లు చేరినట్లు ఇడి సోదాల్లో ఆధారాలు లభించాయి.



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

19-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 139 పేజీలు: 8+4 వెల: 6.50


బెంగాల్ సిఎం సువేందుతో
## మంత్రి లోకేష్ భేటీ

జగన్ మాతో వస్తే అభివృద్ధి చూపిస్తాం: మాధవ్

2లో

## పొగాకు రైతులను ఆదుకుంటాం

ఏదైనా కెజి రూ.200 తగ్గకూడదు

నో బిడ్... లో బిడ్ ఉండకూడదు

మార్కెట్‌కు వచ్చిన పంట కొనాల్సిందే

అనధికార కొనుగోళ్లపై కఠిన చర్యలు

కేంద్ర ప్రభుత్వంతోనూ మాట్లాడతాం

ట్రేడర్లు, పొగాకు రైతుల భేటీలో సిఎం

6లో

ఆక్వా ఫీడ్ ధర కెజికి
## రూ.4 తగ్గింపు

కంపెనీల అంగీకారం...

ధరల స్థిరీకరణపై కమిటీ

రైతులు, ఫీడ్ తయారీదారులతో సమావేశంలో సిఎం

# పేదలకూ పారిశ్రామికాభివృద్ధి ఫలాలు



గురువారం సచివాలయంలో ఎస్ఐపిబి సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలకు ప్రోత్సాహం

మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటుకు చర్యలు

పారిశ్రామిక ప్రాంతాల వద్ద తక్కువ ధరలో ఇళ్ల నిర్మాణం

ఆటోమేషన్‌లో పారిశ్రామిక అనుమతులు: సిఎం చంద్రబాబు

ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేష్

ఎస్ఐపిబి సమావేశంలో రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామికాభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఎపిలో ఏర్పాటయ్యే పారిశ్రామిక ఎకో సిస్టంను రూపొందించాలని సిఎం స్పష్టం చేశారు. పరిశ్రమలు, కంపెనీలను ధనికులే స్థాపించగలరనే భావన పోయేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో 18వ ఎస్ఐపిబి సమావేశం జరిగింది. ఈసమావేశంలో వివిధ కంపెనీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. మొత్తంగా 50 కంపెనీలకు సంబంధించి రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. ఈ కంపెనీల ద్వారా మొత్తంగా 29,677 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలి. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా పేద, మధ్య తరగతి వారికి ఉద్యోగాలు కల్పించడమే కాదు... సామాన్యులు కూడా కంపెనీలు స్థాపించే అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు స్టార్టప్ కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలి. ఆర్‌టిఐహెచ్ పరిధిలోని స్టార్టప్ కంపెనీలకు వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు వచ్చేలా చూడాలి. ఈ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి. దీనికి అనుగుణంగా ఎకో సిస్టం ఏర్పాటు చేసే అంశంపై అధికారులు ఫోకస్ పెట్టాలి. ఇక వచ్చే పరిశ్రమలకు అనుగుణంగా కరిక్యులమ్ తయారు చేసే దిశగా విద్యా శాఖ ఆలోచన చేయాలి. పరిశ్రమలు, ప్రాజెక్టుల్లో ఎలాంటి ట్రెండ్స్ వస్తున్నాయో గమనించి దానికి అనుగుణంగా కరిక్యులమ్ రూపొందించాలి. రోబోటిక్స్ లాంటి ఆధునిక టెక్నాలజీ కోర్సులు కూడా మన విద్యా సంస్థల్లో ఉండాలి. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి నాన్ సీరియస్ ప్లేయర్స్‌కు ఎపిలో చోటు లేదు. ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాక... వెంటనే పనులు మొదలు పెట్టేలా చూడాలి. పనులు ప్రారంభించని సంస్థలతో టచ్‌లో ఉంటూ ఫాలో అప్ చేయాలి" అని సూచించారు.

**ఆటోమేషన్‌లో పారిశ్రామిక అనుమతులు:**
"ఇథనాల్ తయారీ విషయంలో ముందడుగు వేయాలి. 40 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఇథనాల్ బేస్డ్ ఇంధనం ఎక్కువగా ఉపయోగిస్తే దిగుమతి చేసుకునే ఇంధన భారం తగ్గుతుంది. బయో ఫ్యూయల్స్ రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సి ఉంది. ఈ విష >>2

# అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం

చారిత్రక డీల్‌పై వర్చువల్‌గా ట్రంప్, పెజెష్కియాన్ సంతకాలు

తక్షణమే అమల్లోకి... పశ్చిమాసియాలో సైనిక చర్య ముగింపు

నేడు స్విట్జర్లాండ్‌లో చర్చలు... 60 రోజుల్లో తుది ఒప్పందం

తెరుచుకున్న హార్ముజ్ జలసంధి... తగ్గిన ముడిచమురు ధరలు





**పారిస్, జూన్ 18:** అమెరికా- ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరు దేశాల అధ్యక్షులు చారిత్రాత్మక మైత్రి ఒప్పందంపై అధికారికంగా సంతకాలు చేశారు. అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు 19వ తేదీన ఇరు దేశాలు అధికారికంగా శాంతి ఒప్పందం చేసుకోను న్నాయి. 14అంశాల ఆధారంగా ఇరు దేశాలు ఒప్పందం చేసుకు న్నాయి. గురువారం ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసొద్ పెజెష్కియాన్ వర్చువల్ పద్ధతిలో 14 అంశాల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న శత్రుత్వానికి బ్రేక్ వేస్తూ జరిగిన ఈ ఒప్పందం అంతర్జాతీయ దౌత్య రంగంలో ఒక ముందడుగుగా నిలిచింది. ఫ్రాన్స్‌లోని వర్సాలీస్ ప్యాలీలో జరిగిన ప్రత్యేక విందు సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సమక్షంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేయగా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెస్కి యాన్ కూడా టెహ్రాన్ నుంచి దీనికి >>2



కారుమూరి నాగేశ్వరరావు ఆయన కుమారుడు సునీల్

మద్యం స్కాం కేసు
## సునీల్ అరెస్ట్

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఇడి

కోర్టుకు తరలింపు... 14 రోజుల రిమాండ్

చంచల్‌గూడ జైలుకు మాజీ మంత్రి తనయుడు

కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం రవాణా కుంభకోణం, మనీలాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ వేగవంతం చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌ను ఈరోజు హైదరాబాద్‌లో ఇడిఅధికారులు అరెస్ట్‌చేశారు. >>2

ఐపిఎస్ అధికారి సునీల్‌పై
## హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

ఎప్పటిలోగా సరెండర్ అవుతారు?

ఎంపి రఘురావ కస్టోడియల్ టార్చర్ కేసులో ధర్మాసనం ప్రశ్నలు

సమయమివ్వాలన్న సునీల్ నాయక్ తరపు న్యాయవాది

విచారణ నేటికి వాయిదా

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ సభ్యుడిపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపిఎస్ అధికారికి ముందస్తు >>2

# అనాథ పిల్లలకు 'తల్లికి వందనం'

పిఎంశ్రీ నిధుల వినియోగంలో ఎపి నం.1

జూనియర్ కాలేజీ విద్యార్థులకు కిట్స్ పంపిణీ

మాతృభాషను విస్మరించొద్దు

కస్తూరిబా హాస్టళ్లలో బెడ్స్ ఏర్పాటు చేయండి

విద్యాశాఖ అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం



గురువారం విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం డబ్బులు అందేలా పక్కా చర్యలు తీసుకోవాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఈ పథకం అమలు కోసం పిల్లల గార్డియన్ల వివరాలను కచ్చితంగా సేకరించాలని, ఒకవేళ ఎవరూ లేని పక్షంలో ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, అక్కడ నుండి పిల్లలకు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేసి, వారి చదువు పూర్తయిన తర్వాత ఆ సొమ్మును స్వతంత్రంగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానం ఆలోచన చెయ్యాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అటువంటి నిర్ణయం తీసుకోవడం వలన తల్లిదండ్రులు లేని పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా, వారి >>2



గురువారం సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

- జులై 3నాటికి ప్రక్రియ పూర్తి కావాలి
- ప్రతి గ్రామంలో నర్సరీ ఉండాల్సిందే
- విబి జి రామ్‌జి కింద నర్సరీల పెంపకం అనుసంధానం
- ప్రజా ఉద్యమంలా సీడ్ బాల్స్ ప్రోగ్రాం
- అటవీ శాఖ అధికారులకు డి.సిఎం పవన్ ఆదేశం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. జులై 3వతేదీ నాటికి ఈ సొసైటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియామకాలు, విధివిధానాల ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025కి అనుగుణంగానే ఉండేలా చూసుకోవాలని స్పష్టంచేశారు. ఈప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగి >>2

# ఇసుక లూటీపై ఇడి విచారణ

త్వరలోనే సిఎం చేతుల మీదుగా 'జొన్నగిరి గోల్డ్‌మైన్' ప్రారంభం

రూ.50వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా నూతన 'బీచ్ సాండ్ పాలసీ'

రాష్ట్ర మైనింగ్, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి





**సచివాలయం, జూన్ 18 ప్రభాతవార్త:** గత వైసిపి ప్రభుత్వ అనాలోచిత, అడ్డగోలు నిర్ణయాల వల్ల సర్వనాశనమైన రాష్ట్ర మైనింగ్ రంగాన్ని కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలో విప్లవాత్మక సంస్కరణల ద్వారా తిరిగి పట్టాలెక్కించిందని రాష్ట్ర మైనింగ్, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనా లోపాల వల్ల మైనింగ్ వృద్ధి రేటు 24నుంచి 7శాతానికి పడిపోయి, రాష్ట్ర ఖజానాకు ఏకంగా రూ.19,137 కోట్ల నష్టం వాటిల్లిందని గణాంకాలతో సహా శ్వేతపత్రం విడుదల చేశారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ ఇసుక దోపిడిని తాము శాటిలైట్ డేటా ఆధారంగా సాంకేతికంగా నిరూపించామని, 5.08కోట్ల మేజర్ మెట్రిక్ టన్నుల ఇసుకను అక్రమంగా తరలించినందుకు గాను రూ.3,891 కోట్ల రికవరీ డిమాండ్ నోటీసులు జారీ చేశామని ప్రకటించారు. ఈ కుంభకోణంపై ఇప్పటికే రాష్ట్రంలో ఎసిబి కేసులు, ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలో దిగి లోతైన దర్యాప్తు జరుపుతోందని మంత్రి స్పష్టంచేశారు. 2023లో విపరీతమైన డిమాండ్ ఉన్న "సిలికా సాండ్" రంగాన్ని దౌర్జన్యంగా లాక్కొని పారదర్శక ఆన్‌లైన్ ఐడీలను బ్లాక్ చేసి కేవలం 20లీజులను "వామనా ఎంటర్‌ప్రైజెస్" అనే సిండికేట్‌కు కట్టబెట్టడం వల్లే రాష్ట్రంలోని సిమెంట్ ఫ్యాక్టరీలు పక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వచ్చిందని మంత్రి మండిపడ్డారు. ఈ అక్రమాలకు పూర్తి చెక్ పెడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ప్రజలపై భారం మోపే సేల్స్ రేట్, డిఎంఎఫ్, మెరిట్ ఫీజులను పూర్తిగా రద్దుచేసి విప్లవాత్మక "ఫ్రీ సాండ్ పాలసీ"ని విజయవంతంగా అమలు చేస్తుందని కొల్లు రవీంద్ర వివరించారు. 5 ప్రభుత్వ శాఖలతో కూడిన "కలెక్టర్ టాస్క్ ఫోర్స్" నిరంతర పర్యవేక్షణ వల్ల మార్కెట్లో ఇసుక ధర 25నుంచి 30శాతం వరకు తగ్గిందని ప్రజలు కేవలం తవ్వకం,రవాణా ఖర్చులు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. జులై 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1,91,85,793 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేశామని, ప్రస్తుత వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా ముందస్తుగా 238 స్టార్ >>2

# భారత్-ఇయు మధ్య చారిత్రాత్మక ఎఫ్‌టిఎ

వివాటెక్ సదస్సులో ప్రధానిమోడీ





**ప్యారిస్,జూన్ 18:** ఫ్రాన్స్‌లో నిర్వహించిన వివాటెక్ 10వ ఎడిషన్ కార్యక్ర మంలో పాల్గొని ప్రసంగించిన ప్రధానిమోడీ యూరప్‌లోనే అతిపెద్ద టెక్నాలజీ ఈవెంట్. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో అధ్యక్షుడు మెక్రాన్, నిర్వాహకుల కృషి అభినందనీయమని అన్నారు. అలాగే 2026 సంవత్సరం భారత్ యూరప్ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన యేడాదిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ యేడాది ప్రారంభంలో భారత్ యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది.
ఈ ఒప్పందం వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించడమేకాకుండా ప్రతిభ, సాంకేతికత, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారానికి కొత్త అవకాశాలను తెరుస్తుందని మోడీ వెల్లడించారు. ఇదేవిధంగా, ఇండియా ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ ప్రారంభంతో భారత్, యూరప్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని >>2

వార్త


అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.

-ఆస్కార్ వైల్డ్

# అప్రమత్తతే అసలైన మందు!

దేశ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు, అటు కేంద్ర ప్రభుత్వం కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. మన రాజ్యాంగనిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో స్పష్టంగాపొందుపరిచారు. ఇన్ని దశాబ్దాలు గడిచిపోయినా అందరికీ సంపూర్ణ ఆరోగ్యం సంగతి దేవుడెరుగు. కనీస ఆరోగ్యవసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. కొన్ని వ్యాధులను నియంత్రించడం వైద్యులకు కూడా సాధ్యం కావడం లేదు. కొత్త మందులు, కొత్త చికిత్సలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకు రెట్టింపు స్థాయిలో కొత్తకొత్త వ్యాధులు విస్తరిస్తున్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నారు. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నిన్నమొన్నటి వరకు ప్రపంచాన్నే చిగురుటాకులా వణికించిన కరోనా రక్కసి శాంతించినా అప్పుడు వాడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది కోలుకోలేకపోతున్నారు. గుండెజబ్బులు పెరిగిపోయాయి. వయసుతో తేడాలేకుండా చిన్నాపెద్ద అందరూగుండెజబ్బులకు బలైపోతున్నారు. ఇక కిడ్నీవ్యాధుల గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలంగాణ రాష్ట్రం కిడ్నీవ్యాధుల్లో అగ్రస్థానంలో ఉన్నట్లు ఇటీవల వెల్లడించిన సర్వేలు స్పష్టం చేశాయి. డయాలసిస్ కేంద్రాలు ఎన్ని పెట్టినా సరిపోవడం లేదు. ఇక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. వర్షాకాలం సీజన్ ఆరంభం కావడంతో కొత్త నీరు రాక, పాత నీరు కలయికతో వ్యాధులు విస్తరిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయి. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరించే ప్రమాదం ఉన్నట్లు వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎబోలా వ్యాధి దేశంలో అంతగా విస్తరించకపోయినా విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా దేశంలో కొన్ని ప్రాంతాల్లో సోకుతున్నట్లు సమాచారం. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఎబోలా వ్యాధి సోకిన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. ఒక్కఅల్లోపతి డాక్టర్లే కాదు, ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాల డాక్టర్లు, వైద్యరంగ నిపుణులు, శరీరంలో ఇమ్యూనిటీని పెంచుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. దశాబ్దాల తరబడి చెప్తూనేఉన్నారు. ఈ వాస్తవాలు ప్రజలకు కూడా తెలియనవి కావు. అయినా రోగ నిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు? కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన సమయం ఇది. శరీరంలో రోగనిరోధక శక్తినిఒక్క రోజుల్లోనో, ఒక్క వారంలోనో, ఒక్క నెలలో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏమేరకు అందిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్ధాకలితో అలమ టించేవారు కోట్లసంఖ్యలో ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎక్కడి నుంచి వస్తుంది? మరోపక్క కాలుష్యం ప్రజా రోగ్యాన్ని కాటువేస్తున్నది. ఢిల్లీలో చల్లికాలం వాయు కాలుష్యం చుట్టుముట్టడం ఆ పౌరులను ఉక్కిరిబిక్కిరి చేయడం ప్రతి యేడాది జరుగుతూనే ఉన్నది. ఢిల్లీలోనే కాదు భారతదేశంలోని అనేక నగరాలు, పట్టణాలు, వాయు, నీటికాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. మరొకపక్క వాహన కాలుష్యం దీనికితోడవుతున్నది. వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడంలేదు. అన్నిటికంటే మించి కేన్సర్ వ్యాధి మానవాళిపై పంజా విసరడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల కేన్సర్‌కు సంబంధించి మందుల ధరలు ఒక్కసారిగా పెంచారు. ఇది మరింత ఆర్థిక భారం పడిందనే చెప్పొచ్చు. దేశంలో నాలుగేళ్ల క్రితం పద్నాలుగు లక్షల అరవైవేలకుపైగా కేన్సర్‌కేసులు నమోదు కాగా ఇప్పుడది మరో నాలుగులక్షలకు అదనంగా నమోదవుతున్నట్లు వైద్య పరిశోధన మండలి, జాతీయ కేన్సర్ నమోదు కార్యక్రమం లెక్కలు చెబుతున్నాయి. ఈ కేన్సర్‌ముప్పు నుంచి ప్రజలను కాపాడేందుకు జాతీయ ఆరోగ్య కమిషన్ పలుచర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం చెబుతున్నది. ధూమపానం ఈ కేన్సర్‌ను పెంచేందుకు తన వంతు కృషి చేస్తున్నది. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం వల్ల నోరు, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక కేన్సర్‌ల నుండి తప్పించుకోవచ్చునని డాక్టర్లు సూచిస్తున్నారు. మద్యపానం కూడా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న విషయం పెద్దలకు తెలియంది కాదు. ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని చెప్పుకునే పాలక పెద్దలు ఈ ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. ఇవేకాదు కల్తీ కూడా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యానికి కారణాలవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. ప్రజారోగ్యానికి చేటు తెస్తున్న విధానాలకు స్వస్తి చెప్పాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రజలు తమ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన తరుణమిది.

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

ఈ ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.



ఎల్లెన్ గ్లాస్గో

# ప్రజావాక్కు



### సమన్వయంతో పనిచేయాలి

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, యుద్ధ వాతావరణాలు నెలకొన్నప్పటికీ భారత్ అభివృద్ధిపథంలో స్థిరంగా ముందుకు సాగుతోందనినీతిఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి పేర్కొనడం ఆశాజనక పరిణామం. వికసిత భారత్‌లక్ష్యసాధనలో ఆర్థికసంస్కరణలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, యువతసాధికారత, మహిళల భాగస్వామ్యం, సహకార సమాఖ్యవ్యవస్థ కీలకపాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే దేశం ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలబడగలదు. మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధే వికసిత భారత్‌కు పునాదిగా మారుతుందని ప్రధాని చెప్పిన మాటల్లో గొప్ప దూరదృష్టి కనిపిస్తోంది. వ్యవసాయం, వ్యాపారం, శాస్త్రసాంకేతిక రంగాలు, నవీన ఆవిష్కరణలలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. అదే సమయంలో మహిళల అభివృద్ధికోసం నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధిశిక్షణ, భద్రతా చర్యలు, ఉద్యోగినుల వసతి గృహాలు, డిజిటల్‌అక్షరాస్యతకార్యక్రమాలను విస్తరించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఫీజుల భారం

విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమైనది. విద్య మన సమాజ అభివృద్ధికి పునాది. అయితే ఇటీవలికాలంలో పెరుగుతున్న ఫీజులు మధ్యతరగతి దిగువమధ్య తరగతి తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో కుటుంబాలు తమ సామర్థ్యానికిమించి ఖర్చుచేయాల్సి వస్తోంది. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ఫీజుల విషయంలో సమతుల్యతఅవసరం. విద్యాసంస్థలు, ప్రభుత్వం, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకుసాగాలి. సామాజిక బాధ్యతలో భాగంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల భారం తగ్గించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### అభివృద్ధికి నోచుకోని గ్రామాలు..

దేశంలో ఇంకా చాలా గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలోఉన్నాయి. గ్రామాలకు నిధులు కేటాయించిన ఇంకా అభివృద్ధి చెందకుండా తగిన మంచినీరు మిగతా సౌకర్యాలకు నోచుకోలేని ప్రజలు ఎంతోమంది ఉన్నారు. సమస్యలను పరిష్కరించకుండా అలాగే వదిలేస్తే అభివృద్ధి కావడం అసంభవం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఎస్.ఎం.ఎస్ చార్జీల మోత!

ఈ మధ్యకాలంలో బ్యాంకులవారు ఎస్.ఎం.ఎస్. ఛార్జీల మ్రోత మ్రోగించడం మరీ ఎక్కువైంది. దీంతో ఎందుకు తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు మాటిమాటికీ కోత పడుతున్నదో తెలియని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఖాతాదారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే పరిస్థితి అనేది ఎలా తయారు అయ్యింది అంటే ఇంట్లో డబ్బు పెట్టుకుంటే రక్షణ సమస్య, అదే బ్యాంకులో వేసుకుంటే ఇలా తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు కేంద్రప్రభుత్వం వారు అనుసరిస్తున్న కొన్ని అర్థం, పర్థంలేనిఅస్థవ్యస్థమైనవిధానాలు ఖాతాదారుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తున్నది. దీంతోప్రజల పరిస్థితి ముందు నొయ్యి వెనుక గొయ్యిలా తయారు అయ్యింది. అంటే మనం కష్టపడి సంపాదించుకొన్న సొమ్ము దొంగల పాలు అయినట్లు ఇలా ఎస్.ఎం.ఎస్‌ల రూపంలో బ్యాంకు వారికి మన సొమ్ము స్వాహా అయిపోతుండటం మరీ విడ్డూరమైన విషయం. ఏది ఏమైనా కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కొన్ని ప్రజావ్యతిరేక నిర్ణయాల మూలాన బ్యాంకులలో డబ్బులు డిపాజిట్ చేయాలంటేనేప్రజలుఒకవిధమైనఅభద్రతాభావానికిగురవుతున్నారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### గురుకుల కాలేజీ తరలించొద్దు

2026-27 విద్య సంవత్సరం నుండి జిల్లా కేంద్రంలో ఉన్న గురుకుల కాలేజీని మారుమూల గ్రామాలకు తరలించడం సరికాదు. విద్యార్థులకువసతి, రవాణా సౌకర్యం లేదు. తగిన సిబ్బంది అవసరం ఉంటుంది. నీటి వసతి, బిల్డింగ్, టీచింగ్ స్టాఫ్‌కు నివాస యోగ్యమైన వసతిఉండాలి. కనుక ప్రభుత్వం జిల్లా కేంద్రం లో ఉన్న గురుకుల కాలేజీలను మారుముల చిన్న గ్రామాలకు తరలింపు అనే ఆలోచన సరికాదు. ఈ విషయం ప్రభుత్వం విరామించుకోవాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### మద్యనిషేధంపై అవగాహన పెంచాలి

భారతదేశం వంటి విభిన్న సాంస్కృతిక దేశంలో మద్యం వినియోగం ఎప్పటినుంచో సామాజిక, ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు మూలమై ఉంది. మద్యం తాగడం వ్యక్తిగత నిర్ణయమని కొందరు అంటారు, కానీదాని ప్రభావం సమాజంపై తీవ్రమైనది. గృహహింస, రోడ్డుప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, పేదరికం మద్యాసక్తివల్లే పెరుగుతున్నాయి. మద్యం వ్యసనం మన సమాజాన్ని నిశ్శబ్దంగా కరిగిస్తున్న రుగ్మత. ప్రతి సంవత్సరం వేలాదిమంది మరణిస్తున్నారు. అయినా మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం కారణంగా ప్రభుత్వాలు పూర్తిగా నిషేధం చడంలో వెనుకడుగు వేస్తుంటాయి.

-కె. రామారావు, రంగారెడ్డిజిల్లా

# ప్రత్యామ్నాయ పంటలే పరిష్కారం

ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను వంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంత కంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగాహనలతో పాటు ప్రభుత్వాల సకాలంలో సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పనతోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయ కేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచ గలదనడంలో ఎటువంటి సందేహం లేదు.



రామ కిష్టయ్య సంగన భట్ల

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, కోట్ల మంది ప్రజల జీవనాధారానికి వ్యవసాయ రంగమే వెన్నెముక అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, దేశీయ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా రుతుపవనాల జూదంగానే సాగుతోంది. దేశం మొత్తం మీద ఏడాది పొడవునా కురిసే వార్షిక వర్షపాతంలో సింహ భాగం, అనగా దాదాపు 75 శాతం వర్షపాతం జూన్ నుండి సెప్టెంబర్ వరకు విస్తరించే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. అందువల్లనే, భారతీయ రైతాంగానికి అత్యంత కీలకమైన ఖరీఫ్ (వర్షాకాలం) పంటల విజయా పజయాలు పూర్తిగా ఈ వర్షాల పంపిణీపైనే ఆధారపడి ఉంటాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్)ప్రభావాలు, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే 'ఎల్‌నినో' వంటి తీవ్ర సముద్ర వాతావరణ పరిస్థితులు రుతుపవనాల గమనాన్ని తీవ్రంగా గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీనిఫలితంగా ఒకే ఏడాదిలో కొన్ని ప్రాంతాల్లో మేఘమథనంతో కూడిన అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో చుక్క నీరు లేని అనావృష్టి ఏర్పడి వర్షపాత పంపిణీలో తీవ్రమైన ప్రాంతీయ అసమతుల్యత చోటు చేసుకుంటోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో కాలం చెల్లిన సంప్రదాయ సాగువిధానాలను పక్కనబెట్టి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలఎంపికలోనూ, సాగు నిర్వహణలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకురావలసిన చారిత్రక అవసరం నేడు రైతాంగంపై ఉంది. శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తే, ఎల్‌నినో అనేది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని సూచించే ఒక సంక్లిష్ట వాతావరణ ప్రక్రియ. పసిఫిక్ సముద్రంలో పెరిగే ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వాతావరణ పీడన వ్యవస్థల్లో మార్పులు వచ్చి, భారతదేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవన గాలులు బలహీనపడతాయి. భారత వాతావరణ శాఖ గత వందేళ్ల చారిత్రక గణాంకాలను పరిశీలిస్తే, దేశంలో నమోదైన భయంకరమైన కరవు సంవత్సరాలలో అత్యధిక భాగం ఎల్‌నినో ప్రభావంతో కూడుకున్నవేనని స్పష్టమవుతోంది. ఉదాహరణకు, 2002లో ఎల్‌నినో కారణంగా దేశంలో 19 శాతం వర్షపాత లోటు ఏర్పడి అపార పంట నష్టం సంభవించింది. అలాగే 2009లో గత నాలుగు దశాబ్దాలలోనే అత్యంత తీవ్రమైన కరవు నమోదైంది. ఆ తర్వాత 2015, ఇటీవలి 2023 సంవత్సరాలలో సైతం ఎల్‌నినో దేశవ్యాప్త వర్షపాతంలో భారీ లోటును మిగిల్చింది, తద్వారా జలాశయాలలో నీటి మట్టాలు పడిపోయి, భూగర్భ జలాధారాలు అడుగంటి వ్యవసాయ రంగం తీవ్రసంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలోనే ప్రారంభంకావాల్సి ఉన్నప్పటికీ, ఎల్‌నినో సంవత్సరాల్లో వర్షాలు వారాల తరబడి ఆలస్యమవడం లేదా ప్రారంభంలో కురిసి ఆ తర్వాత సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడటం సర్వసాధారణం. జూన్, జూలై నెలల్లో కురిసే తొలి వర్షాలను నమ్మి రైతులు తొందరపడి విత్తనాలు చల్లితే, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో నేలలోనే విత్తనాలు మాడిపోయి మొలకెత్తని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది రైతులకు పెట్టుబడి నష్టాన్ని మిగల్చడమే కాకుండా, మళ్లీ విత్తవలసిన దుస్థితికి దారితీస్తుంది. ఇటువంటి అనిశ్చిత సమయాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రాథమిక సూచన ఏమిటంటే, రైతులుతొందరపాటు పడకుండా తమ ప్రాంతంలో కనీసం 75నుండి 100 మిల్లీ



మీటర్ల వరకు స్థిరమైనతగినంత వర్షపాతంనమోదై, భూమి లోపలి పొరల వరకు తేమచేరినట్లు నిర్ధారించుకున్నతర్వాతే ప్రధాన పంటల విత్తన ప్రక్రియను ప్రారంభించాలి. ఒకవేళ కాలంగడుస్తున్నా వర్షాలు పడకపోతే, సుదీర్ఘకాల పరిమితి గల పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలను ఎంచుకోవడ మంచిది. ఇందు కోసం ఆయా రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలు రూపొందించే 'ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను' నిరంతరం గమనిస్తూ అమలు చేయాలి. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో జూన్ మాసంలో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశెనగ, వరి వంటి సాంప్రదాయ ఖరీఫ్ పంటల సాగు జోరందుకుంటుంది. అయితే వర్షాలు జూలై మొదటివారం వరకు ఆలస్యమైతే, రైతులు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. ఎక్కువ నీరు, ఎక్కువ కాలం తీసుకునే రకాలకు బదులుగా స్వల్పకాలిక మొక్కజొన్న రకాలు, పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు లేదా నువ్వులు వంటి నూనెగింజల పంటల వైపు మళ్లడం ఎంతో శ్రేయస్కరం. ఒకవేళ వర్షాభావం మరింత తీవ్రమై జూలై రెండో పక్షం లేదా ఆగస్టు వరకు కూడా తగినంత వర్షపాతం లేకపోతే, అసలు సంప్రదాయ పంటల ఆలోచనే పక్కనబెట్టి జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరు ధాన్యాల (మిల్లెట్స్) సాగుకు శ్రీకారం చుట్టాలి. ఈ తృణ ధాన్యాలు అత్యంత తక్కువ నీటి లభ్యతతో, కరవు పరిస్థితులను సైతం తట్టుకుని అద్భుతంగా పెరుగుతాయి. పైగా ప్రస్తుత కాలంలో ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడం వల్ల మార్కెట్‌లో ఈచిరుధాన్యాలకు పప్పుధాన్యాలకు అత్యధిక డిమాండ్, మద్దతు ధర లభిస్తుండటం రైతులకు అదనపు ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. తెలుగురాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఖరీఫ్ సీజన్ అనగానే అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగుచేయడం కనిపిస్తుంది. పత్తి లాభదాయక పంట అయినప్పటికీ, దానికి ప్రారంభదశలోనూ, పూత, కాత దశల్లోనూ సమతుల్యమైన తేమ అవసరం. ఎల్‌నినో సృష్టించే వర్షాభావ పరిస్థితుల్లో పత్తి మొక్కల పెరుగుదల క్షీణించి, దిగుబడులు దారుణంగా పడిపోతాయి. కాబట్టి, వాతావరణం అనుకూలించనప్పుడు పత్తిసాగు విస్తీర్ణాన్ని ఐచ్ఛికంగా తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా అంతర పంటల పద్ధతిలో కంది, పెసర, మినుము వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా, ఒక పంట దెబ్బతిన్నా మరో పంట ద్వారా పెట్టుబడిని రాబట్టుకునే వీలుంటుంది. ఇక తెలుగు ప్రజల ప్రధాన ఆహార పంట అయిన వరి సాగు విషయానికి వస్తే, నీటి వినియోగంపై పెను మార్పులు రావాల్సి ఉంది. ఎకరానికి వేల లీటర్ల నీరు అవసరమయ్యే సంప్రదాయ వరద నీటి పద్ధతి వరి సాగుకు ఎల్‌నినో కాలంలో స్వస్తిచెప్పకతప్పదు. సుదీర్ఘ కాలపరిమితి గల వరిరకాల స్థానంలో 120 రోజుల లోపు పండే స్వల్పకాలిక, నీటి ఎద్దడిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి. అలాగే, సాంప్రదాయ పద్ధతిలో నారు పోసి, నీరు నిలగట్టి నాట్లు వేసే విధానానికి స్వస్తి పలికి, 'నేరుగా విత్తే వరి పద్ధతి' లేదా 'శ్రీ వరి విధానం' వంటి అధునాతన నీటి పొదుపు సాంకేతికతలను అవలంబించాలి. ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను పంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంత కంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగా హనలతో పాటు ప్రభుత్వాల సకాల సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పన తోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయ కేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచగలదనడంలో ఎటువంటి సందేహం లేదు. ●

# పరిమితులతో డిజిటల్ అడిక్షన్‌కు చెక్!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

భారతదేశ వ్యాప్తంగా బాలలు, కౌమార దశ యువతలో క్రమంగా స్క్రీన్ టైమ్ పెరుగుతూ, డిజిటల్ వ్యసనం బారినపడుతూ, తమ ఆరోగ్యాలను మొగ్గ స్థాయిలోనే కోల్పోతున్నారని పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన 2025-26 ఆర్థిక సర్వే హెచ్చరికలు చేయడం గమనార్హం. స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, గేమింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లతో మితిమీరిన వాడకంతో వారి చదువులపైననే కాకుండా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలపై కూడా తీవ్రమైన దుష్ప్రభావాలను చూపుతున్నట్లు సర్వే పేర్కొంటున్నది. వయస్సు ఆధారిత డిజిటల్ పరిమితులను విధించవలసిన సమయం ఆసన్నమైనదని హెచ్చరికలు చేసింది. అపరిమిత డిజిటల్ వినియోగదారుల్లో అధికంగా బాలలు, కౌమార దశ పిల్లలు ఉండడంతో రేపటి భారత భవిష్యత్తు సంక్షోభంలో పడవచ్చని, హానికరమైన కంటెంట్ ఉన్న యాప్‌ల్లో మునిగి తమ చిరు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. డిజిటల్ వ్యసనం మితిమీరితే పిల్లలు మానసిక క్షోభ, క్రియాత్మక బలహీనతలకు దారి తీస్తుందని సర్వే నిర్వచిస్తున్నది. డిజిటల్ అడిక్షన్ హద్దులు దాటితే ఏకాగ్రత క్షీణించడం, నిద్రలేమీ సమస్యలు ఉత్పన్నం కావడం, ఆందోళన, నిరాశ, ఒత్తిడి ప్రమాదకర స్థాయికి పెరగడం, విద్యార్జన కోరిక తగ్గడం, సామాజిక సంబంధాలు తగ్గడం, ఒంటరితనం వేధించడం, చురుకుదనం మాయంకావడం, నైపుణ్యాలు తగ్గడం, పనితీరు క్షీణించడం, ఉత్పాదకత తగ్గడం లాంటి పలు అనర్థాలు జరుగుతున్నట్లు గమనించారు. పెద్దల్లో సైతం డిజిటల్ స్క్రీన్ టైమ్ పెరగడంతో సైబర్ మోసాలు, బెదిరింపులు పెరగడం, ఆన్‌లైన్ ఖర్చులు పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గడం, ఉత్పాదకత పడిపోవడం గమనిస్తున్నాం. డిజిటల్ అడిక్షన్ వలలో చిక్కి3నుంచి5 గంటలకు పైగా నీలి తెరల ముందు కూర్చున్న పిల్లల్లో శారీరక శ్రమతగ్గడం వల్లప్రమాదకర జీవనశైలి వ్యాధులు పెరగడం గమనిస్తున్నామని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డిజిటల్ అడిక్షన్ దుష్ప్రభావాలను తగ్గించేందుకు 'డిజిటల్ ఫాస్టింగ్' వ్రతం చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి ప్రతి రోజు కొన్ని గంటల పాటు లేదా వారానికి 1లేదా 2రోజుల పాటుస్మార్ట్ తెరలకు దూరంగా ఉండడాన్ని డిజిటల్ ఫాస్టింగ్ (ఉపవాసం) అని పిలుస్తున్నాం. 2024లో భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారులు 43శాతం సామాజిక మాధ్యమాలను వాడినట్లు సర్వేలు నిర్ధారిస్తున్నాయి. పాఠశాలల్లో శారీరక వ్యాయామం తప్పనిసరి చేయడంతో పాటు స్క్రీన్‌టైమ్ నిర్వహణపై తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని సూచిస్తున్నారు. దీనితోపాటుగా వయస్సును బట్టి డిజిటల్ యాక్సస్ విధానాలు, హానికర కంటెంట్ విపరీతాలను అదుపుచేయడం, స్క్రీన్ టైమ్‌ను విధిగాతగ్గించడం జరగాలి. ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్దిష్టవయస్సుకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలపై నిషేధంవిధించడం ఇతర దేశాలను మార్గదర్శకం చేయాలి. దక్షిణకొరియా సైతం షట్‌డౌన్ చట్టంద్వారామైనర్లుగేమింగ్ వెబ్‌సైట్లను వాడ కుండా పరిమితులు విధించడం హర్షదాయకం. ఇదేక్రమంలో సింగపూర్, ఫ్రాన్స్, స్పెయిన్, ఫిన్లాండ్, జపాన్, బ్రెజిల్, కొన్ని యూఎస్ రాష్ట్రాలు కూడా డిజిటల్ అడిక్షన్ విషయంలో తగుచర్యలను తీసుకుంటున్నాయి. ●

# అప్పుల పునాదులపై ఆశల సౌధం

నిలేష్

సొంతిల్లు..ప్రతి సామాన్యుడి జీవితంలో అతిపెద్ద కల. కానీ ఆ గూడు కట్టుకునే క్రమంలో మధ్యతరగతి ప్రజలు తమ బతుకుల్ని, పిల్లల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారన్నది ఇప్పుడు తీవ్రఆందోళన కలిగిస్తున్న అంశం. 'అందరికీ సొంతిల్లు', 'సులభమైన వాయిదాలు' అంటూ ఊరిస్తున్న ప్రకటనల వెనుక..రక్తం పీల్చుతున్న ఈఎంఐల వాస్తవ పరిస్థితులు మన కళ్లముందే కదలాడుతున్నాయి. ఒకప్పుడు రిటైర్మెంట్ వయసుకు దగ్గర పడుతున్నప్పుడు మాత్రమే సొంతింటి గురించి ఆలోచించేవారు. నేటి కార్పొరేట్ కల్చర్, బ్యాంకులు ఇస్తున్న భారీ రుణాలు, సమాజంలో పెరుగుతున్న పోటీతత్వం యువతనుపాతికేళ్లకే ఇంటి రుణాలవైపు నెడుతున్నాయి. స్తోమతకు మించి భవిష్యత్తులో రాబోయే జీతాన్ని ముందే లెక్కలేసుకుని లక్షలకు లక్షలు అప్పులు చేస్తున్నారు. కానీ ఊహించని ఆర్థిక మాంద్యాలు, ఉద్యోగాల్లో కోతలు వారి లెక్కలను తలకిందులు చేస్తున్నాయి. నెల ఒకటో తేదీ రాగానే భయం వేస్తోంది. నా జీతం 60వేలు, అందులో 40వేలు ఈఎంఐకేపోతోంది. మిగిలిన 20వేలతో ఇంటి అద్దె, రేషన్, పిల్లల ఫీజులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు' అంటూ సగటు ఓ ప్రైవేట్ ఉద్యోగి కన్నీటి పర్యంతమవడం వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఇది ఒక్కరి పరిస్థితే కాదు. చాలామంది జీవితాలు ఈఎంఐల కొరల్లో నలిగిపోతున్నాయి. నెలసరి వాయిదాలు చెల్లింపుల కోసం మధ్యతరగతి కుటుంబాలు తమ ప్రాథమిక అవసరాలను సైతం త్యాగం చేస్తున్నాయి. చిన్నచిన్న కోరికలను చంపుకుంటున్నాయి. విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని భావించే క్రమంలో పిల్లలను నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నాయి. నెలవారీ వాయిదాల భయంతో పిల్లలను మంచి స్కూళ్లలో చదివించలేక సాధారణ పాఠశాలలకు మారుస్తున్న తల్లిదండ్రులు ఎందరో. అటు అప్పులు తీర్చలేని క్రమంలోఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించాల్సిన దుస్థితి బడుగు జీవులది. చిన్నపాటి జబ్బులొస్తే ఆసుపత్రికి వెళ్లకుండా మెడికల్ షాపుల్లో మందులు, మాత్రలు తెచ్చుకుని సర్దుకుపోవాల్సిన సందర్భాలు అనేకం. ఇక పెద్ద వైద్యంఖర్చు వస్తే అప్పుల పాలే గతి. సాధారణంగా మధ్యతరగతి వారి ఆదాయం పరిమితంగా ఉంటుంది. బ్యాంకులోను తీసుకుని ఇల్లు కొన్నప్పుడు, ఆ ఆదాయంలో సగానికి పైగా నెలసరి వాయిదాలకే సరిపోతుంది. ఏళ్లు గడుస్తున్నా జీతాలు పెరిగే వేగం కంటే ఖర్చులు పెరిగే వేగం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం వల్ల నెలాఖరు వచ్చేసరికి జేబులు ఖాళీ అవుతున్నాయి. అనుకోని వైద్య ఖర్చులు రావడం, ఉద్యోగంలో ఒడిదుడుకులు ఎదురవడం, ఆర్థిక మాంద్యం వంటి పరిస్థితులు సగటు పేద, మధ్యతరగతి జీవిని మరింత కృంగదీస్తున్నాయి. ఇలాంటి చిన్నకుదుపు వచ్చినా సరే వారి ఆర్థిక ప్రణాళిక పేకమేడలా కూలిపోతోంది. నెలసరి వాయిదాలు సమయానికి చెల్లించలేక బ్యాంకుల నుంచి వచ్చే ఒత్తిళ్లు వారి ప్రశాంతతను పూర్తిగా దూరం చేస్తున్నాయి. వెంటా



డుతున్న ఆర్థిక ఇబ్బందులు వేధిస్తున్న అప్పులు ఒకపక్క ఇంటి ఈఎంఐ కట్టడానికి, మరోపక్క ఆ నెల గడవడానికి మధ్యతరగతి ప్రజలు క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, అధిక వడ్డీలకు బయట అప్పులు చేయడం ప్రారంభిస్తారు. ఇది ఒక ప్రమాదకరమైన విషవలయం లాంటిది. ఒకఅప్పు తీర్చడానికి మరోఅప్పు చేయడం. వడ్డీల మీద వడ్డీలు పెరిగిపోయి అసలు కంటే వడ్డీలే భారంకావడం వంటి పరిణామాలు బలవన్మరణాలకు ఉసిగొలుపుతున్నాయి. మరో మార్గం కానరాక ఆత్మహత్యలే శరణ్యం అనుకునే పరిస్థితికి దారితీస్తున్నాయి. ఈ చక్రంలో చిక్కుకుని నిత్యం అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక, పరువుపోతుందన్న భయంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కరోనా తర్వాత పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. ఉద్యోగాలు కోల్పోయిన వారు, వ్యాపారాల్లో నష్టపోయిన వారు ఈఎంఐలు కట్టలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రికవరీ ఏజెంట్ల వేధింపులు తాళలేకపోతున్నారు. ఒక్క నెల వాయిదా దాటితే చాలు.. బ్యాంకుల నుంచి వరుస ఫోన్ కాల్స్. రెండు నెలలు దాటితే ఇంటి ముందుకు రికవరీ ఏజెంట్లు. పరువుపోతుందనే భయంతో, ఆ క్షణానికి గట్టెక్కడానికి అప్పుల మీద అప్పులు, క్రెడిట్ కార్డుల మీద నగదు విత్‌డ్రాలు చేస్తూ ఊబిలో కూరుకుపోతున్నారు. 'సొంతిల్లు' అనే సామాజిక హోదా కోసం, ఏమాత్రం ఆర్థిక ప్రణాళిక లేకుండా వేసే అడుగులు జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని చెప్పడానికి అనేకమంది పేద మధ్యతరగతి జీవుల గాథలే సజీవ సాక్ష్యం. ఇల్లు కొనాలనుకునే ముందు మన స్తోమత ఏంటి? అత్యవసర పరిస్థితులు వస్తే తట్టుకునే ప్రత్యామ్నాయం ఉందా? అని ప్రతి ఒక్కరూ తమనుతాము ప్రశ్నించుకోవాల్సిన సమయం ఇది. గృహ రుణం తీసుకునే సమయంలో నెలవారీ ఈఎంఐలు చెల్లించగలమనే నమ్మకం ఉన్నప్పటికీ కాలక్రమేణా పరిస్థితులు మారిపోతుంటాయి. చాలా కుటుంబాలు ఇతర అవసరాలను వాయిదా వేసుకుంటూ, తమ కోరికలను త్యాగంచేస్తూ ఈఎంఐలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొందరు అదనపు ఉద్యోగాలు చేయడం, వ్యక్తిగత రుణాలు తీసుకోవడం వంటి మార్గాలను ఆశ్రయిస్తున్నారు. అయితే పరిస్థితులు మరింత క్లిష్టంగా మారినప్పుడు ఈఎంఐలు చెల్లించడం కష్టసాధ్యమవుతోంది. నెలవారీ వాయి దాలు చెల్లించలేక బ్యాంకుల నుంచి నోటీసులు అందుకో వడం, జరిమానాలు పడటం, క్రెడిట్ స్కోర్ దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇళ్లను వేలం వేసే పరిస్థితులు కూడా తలెత్తుతున్నాయి. దీంతో సొంతింటి కల ఆనందాన్ని ఇవ్వాల్సిన చోట ఆందోళనలకు కారణమవుతోంది. సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అందమైన భావోద్వేగం, కానీ అది మన రోజువారీ ప్రశాంతతను హరించేదిగా మారకూడదు. తమ ఆదాయం, భవిష్యత్ అవసరాలను కచ్చితంగాఅంచనా వేసుకుని మాత్రమే ఇంటి బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి. కనీసం ఆరు నెలల ఈఎంఐలు, ఇంటి ఖర్చులకు సరిపడా డబ్బును అత్యవసర నిధిగా పక్కన పెట్టిన తర్వాతే ఇంటి లోన్‌కు వెళ్లడం సురక్షితం. అదే సందర్భంలో కలలు కనడం తప్పు కాదు, కానీ ఆ కలల సాకారం మన వర్తమానాన్ని, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేదిగా ఉండకూడదు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

## కోల్‌కత్తాలో మంత్రి లోకేష్ నేడు ఐసిసి సదస్సుకు హాజరు

**విజయవాడ,జూన్18,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడులే లక్ష్యంగా ప్రతి అవకాశాన్ని ఏపీ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వినియోగించుకుంటున్నారు.ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం కోల్ కతా నగరానికి వెళ్ళారు. అక్కడ పశ్చిమ బంగా ప్రభుత్వ అధికారులు. స్థానిక తెలుగు సంఘం సభ్యులు, టీడీపీ శ్రేణులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.ఇక ఈ నెల 19న శుక్రవారం ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఐసిసి) ఆధ్వర్యంలో ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాల్లు అనే అంశంపై ఐటీసీ సోనార్ హోటల్ లో జరిగే ప్లీనరీలో పాల్గొంటారు.

## ఎక్సైజ్ శాఖలో ఇద్దరికి పదోన్నతి

**విజయవాడ,జూన్18,ప్రభాతవార్తప్రతినిధి:** ఎక్సైజ్ శాఖలో ఇద్దరు అధికారులకు పదోన్న తులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్ శాఖలో అదనపు కమిషనర్‌గా వి.అనసూయదేవికి, ఎక్సైజ్‌శాఖలో జాయింట్ కమిషనర్‌గా డి.శ్రీకాంత్‌రెడ్డికి పదోన్నతి ఇచ్చారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని వాటిలో స్పష్టం చేసారు.

## పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులలో ప్రవేశాలు

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి పలు కోర్సులలో ప్రవేశాల కోసం అర్హత గల అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి సర్టిఫికేట్ కోర్స్ ఇన్ పల్లియేటివ్ కేర్ పిజిడిప్లొమా ఇన్ డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ డిప్లొమా ఇన్ యోగా,పిజి డిప్లొమా ఇన్ యోగా ఆసక్తిగల అభ్యర్థినులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఎస్‌పిఎంవివి. ఎసి. ఇన్"నుండి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తును జులై 15వతేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య పి. సువర్ణలతా దేవి తెలిపారు.కోర్సుల అర్హతలు, ఫీజులు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాల కోసం"డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. ఎస్‌పిఎం వివి. ఎసి.ఇన్" వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని ఆమె పేర్కొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ గురువారం విడుదల చేశారు. ఇంటర్ ఫలితాల లింక్ ద్వారా లేదా వాట్సప్ నంబర్ 9552300009 ద్వారా రిజల్ట్స్ తెలుసుకోవచ్చని తెలిపారు. ఇంట ర్మీడియట్ లో రెండో ఏడాది విద్యార్థులకూ ఇంప్రూవ్‌మెంట్ రాసుకునే అవకాశం కల్పించడంతో 1.83 లక్షల మందికి పైగా విద్యా ర్థులు తమ మార్కులను మెరుగు పరుచుకున్నారని మంత్రి వెల్లడించారు. ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసిన 91,303 మందిలో 48,149 మంది (53 శాతం) విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని లోకేశ్ వివరించారు. కొత్తగా పరీక్షరాసిన 1,02,018 మందిలో 57,327 మంది (56శాతం) విద్యార్థులు పాసై, తమ స్కోరును పెంచుకున్నారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులందరూ ఉన్నత చదువుల వైపు మరింత ఆత్మవిశ్వా సంతో అడుగులు వేయాలని, వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గతంలో ఫెయిల్ అయిన దాదాపు 1లక్ష మంది విద్యార్థులు ఈ పరీ క్షల ద్వారా పాసై, తమ విద్యాసంవత్సరాన్ని కాపాడు కున్నారని లోకేశ్ పేర్కొన్నారు. పట్టుదలతో శ్రమించి పరీక్షల్లో విజయం సాధించి మార్కులు మెరుగు పరుచుకున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ప్రథమసంవత్సరం పరీక్ష రాసిన 2,29,034 మందిలో 1,35,435 మంది (59 శాతం) విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకున్నారని వివరించారు. కొత్తగా పరీక్ష రాసిన 1,09,003 మందిలో 42,379 మంది (39 శాతం) విద్యార్థులు పాసై, మార్కులను పెంచుకున్నారని లోకేశ్ వెల్లడించారు. ఈ ఏడాది ఇంటర్ సెకండియర్ విద్యార్థులకూ ఇంప్రూవ్ మెంట్ సదుపాయం కల్పించారు.గతంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉండగా ఈసారి ద్వితీయ ఇంటర్ విద్యార్థులూ తమ మార్కుల్ని మెరుగు పరుచుకొనే అవకాశం కల్పిం చారు. విద్యార్థి రాసిన పరీక్షల్లో ఏ ప్రయత్నంలో ఎక్కువ మార్కులు వస్తే, వాటినే తుది ఫలితంగా పరిగణిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఇంప్రూవ్‌మెంట్ రాసే అవకాశంలేదు. ఇతర రాష్ట్రాల బోర్డుల్లో అమల్లో ఉన్న ఇంప్రూవ్ మెంట్ విధానాలను పరిశీలించిన అనంతరం చర్చించి ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

## మారుమూలాలకు బిఎస్ఎన్ఎల్ సేవలు విస్తరించాలి

### చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు




గురువారం టెలికం అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి దగుమళ్ళ ప్రసాదరావు

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బిఎస్ఎన్ఎల్ సేవలను చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో మారుమూల గ్రామాలకు చేరువ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చిత్తూరు ఎంపి దగ్గుమళ్లప్రసాదరావు, బిఎస్ఎన్ఎల్ పిజిఎం ఎవి కుమార్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని 57 కొత్త 4జి మొబైల్ టవర్స్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని బిఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం టెలికాం అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ ఛైర్మన్ చిత్తూరు ఎంపి ప్రసాదరావు అధ్యక్షత వహించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లోని మారుమూల గ్రామాలకు సైతం చేరువ చేసేందుకు పటిష్ట చర్యలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వ సహకారంతో బిఎస్ఎన్ఎల్ చేపట్టిన 4జి సాచురేషన్ టవర్ ప్రాజెక్టు పనులు, ఫైబర్ కనెక్టివిటీ సేవలకు సంబంధించిన పలు అంశాల పై సమీక్షించారు. బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలనీ, బిఎస్ఎన్ఎల్ సేవలను విస్తృత పరచాలని టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. అలాగే వినియోగదారులు తమ సమస్యలను సలహా మండలి దృష్టికి తీసుకొచ్చి, పరిష్కారం పొందాలని ఆయన కోరారు. బిఎస్ఎన్ఎల్ పిజిఎం కుమార్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 112 టెలికాం 4జిను నిర్మించినట్లు చెప్పారు. వీటి ఏర్పాటు వల్ల సిగ్నల్స్ అందని, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో 57 కొత్త 4జి మొబైల్ టవర్స్‌ను పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించుకుని ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఇందులో ముఖ్యంగా చిత్తూరు పార్లమెంటు పరిధిలో 22, తిరుపతి పార్లమెంటు పరిధిలో 14, రాజంపేట పార్లమెంట్ పరిధిలో 14 టవర్లను ఏర్పాటు చేసి, త్వరితగతిన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాజె క్టు వలన గ్రామీణ ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరిస్తాయని, పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవిన్యూ, రోడ్లు భవనాలు, అటవీశాఖ విభాగా లకు సంబంధించి, ఏదైనా అవరోధాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికా రులతో చర్చించి, సమస్యకు పరిష్కారాన్ని చూపు తానని ఎంపీ దగ్గుమళ్ళ అన్నారు. ఈ సమా వేశంలో బిఎస్ఎన్ఎల్ డిజిఎంలు వెంకోబారావు, జయశంకర్, దామోదర్, శివరాం, సిబ్బంది, జిల్లాలోని ఎజిఎం,డిఇలు పాల్గొన్నారు.

## విలాసాల కోసం దొంగతనాలు: నలుగురు అరెస్ట్




గురువారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలోని పలు మండలాల్లో,పట్టణాల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలనే లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడిన ముఠాను తిరుపతి క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. తిరుపతి నగరంతోబాటు శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాల్లో సుమారు 8బంగారు గొలుసు దొంగతనాల కేసులను పోలీసులు చేధించారు. సుమారు 17 లక్షల రూపాయలు విలువైన 128 గ్రాముల (16 సవర్లు) బంగారు ఆభరణాల స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు వినియోగించిన రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు వారినుండి రాబట్టారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఈ వివరాలను మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. గత కొంతకాలంగా ఓజిలి, నాయుడుపేట పరిసర మండలాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలలోని బంగారు గొలుసులను లాక్కెళ్లే చైన్ స్నాచింగ్ ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బా రాయుడు ఆదేశాల మేరకు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసులు,నాయుడుపేట డిఎస్పీ జి. చెంచుబాబు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. నాయుడుపేట రూరల్ సిఐ జి.సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ కె. శ్రీకాంత్ వారి సిబ్బంది నిఘాలో పిగిలాం నరేంద్ర అలియాస్ నవీన్, బల్లి లికిత్ కుమార్ అలియాస్ లిఖిత్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి బంగారుగొలుసులు-6, బంగారు చెవికమ్మ, 128 గ్రాములు (16 సవర్లు), బంగారు నగలుతోబాటు మోటార్ సైకిల్ ,స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు ఓజిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు మహిళల వద్ద, నాయు డుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళల వద్ద, చిట్టమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద, బాలాయపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద, కోట పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ఒక మహిళ వద్ద చైన్ స్నాచింగ్ లకు పాల్పడినట్లు అంగీకరించారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో నేరాల వైపు అడు గులు వేస్తున్న యువత తమ జీవితాలను తామే నాశనం చేసుకుంటున్నారు. నేరాలకు పాల్పడే వారిని అత్యాధునిక సాంకేతిక సహాయంతో కఠిన చర్యలు తీసుకొని వారిని చట్టం ముందు నిలబెడతామన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలు కని పించిన వెంటనే అత్యవసర సేవల నంబర్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఇంకా నిందితులు నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంకు చెందిన బల్లి వెంకటేశ్వర్లు (34),4. పిగిలాం గణేష్ (32)లను అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో డిఎస్పీలు చెంచు బాబు (నాయుడుపేట), శ్యాంసుందర్ (క్రైమ్)), సిఐలు సంఘమేశ్వర రావు, శివకుమార్ రెడ్డి ,సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఆర్వీ రాజు ,కానిస్టేబుల్ ఎన్. గంగాధర్ ఈ.భాస్కర్ ,ఎస్. వినయ్ కుమార్ లను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

## తిరుమల సమాచారం

### 24న భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం



**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆలయంలోని శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన భోగ శ్రీనివాసమూర్తిని ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని ఆలయంలో 24వ తేది ప్రత్యేక సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. తిరుమల ఆలయంలో పల్లవరాణి సామవై కొన్ని వందల సంవత్సరాల కిందట ఈమూర్తిని కోలువుచేశారు. 24వతేదీ ఉదయం శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేతమలయప్పస్వామి , భోగ శ్రీనివాసమూర్తి, విష్వక్సేనులని వేంచేపు చేస్తారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో కౌతుకమూర్తి మనవాళ పెరుమాళ్(శ్రీభోగ శ్రీనివాసమూర్తి)ను, ఆయనకు అభిముఖంగా విష్వక్సేనులవారిని ఆశీనులు చేస్తారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని భోగ శ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేస్తారు. అనంతరం వేద పండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ప్రత్యేక సహస్ర కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలో 24వతేదీ ఆర్జిత సేవలన్నీ యథావిధిగా నిర్వహించనున్నారు.

### ఎస్వీ ఆపన్న హృదయట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు,ట్రస్ట్‌లకు దాతలు తమ వంతుగా విరాళాలందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్ సంస్థ గురువారం టిటిడి వేంకటేశ్వర ఆపన్న హృదయ పథకానికి కోటి రూపాయలు విరాళంగా అందించింది. ఆసంస్థ ప్రతినిధులు టిటిడి ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో అధికారులకు చెక్కును అందజేశారు.

### శ్రీవారి కృపతో 'మా ఇంటి బంగారం' విజయం సాధిస్తుంది: నటి సమంత



**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మా ఇంటి బంగారం చిత్రం ఘన విజయం సాధిస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేసింది.మా ఇంటి బంగారం చిత్ర బృందం గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నటి సమంతతోబాటు ప్రముఖ దర్శకుడు రాజ్ నిడమోరు,మా ఇంటి బంగారం చిత్రబృందం ఉన్నారు. నేడు శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తన సరికొత్త చిత్రం మా ఇంటి బంగారం విజయవంతం కావాలని కోరుకుంటూ స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నామన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సమంతకు వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.



### నాణ్యమైన పప్పు దినుసులు సరఫరా చేయాలి
### పప్పు మిల్లర్లతో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి


**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో అన్నప్రసాదాల తయారీలో నాణ్యమైన పప్పు దినుసులను వినియోగించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన పప్పుమిల్లర్లతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి సమావేశమయ్యారు. గత కొన్నేళ్లుగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ పప్పు మిల్లర్ల నుంచి కూడా నాణ్యతతో పాటు అవసరమైన పరిమా ణంలో పప్పు దినుసులు సరఫరా చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆంధ్రప్రదేశ్ పప్పు మిల్లర్ల ప్రతినిధులు, ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులకు మహా యజ్ఞంగా అన్నప్రసాదాలు అందిస్తున్న టిటిడి సేవలో భాగస్వాములై, నాణ్యమైన పప్పు దినుసులను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం పప్పు మిల్లర్ల నుంచి పప్పు దినుసుల కొను గోలుకు ఉన్న పారదర్శకమైన విధానాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆదే శించారు.గురువారం మధ్యాహ్నం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో సుధర్మ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిటిడికి అవసరమైన పప్పు దినుసుల నాణ్యత, పరిమాణం, సరఫరా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రోజువారీ అన్నప్రసాదాల తయారీలో శనగలు, పొట్టు తీసిన మినుములు, పొట్టుతో కూడిన మిను ములు, కందిపప్పు, పెసరపప్పు, వేరుశెనగలు వంటి ఏడు రకాల పప్పు దినుసులను టిటిడి వినియోగిస్తోందని అదనపు ఇఒతెలిపారు. ఈ సమావేశంలో అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, వేర్ హౌసింగ్ డిప్యూటీ ఇఒ పద్మావతి, జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఉమాశంకర్, పోటు ఎఇఒ మునిరత్నం, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి కెఎల్ఎన్ శాస్త్రి, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

### గంగమ్మ దర్శనంతో మనసు ఆనందం

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగర గ్రామదేవత తాతయ్యగుంటగంగమ్మ దర్శనంతో మనసు ఎంతో ఆనందం కలిగిందని యాంకర్ శ్రీము ఖి తెలిపారు. ఇటీవల అమ్మవారికి జాతరలు జరిగా యని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవా రిని వేడుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం ఆలయంకు విచ్చేసిన శ్రీముఖికి ఆలయ కమిటీ ఛైర్మ న్ నైనార్ మహేశ్‌యాదవ్, ఇఒ జయకుమార్ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు, అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## సర్కారు బడిలో కలెక్టర్ కొడుకు..

### ఆదర్శంగా నిలిచిన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి
### ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని పెంచిన కలెక్టర్ నిర్ణయం



**వీరఘట్టం, జూన్ 18 ప్రభాతవార్త:** ఆయన జిల్లాకు కలెక్టర్, అంతే కాదు జిల్లా మేజిస్ట్రేట్ కూడా. అంత పెద్ద హోదాలో ఉన్న ఆయన అవన్నీ పక్కనపెట్టి తన కుమారుడిని సర్కార్ బడిలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడు, ఉన్నతాధికారులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ముందుకు రావడం విశేషమే మరి. కలెక్టర్ కుమారుడైన ఎన్.క్రిష్ ధరణ్ రెడ్డిని పార్వతీపురంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సమాజానికి ఒక గొప్ప ఆదర్శంగా నిలిచి అందరికీ చెప్పడమే కాదు చేసి చూపించారు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి.

**మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతిలో ప్రవేశం**

కలెక్టర్ కుమారుడు క్రిష్ ధరణ్ రెడ్డి గతంలో విజయవాడలోని పడమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. కాగా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆయనను పార్వతీపురంలోని ప్రతిష్టాత్మక డాక్టర్ దిండిగల్ వెంకట్రావు మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో పదో తరగతిలో చేర్పించారు. ఒక జిల్లా మేజిస్ట్రేట్ స్థాయి అధికారి తన కుమారుడిని తమ పాఠశాలలో చేర్పించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, బాధ్యతాయుతంగా పని చేస్తామని వారు గర్వంగా చెబుతున్నారు. అయితే ఈ పాఠశాలకు ఇలాంటి ఘనత దక్కడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలో ఇక్కడ ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన కూర్మనాథ్ సైతం తన కుమారుడిని ఇదే మున్సిపల్ పాఠశాలలో చదివించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తమకున్న మక్కువను చాటుకున్నారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్ కూడా అదే బాటలో నడవడంతో స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభిస్తోంది. మరి కలెక్టర్‌ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పిల్లలు కూడా సర్కార్ బడుల్లోనే చేర్పిస్తారా, లేదా కార్పొరేట్ పాఠశాలల్లోనే కొనసాగిస్తారా అనేది వేయికళ్లతో వేచి చూడాలి మరి.

## మనస్థాపంతో మహిళ మృతి

**సంతకవిటి (విజయనగరం జిల్లా), జూన్ 18 (ప్రభాతవార్త):** సంతకవిటి మండలంలో రామరాయపురం గ్రామానికి చెందిన కళావతి పొందూరు మండలంలో పెనుబర్తి సమీపాన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. అయితే దొంగతనం కేసులు కళావతిని, కుమారుడు చిరంజీవిని పోలీసులు పదేపదే విచారణ చేయడంతో ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని కుమారుడు చిరంజీవి చెప్పాడు. అయితే రామారాయంపురం గ్రామంలో గత నెల 25వ తేదీన ఒక వ్యక్తి ఇంట్లో నాలుగు తులాల బంగారం, పదివేల నగదు దొంగతనం జరిగింది.

## ఆర్‌డిఎస్ఎస్ పనులు వేగవంతం: ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జూన్ 18 ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నం ద్యాల, అనంతపురం శ్రీ సత్యసాయి జిల్లాల్లో పునర్వ్యవస్థీకరణ విద్యుత్ పంపిణీ పథకం (ఆర్ డి ఎస్ ఎస్) కింద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి ఆదేశించారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురు వారం ఆర్‌డిఎస్ఎస్ పనులపై సంస్థ అధికారులు, కాంట్రాక్టర్లతో శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరి ధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలుగా వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సంస్థ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల నిర్వహణలో కాంట్రాక్టర్లకు సమస్యలు ఎదురైన సంధర్భాల్లో వెంటనే సంస్థ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ పనులను సకాలంలో పూర్తిచేయని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) జే.రమణాదేవి, జనరల్ మేనేజర్లు సుబ్బారావు, శ్రీనివా సులు,సూపరింటెండింగ్ ఇంజనీర్లు రాఘవేంద్రం, చంద్రశేఖర రావు, అమర్‌బాబు, ప్రదీప్‌కుమార్,సుధాకర్, శేషాద్రిశేఖర్, మోజెస్,పిఆర్ఒ తోటమధుసూదన,ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, పాల్గొన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలోడి సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

**స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే లాంఛనంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 09.07.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 09.07.2026, మ॥ 01.00 గం.ల నుండి మ॥ 02.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 08.07.2026, సాయంత్రం 6.00 గం॥ల లోపు

| క్ర. నెం. | ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయడమైనవి) | తనఖాలో ఉన్న ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|---|
| 1 | M/s శ్రీ బాలాజీ రైస్ ప్రొడక్ట్స్, ప్రొప్రయిటర్: శ్రీ. మేడపాటి నరేంద్ర రెడ్డి, తండ్రి: ఎమ్ వీర రాఘవ రెడ్డి మరియు శ్రీమతి మేడపాటి పద్మావతి, భర్త: మేడపాటి నరేంద్ర రెడ్డి. తేది 31.05.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 17.19 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | పశ్చిమగోదావరి, పెనుగొండ ఎస్ఆర్ఓ, పెనుగొండ సబ్-డివిజన్, పెనుగొండ గ్రామం, ఆర్.ఎస్. నెం. 132/12 నందు మొత్తం ఎ. 0.99 సెంట్లులో దక్షిణంవైపు ఎ. 0.60 సెంట్లులో పడమరవైపు ఎ. 0-45 సెంట్లులో మధ్యలోనున్న ఎ. 0.15 సెంట్లులో ఉత్తరంవైపునున్న ఎ. 0-10 ½ సెంట్లు = 522 చ॥గ॥ ఖాళీ స్థలం యావత్తు ఆస్తి. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 26.17 లక్షలు | రూ. 2.62 లక్షలు |

ఆస్తి తనిఖీ తేది & సమయం : 02.07.2026, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 83329 56773, 70951 99455

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా https://baanknet.com లోని E-వాలెట్‌కు బిడ్డర్ లాగిన్ అయి తేది.08.07.2026, సా॥ 6:00 గం.ల లోపుగా చెల్లించవలెను.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com. హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది. 16.06.2026, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


గురువారం గాదె సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అంబటి తదితరులు

# సాయికృష్ణ కేసును సిబిఐకి అప్పగించాలి

## జగన్ ఆదేశం మేరకు అతని కుటుంబానికి అండ: అంబటి రాంబాబు

**విజయవాడ క్రైం,జూన్ 18,ప్రభాతవార్త:** లాకప డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ కేసును సిబిఐకి అప్పగించాలని మాజీ మంత్రి,వైసిపి నాయకులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గురువారం ఆయనతో పాటు వైసిపి నాయకులు మల్లాది విష్ణు,వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్,వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు కృష్ణలంకలోని ఇంటి వద్ద తొలుత గాదె సాయికృష్ణ తల్లిని,కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయికృష్ణ కుటుంబాన్ని ఇలాంటి సమయంలో పరామర్శించడం చాలా భాధగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఘటనపై చర్చ జరుగుతోందన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడితే గుండెలవిసిపోయే నిజాలు తెలిసాయన్నారు. సాయికృష్ణ తల్లి ఫోన్ లాక్కొని సిగ్నల్స్ ఆధారంగా సాయికృష్ణను తీసుకువచ్చారన్నారు. తల్లి ఎంత ప్రాథేయపడినా సిఐ నాగరాజు సాయికృష్ణని వదిలేయ లేదన్నారు. వ్యవస్థలు ఎంత దారుణంగా ఉన్నాయో సాయికృష్ణ లాకప్‌డెత్ ద్వారా తెలుస్తోందన్నారు. న్యాయవాద వృత్తిలో ఉన్న సాయికృష్ణ పిన్ని కనకదుర్గ డిజిపి ఒక ఫిర్యాదు ఇచ్చారని, అ ఫిర్యాదు సిపికి అక్కడి నుండి డిసిపి వద్దకు వచ్చి చెత్తబుట్టలో చేరిందని ఆయన విమర్శించారు. ఆ స్టేషన్‌లో ఉన్న వేరే నిందితులు చెప్పిన దాని ప్రకారం సాయికృష్ణను పోలీసులు చంపేశారని తెలిసిందన్నారు. హెబియస్ కార్పస్ పిటీషన్ వేయకుండా కూడా సాయికృష్ణ కుటుంబ సభ్యులకు అనేక ఆటంకాలు పోలీసులు సృష్టించారన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులు చెప్పిన దాని ప్రకారం వారికి అండగా నిలిచామన్నారు. సాయికృష్ణకు క్రిమినల్ సామ్రాజ్యం ఉందని ప్రచారం చేస్తున్నారని అదే నిజమైతే అతని తల్లి గుడిసెలో ఉండి రోజు అడుక్కోవాల్సిన అవసరం ఏముందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మల్లాది విష్ణు,మాజీ కార్పొరేటర్ పుప్పాల కుమారి,ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి వివాదంలో మామను చంపిన అల్లుడు

**విజయవాడ,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగర శివారుల్లోని కంకిపాడు మండలంలో దారుణం చోటు చేసుకుంది. మండల పరిధిలోని గోశాల గ్రామంలో కేవలం ఒక స్థలం వివాదానికి సంబంధించి అల్లుడే మామపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోశాల గ్రామానికి చెందిన ఉప్పల సాంబశివరావు (65) అనే వృద్ధుడికి, అతని అల్లుడికి మధ్య కొంతకాలంగా ఒక స్థలానికి సంబంధించిన వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే ఇరుపక్షాల మధ్య మరోసారి తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గొడవ కాస్తా ముదరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అల్లుడు మామ అని కూడా చూడకుండా సాంబశివరావుపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. అల్లుడు బలంగా కొట్టడంతో ఘటనా స్థలంలోనే కుప్పకూలి కన్నుమూశారు.

సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

# జలధారతో జల విజయం

## రాష్ట్ర మంత్రులు మండిపల్లి, జనార్దన్‌రెడ్డి

**మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :** జలధారతో జిల్లాకు జల విజయం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రోడ్లు, భవనాల, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రవాణ, యువజన క్రీడల శాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకొన్న సందర్భంగా గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో రెండేళ్ళ నమ్మకం-సుపరిపాలన-అభివృద్ధి సంక్షేమంపై జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ కార్యక్రమం నీటిసంరక్షణ, చెరువుల అనుసంధానం, భూగర్భజలాల పెంపు దిశగా విశేష ఫలితాలను అందించిందన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగడంతో వ్యవసాయం, పశుసంవర్థక రంగాలకు కొత్త ఊపు ఇచ్చిందన్నారు. జలధార కార్యక్రమం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించే దిశగా రూపొందించిన ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. జిల్లా స్తాయిలోప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే స్తాయికి చేరుకోవడం జిల్లా యంత్రాంగం పనితీరుకు నిదర్శనం అన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ ఆయన దూరదృష్టి, కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, కిషోర్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ రెండేళ్ళ కూటమి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈసందర్బంగా అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రులు, జిల్లా కలెక్టర్లు పరిశీలించి అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముళ్లపొదల్లో శిశువు మృతదేహం

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:**ఒంగోలు పట్టణంలోని గాంధీ రోడ్డులో ఓపీఎస్ స్కూల్ ఎదురుగా ఉన్న శివారు ప్రాంతంలోని ముళ్ల పొదల్లో సుమారు ఏడు రోజుల వయస్సు గల మగ శిశువు మృతదేహం గుర్తించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గురువారం ఉదయం ఆ ప్రాంతంలో సంచరిస్తున్న స్థానికులు ముళ్ల పొదల్లో శిశువు మృతదేహాన్ని గుర్తించి వెంటనే హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆయన ఈ విషయాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. జిల్లా మహిళా మరియు శిశుసంక్షేమశాఖ అధికారి పి. నాగమణి సూచనల మేరకు జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు,ఒంగోలు తాలూకా పోలీసులు, ఎమ్మెన్కె సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, నివేదిక వచ్చిన తర్వాత మరణానికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. స్థానిక అంగన్వాడీ కార్యకర్త అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా ఎస్సై పి.చౌడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# జెఎసి పిలుపునకు సంపూర్ణ మద్దతు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగస్తుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద భారీ ఎత్తున శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించామని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధి, ఏ.జి.కె.చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# రెండేళ్ల పాలనకు ప్రజా మద్దతు..

## ఒంగోలులో అట్టహాసంగా కూటమి విజయోత్సవ సభ

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఒంగోలు నగరంలోని ఎస్‌జీవీఎస్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఘనంగా విజయోత్సవ సభ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామ చర్ల జనార్దన్ రావు, ఉగ్రనరసింహారెడ్డి, విజయ్ కుమార్, కలెక్టర్ రాజాబాబు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత సభకు తరలివచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రత్యేక



స్టాళ్లను మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించారు. గత రెండేళ్లలో ప్రకాశం జిల్లాలో పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు రూ.7,163 కోట్ల సంక్షేమ పథకాల లబ్ధి అందించామని, రూ. 3,068 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ రాష్ట్రంపై ఉన్న భారీ అప్పులను ఒకవైపు చెల్లిస్తూనే మరోవైపు ప్రజలకు సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సరఫరా కాలువల కోసం రూ.500 కోట్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఒంగోలు నగర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడం కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంత రైతుల దశను మార్చబోతుందని అన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రకాశం జిల్లాకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొస్తామని తెలిపారు.జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర వివరాలు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలను ప్రజలకు వివరించిన ఈ సభ జిల్లాలో రాజకీయంగా, పరిపాలనా పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

## రూ.6.3కోట్ల రుణాల చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్,జూన్ 18 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా ఎదగాలని, స్వయంఉపాధి సాధించి కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకోవాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలకు కూటమి ప్రభుత్వంలో ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.మహిళలను మహారాణులను చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం యోచించి 'పిఎం అజయ్ పథకాన్ని' రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా నేతలు కేంద్రం నుంచి వచ్చిన నిధులను స్వాహా చేసారని పంచాయతీలకు మంజూరు చేసిన నిధులను కూడా కరెంటు చార్జిలకు జమ చేసి పంచాయతీలను నిర్వీర్యం చేసారన్నారు.

**ప్రధాని ఆశయాలకు అనుగుణంగా..** నేడు రాష్ట్రంలో భారత ప్రధాని నరేంద్రమోదీ ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మోదీజీ దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధన్యత ఇస్తున్నారని సుధీర్‌రెడ్డి వివరించారు.రానున్న పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అవకాశం కల్పించారన్నారు.నేడు తాను పిఎం అజయ్ పథకంలో రూ.6.3కోట్ల రుణాల చెక్కును అందించటం గర్వకారణంగా ఉందన్నారు. మహిళలందరూ ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఆర్థిక స్వాలంబన సాధించాలని కోరుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి వెంకట సుబ్బారెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, కామేష్‌యాదవ్, బొల్లినేని జగన్నాధం నాయుడు, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా ఫీడ్ ధర కెజి రూ.4 తగ్గింపు

## కంపెనీల అంగీకారం, ధరల స్థిరీకరణపై కమిటీ

## రైతులు, ఫీడ్ తయారీదారులతో సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆక్వా ఫీడ్ ధరల పెంపుతో గత కొన్ని రోజులుగా తలెత్తిన సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కారం చూపించారు. అటు ఆక్వా రైతులపై అధిక భారం పడకుండా, ఇటు ఫీడ్ తయారీదారులు నష్టపోకుండా ప్రస్తుత ధరపై రూ.4 తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనికి ఫీడ్ తయారీదారులు, ఆక్వా రైతులు అంగీకరించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్‌పి రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. దీనిపై చేపలు, రొయ్యల సాగు రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో గురువారం ఉన్నతాధికారులు, ఆక్వారైతులు, ఫీడ్ తయారీదారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ధర తగ్గించడంతో పాటు ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. ఫీడ్ ధరలతో పాటు, ప్రాసెసింగ్ విధానం, కాలుష్య నియంత్రణ పైనా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరుసార్లు పెంచారని, అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై ఎటువంటి చొరవ తీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆక్వా రైతులు ఈ సందర్భంగా తెలిపారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆ ధర రూ.107.80కి చేరిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందన్నారు. తామెప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదని, ఇటీవల కొందరు ఆక్వా రైతుల ముసుగులో రాజకీయం చేశారని సిఎంతో అన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వాసాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సిఎం చంద్రబాబుదేనని రైతులు గుర్తు చేశారు.

**సమస్యలు విన్నవించిన రైతులు:** ప్రస్తుతం ఆక్వాసాగులో ఎదురవుతోన్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశంలో ఆక్వా రైతులు వెల్లడించారు. సాగుకు వినియోగించే అన్ని వస్తువుల ధరలు పెరిగాయని, కానీ ఆక్వా ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగడం లేదన్నారు. ముడిసరుకు ధర పెరిగినప్పుడు ఫీడ్ ధర పెంచుతున్నారు కానీ, ముడిసరుకు ధర తగ్గినప్పుడు మాత్రం ఫీడ్ ధర తగ్గించడం లేదన్నారు. దీనికితోడు ప్రాసెసింగ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మత్స్యశాఖ నుంచి రైతులకు అందించే రాయితీలపైనా అందరికీ అవగాహన కల్పించాలని రైతులు కోరారు. అలాగే చేపలు, రొయ్యల చెరువులకు నీటి వనరులు అందించాలని రైతులు చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

**సోయా ధర పెరిగిందన్న ఫీడ్ కంపెనీల ప్రతినిధులు:** సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకు కొరత ఉందని, దేశీయంగా వీటి ధర కూడా అధికంగా ఉందని ఫీడ్ కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ధర తక్కువగా ఉన్న అమెరికా నుంచి సోయా దిగుమతులకు అనుమతి లేకపోవడంతో దేశీయ మార్కెట్లో రెట్టింపు ధరకు కొంటున్నామన్నారు. దీంతో ధరలు పెంచాల్సి వచ్చిందని వివరించారు. వాస్తవంగా రూ.20 ధర పెంచాల్సి ఉన్నప్పటికీ...రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధర పెంపును రూ.12కి పరిమితం చేశామని చెప్పారు.

**ఆక్వా రైతులకు రూ.1,543 కోట్ల విద్యుత్ రాయితీ:** లక్షలాది మంది ఆధారపడిన ఆక్వారంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని, ఈ రెండేళ్లలో రూ.1,543 కోట్ల మేర విద్యుత్ రాయితీ రూపంలో ఆక్వాసాగుకు ఇచ్చామని సిఎం చంద్రబాబు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎపి ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులను ఆదుకుంటాం

ఏదైనా కేజీ రూ.200 తగ్గకూడదు

నో బిడ్... లో బిడ్ ఉండకూడదు

మార్కెట్‌కు వచ్చిన పంట కొనాల్సిందే

అనధికార కొనుగోళ్లపై కఠిన చర్యలు

కేంద్ర ప్రభుత్వంతోనూ మాట్లాడతాం

ట్రేడర్లు, పొగాకు రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మార్కెట్‌లో పొగాకు రకం ఏదైనా కిలో రూ. 200 కంటే తగ్గడానికి వీల్లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

గురువారం రాష్ట్ర సచివా లయంలో పొగాకు రైతులు, ట్రేడర్లతో ముఖ్య మంత్రి సమావేశం నిర్వహించి పొగాకు ధరలపై సమీక్షించారు. ఇటు రైతులు, అటు ట్రేడర్ల సమ స్యలను తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు రైతులను ఆదుకునేందుకు ట్రేడర్లు, కొనుగోళ్ల కంపెనీలు నూటికి నూరు శాతం మానవీయ కోణంలో రైతులకు సహకరించాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పొగాకు వేలం కేంద్రాల్లో నో బిడ్, లో బిడ్ అనే మాటలకు తావుండకూడదన్నారు.

రైతులు మార్కెట్టుకు తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపే పరిస్థితులు అస్సలు ఉండకూడదని చెప్పారు. మార్కెట్లోకి వచ్చిన పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. దీనికి అనుగుణంగా అన్ని పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌లను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని చేయాలని ఆదేశించారు. అలాగే పొగాకు కంపెనీలన్నీ తప్పనిసరిగా కొనుగోళ్లు చేపట్టాలని, ఏ ఒక్క కంపెనీ కూడా వెనక్కు వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. టొబాకో బోర్డ్ పరిధిలో కాకుండా అనధికారికంగా కొనుగోళ్లు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,అవసరమైతే అరెస్టులు చేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

**రైతుల ప్రయోజనాలే ముఖ్యం:** ఈ ఏడాది పొగాకు ట్రేడర్లు, కంపెనీలు ప్రభుత్వానికి, రైతులకు సహకరించాలని సిఎం చంద్రబాబు కోరారు. రాబోయే ఏడాది నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే పొగాకు మార్కెట్ స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తుందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు.

రైతులు, టొబాకో బోర్డు ప్రతినిధులను వెంట పెట్టుకుని ఢిల్లీ వెళ్లి సంబంధిత మంత్రులు, అధికారులను కలవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును సిఎం చంద్రబాబు ఆదేశించారు.

ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రాంనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డివిబి స్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, టొబాకో బోర్డ్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడే టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల పలితా విడుదలకు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏపీ విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేయనున్నారు. మే 25 నుంచి జూన్ 1 వరకుసప్లిమెంటరీ పరీక్షలు జరగ్గా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసిన అదికారులు ఫలితాలను విడుదలకు సిద్దం చేశారు. ఫలితాలను ఎపి. జీవోవి.ఇన్/ వెబ్‌సైట్‌లో చూడొచ్చు. మన మిత్ర వాట్సప్ నెంబరు 9552300009 ద్వారానూ రిజల్ట్స్ తెలుసు కోవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

## నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు

# ఉచిత బస్సు ప్రయాణం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీన జరుగనున్న వైద్య కళాశాలల ప్రవేశ పరీక్ష నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులు తమ నివాసం నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు తమ హాల్ టికెట్‌ను చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లను గుర్తించి అందుకు అనుగుణంగా నీట్ రీఎగ్జామినేషన్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేందుకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ అదనంగా ప్రత్యేక బస్సులు నడపాలని ప్రభుత్వం ఆర్టీసి అధికారులను ఆదేశించింది. అందుకు అనుగుణంగా అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం, ఉయ్యూరు డిపోల నుంచి పరీక్షా కేంద్రాలకు నిత్యం నడిచే బస్సులకు అదనంగా రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసి కృష్ణాజిల్లా ప్రజా రవాణా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆసుపత్రుల పనితీరుపై మరింత నిఘా

## రెండేళ్ల ఫలితాలపై ముఖ్యమంత్రికి మంత్రి సత్యకుమార్ యాదవ్ సమగ్ర నివేదిక

**విజయవాడ,జూన్ 18, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరచడానికి వైద్యారోగ్య శాఖ చేసిన ప్రయత్నాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంసమగ్రమైన నివేదికను అందజేశారు. నాలుగు పేజీల సమీక్షతో కూడిన లేఖతో పాటు విభాగాలవారీగా సాధించిన ఫలితాలపై 8 పేజీల నివేదికను మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి పంపారు.గత ప్రభుత్వం నుంచి ఆరోగ్య రంగంలో వారసత్వంగా సంక్రమించిన సమస్యల్ని పరిష్కరించి, ప్రజారోగ్య వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టడం ద్వారా మొదటి ఏడాది కంటే రెండో ఏడాదిలో మరింత సానుకూల ఫలితాలు లభించాయని మంత్రి తన లేఖలో ముఖ్యమంత్రికి వివరించారు. మొదటి ఏడాదిలో వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు 7 శాతం పెరగ్గా రెండో ఏడాది పాలనలో హాజరు 28.13 శాతం పెరిగిందని, తదనుగుణంగా వైద్య సేవల్లో భారీ పురోగతిని సాధించామని మంత్రి తెలిపారు. విస్తృతమైన ప్రభుత్వ వైద్య సేవలకు సంబంధించి మొత్తమ్మీద సానుకూల ఫలితాలు లభించినా, ఆసుపత్రులవారీగా, ప్రాంతాలవారీగా పనితీరులో వ్యత్యాసాలు కనిపించాయని, వీటిని అధిగమించి వ్యవస్థ పూర్తి సామర్థ్యాన్ని ప్రజలకు అందజేసే దిశగా చర్యల్ని చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించామని మంత్రి వివరించారు.

# పిడుగుపాటుకు గేదె మృతి

**అనుమసముద్రంపేట (నెల్లూరు), జూన్ 18, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని చిన్నబ్బీపురం గ్రామంలో గత రాత్రి కురిసిన అకాల వర్షం సమయంలో పిడుగుపాటుకు ఓ గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన మబ్బు మస్తానయ్యకు చెందిన సుమారు లక్షరూపాయలు విలువ చేసే నిండు సూడుతో ఉన్న గేదె పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారులు, పశువైద్య శాఖ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం పశువైద్య సిబ్బంది గేదె మృతిపై పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందే నష్టపరిహారాన్ని బాధిత రైతుకు అందించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ఆక్వా రైతు కృష్ణంరాజు హత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్18 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలం కొత్త మురమళ్ళలో రొయ్యల చెరువు వద్ద ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు(64)ను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. కొట్టి చంపి, రాళ్లు కట్టి రొయ్యల చెరువులో పడవేసినట్లు అనుమాని స్తున్నారు .కృష్ణంరాజు రాత్రయినా ఇంటికి రాకపోవడంతో గాలించి ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన కుటుంబ సభ్యులు,పోలీసులు గాలింపు చేపట్టగా చెరువులో రాళ్లతో కట్టిన కృష్ణంరాజు మృతదేహం గుర్తించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అమలాపురం డిఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

# తిరుపతిలో జెఎస్ఎస్ క్యాంపస్ ఏర్పాటు

జెఎస్ఎస్ మహావిద్యాపీఠంతో ప్రభుత్వం ఒప్పందం

మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఒయు



**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాప్రభుత్వంలో తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ తరలిరానుంది. మైసూరుకు చెందిన జెఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆధ్వర్యంలో తిరుపతిలో జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్‌క్యాంపస్ ఏర్పాటుచేయనున్నారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎపి ఉన్నత విద్యామండలి, జెఎస్ఎస్ (జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర మహావిద్యాపీఠం) మహావిద్యాపీఠంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఎపి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జెఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జెఎస్ఎస్ ఎహెచ్ఇఆర్ ఛాన్సలర్ డా.బి.సురేష్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం తిరుపతిలో జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ క్యాంపస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

మైసూరు హెడ్ క్వార్టర్‌గా ఉన్న జెఎస్ఎస్ ఎహెచ్ఇఆర్ నాక్ నుంచి ఎ++ గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానం, ఓవరాల్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 38వ స్థానాన్ని దక్కించుకుంది. 70యేళ్ల చరిత్ర కలిగిన జెఎస్ఎస్ విద్యాసంస్థకు ఇది ప్రధాన విద్యాసంస్థగా ఉండగా భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలను నిర్వహిస్తోంది. అందుబాటులో 74 కోర్సులు: పతిపాదిత తిరుపతి క్యాంపస్‌లో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ క్యాంపస్‌లో మొత్తం 74 కోర్సులు అందు బాటులో ఉండనుండగా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత 10 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. అదనంగా హెల్త్‌కేర్‌లో ఎఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, పరిపాలన, ట్రాన్స్‌లేషనల్ బయోటెక్నాలజీ, హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి రంగాల్లో ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నారు. వీటికి తోడుగా విశాఖపట్నం, చెన్నై, బెంగళూరులో పరిశ్రమల అనుసంధాన కేంద్రాలు కూడా నెలకొల్పనున్నారు. 20వేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి కల్పన: ఈ ఒప్పందం ప్రకారం తిరుపతిలో భూమి కేటాయింపు, అవసరమైన చట్టబద్ధ అనుమతుల కోసం సింగిల్ విండో వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. క్యాంపస్ అభివృద్ధికి సంబంధించిన మొత్తం వ్యయాన్ని జెఎస్ఎస్ మహావిద్యాపీఠమే భరించడంతో పాటు యుజిసి నుంచి అవసరమైన అనుమతులను పొందనుంది. అమలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు 60 రోజులలోపు జాయింట్ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకుపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, పరిశోధకులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ సంస్థ తోడ్పాటును అందించనుంది. ఈ కార్యక్రమంలో మైసూరు జెఎస్ఎస్ ఎహెచ్ఇఆర్ రిజిస్ట్రార్ డా. బి.మంజునాథ, జెఎస్ఎస్ ఎహెచ్ఇఆర్ డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కెపిఎంపి అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్.రాఘవన్, స్పెషలిస్ట్ రోమిత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయపరంగా అండగా ఉంటాం

సాయికృష్ణ తల్లిని పరామర్శించిన జగన్



**విజయవాడ. జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయి కృష్ణ కేసులో పార్టీ తరపున న్యాయపరంగా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం కృష్ణ లంకలో సాయికృష్ణ నివాసానికి వెళ్లారు. అక్కడ సాయి తల్లిని, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాయి అదృశ్యం పోలీసుల వైఖరిపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. **మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీ నాని:** ఈ ఘటన పైన జాతీయ మానవ హక్కుల సంఘానికి మాజీ ఎంపీ కేశినేని నాని ఫిర్యాదు చేయటం సంచలనంగా మారుతోంది. విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణపై గతంలో కొన్ని కేసులు ఉండటంతో పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. అయితే పోలీసుల వేధింపులు తట్టుకోలేక అతను ప్రకాశం జిల్లా మార్కాపు రానికి వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా, పాత కేసు విషయమై మే 9, 2026 న విజయవాడ కృష్ణలంకకు చెందిన ఇద్దరు పోలీసులు మార్కాపురం వెళ్లి సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అలా పోలీసులు తీసుకెళ్లిన సాయికృష్ణ మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. అతన్ని ఏ కోర్టులోనూ హాజరుపరచకపోవడంతో కుటుంబసభ్యుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. దీంతో, కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో తాజా విచారణ నేపథ్యంలో ఒక్క సారిగా ఈ వ్యవహారం కొత్త టర్న్ తీసుకుంది.

## నెల్లిమర్లలో వికటించిన పొత్తు ధర్మం

జనసేన ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తీరే కారణం?

టిడిపి అధిష్టానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



**విజయనగరం, జూన్ 18, ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య పొత్తు ధర్మం వికటించింది. ఎవరికి వారే యమునా తీరే చందంగా ఇరు పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు సైతం కేవలం జనసేన పార్టీ నాయకులకు మాత్రమే దర్శనమిస్తున్నారు. గత రెండేళ్ల కాలంగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొన్న కార్యక్రమాలన్నింటికీ తెలుగుదేశం పార్టీ నాయకులు దూరంగా ఉంటున్నారు. దీనికి కారణం ఎమ్మెల్యే నాగ మాధవి, ఆమె భర్త లోకం ప్రసాద్ ఏకపక్షంగా వ్యవహరించడం, ప్రధాన పొత్తు పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ నాయకులతో కనీస సంప్రదింపులు సైతం చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. 2024 ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన పార్టీకి కేటాయించారు. నియోజకవర్గ ఓట్లలో కనీసం 10 శాతం కూడా ఓటర్లు లేని జనసేన పార్టీకి టికెట్ ప్రకటించడంపై అప్పట్లోనే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్రుమన్నారు. అధినాయకుల నిర్ణయం ఉపసంహరించుకోవాలని టిడిపి నుంచి పదే పదే విజ్ఞప్తులు వెళ్లినా అధిష్టానం ముందు తీసుకున్న నిర్ణయానికే కట్టుబడింది. దీంతో ఏమి తోచని పరిస్థితుల్లో తెలుగుదేశం నాయకులు అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి జనసేన పార్టీ అభ్యర్థి లోకం నాగమాధవిని గెలిపించడంలో కీలక భూమిక పోషించారు.


# సత్యవేడు సబ్‌జైలు మూత

భద్రతా లోపాలే కారణమంటూ ఖైదీలను చిత్తూరుకు తరలింపు..?

**సత్యవేడు, జూన్ 18 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణానికి మరో కీలక ప్రభుత్వ సంస్థ దూరమైంది. దశాబ్దాల చరిత్ర కలిగిన సత్యవేడు సబ్‌జైలు మంగళవారం నుంచి అధికారికంగా మూత పడినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జైలు భవనం శిథిలావస్థకు చేరుకోవడం, ప్రహరీ గోడలు దెబ్బతినడం, ప్రహరీగోడలు పటిష్టంగా లేకపోవడం వంటి భద్రతా లోపాలను గుర్తించిన జైలు శాఖ ఉన్నతాధికారులు జైలును మూసివేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జైలులో ఉన్న ఏడుగురు రిమాండ్ ఖైదీలను కట్టుదిట్టమైన భద్రతల మధ్య చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. ఇకపై సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలాల్లో నమోదయ్యే కేసుల్లో రిమాండ్‌కు వెళ్లే నిందితులను చిత్తూరుకు తరలించాల్సి ఉంటుంది. ఒక్క రిమాండ్ ఖైదీని చిత్తూరుకు తరలించాలన్నా కనీసం ఇద్దరు పోలీసు సిబ్బంది బందోబస్తుకు వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికే సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సత్యవేడు సర్కిల్ పోలీసుశాఖకు ఇది మరింత భారంగా మారనుంది. సత్యవేడు సబ్‌జైలు తొలగింపు గురించి గత రెండేళ్లుగా ప్రచారం జరిగినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు జైలు బలోపేతం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.

# బిసిల వాస్తవ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం

డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 18, ప్రభాతవార్త:** బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు డెడికేటెడ్ కమిషన్ కృషి చేస్తోందని ఆ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా గురువారం నెల్లూరులో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి వివిధ శాఖల అధికారుల నుంచి జిల్లాలోని బీసీ జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

# రాయలసీమ రాయల్ విక్టరీ

మిడిలార్డర్ మెరుపులతో కాకినాడ కింగ్స్‌పై ఘన విజయం




మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న తేజ

**కడప స్పోర్ట్స్ (వైఎస్సార్ రాజారెడ్డి స్టేడియం):** ఏపీఎల్2026 సీజన్5లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. కడపలోని వైఎస్సార్ రాజారెడ్డి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌పై ఉత్కంఠభరిత పోరులో రాయలసీమ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన కాకినాడ కింగ్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఆరంభంలోనే దూకుడుగా ఆడిన కాకినాడ బ్యాటర్లు పవర్‌ప్లేలో మంచి స్కోరు సాధించారు. 10 ఓవర్లు ముగిసేసరికి రెండు వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి అద్భుత సెంచరీ సాధించాడు. 60 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 112 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాట లు వేశాడు. చివర్లో లేకాజ్ రెడ్డి 17 బంతుల్లో 37 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో కాకినాడ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 211 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. రాయలసీమ బౌలర్లలో పార్థసారథి, పురుషోత్తం గణేష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్స్ ఆఫ్ రాయలసీమకు ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు త్వరగా వెనుదిరిగినా మిడిలార్డర్ బ్యాటర్లు జట్టును విజయతీరాలకు చేర్చారు. జీవీస్పీ తేజ 43 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 76 పరుగులు చేసి చివరివరకు పోరాడాడు. అతనికి తోడు వై. వాసు 14బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 42 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చాడు. వై. తేజారెడ్డి 27 బంతుల్లో 41 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ముగ్గురి మెరుపు బ్యాటింగ్‌తో రాయలసీమ జట్టు 18.3ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 213 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టుకువిజయాన్ని అందించిన తేజకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

# ఇంద్రకీలాద్రి విస్తరణకు సమీక్ష

**ఇంద్రకీలాద్రి, జూన్ 18, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి వేంచేసియున్న ఇంద్రకీలాద్రి విస్తరణ దిశగా వడి వడి అడుగులు పడుతున్నాయి. భూసేకరణ పరిధిలోకి వచ్చే గృహ నిర్వాసితులతో ఆర్‌డిఓ చెన్నైయ శ్రీను, ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆర్‌అండ్‌బి ఎస్ భాస్కరరావు, దేవదాయ శాఖాధికారులు సమావేశంలో మాట్లాడారు. అర్జున వీధిలో 5 గృహాలు, మల్లికార్జున పేట (ఉత్తరం మెట్ల వైపు) 12 గృహాలు, మల్లికార్జున పేట (కొండపైన) 5 గృహాలు ఈ భూ సేకరణకు సంబంధించి ముందస్తుగా సమాచారం అందుకున్న ఆయా గృహ యజమానులు మరియు నిర్వాసితులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ విస్తరణ ప్రక్రియలో నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఆలయాభివృద్ధి పథకానికి విజయవాడకు చెందిన హెచ్ భాగ్యలక్ష్మి రూ.2,00,000లు విరాళమును ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ఆవూరి శ్రీనివాసరావుకు అందజేశారు.

దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# నీట్‌కు అప్రమత్తంగా ఉండాలి : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త :** ఈనెల 21వతేదీ దేశవ్యాప్తంగా పునఃనిర్వహిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ వైద్యవిద్య ప్రవేశపరీక్ష 'నీట్' నిర్వహణలో జిల్లాయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. విజయవాడలోని కలెక్టరెట్ అవరణలో పింగళి వెంకయ్య సమావేశమందిరంలో గురువారం నీట్ పరీక్ష నిర్వహణపై కోఆర్డినేటర్‌లు, అబ్జర్వర్‌లు, పరీక్షాకేంద్రాల సూపరిటిండెంట్ తదితర పరీక్షకు సంబందించిన అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్దుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి, సిబ్బంది భాద్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 31పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, గతంలో పరీక్షకు 3గంటల సమయం ఉండగా ప్రస్తుతం మరో 15 నిముషాలు అదనపు సమయం కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు. 21వతేదీ మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5.15గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్దులు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1.30గంటల వరకు మాత్రమే పరీక్షాకేంద్రంలోపలికి అనుమతి స్తామని స్పష్టం చేసారు. **నందిగామ, తిరువూరులో పీయం అజయ్ మేళాలు** : పీయం అజయ్ పథకం ద్వారా నిరుద్యోగ ఎస్‌సీ యువతకు నైపుణ్యశిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈనెల 19వతేదీ నందిగామ, 20వతేదీ తిరువూరులో మేళాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), జూన్ 18, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం చేస్తున్నారని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు. మండలంలోని దామరమడుగు జడ్‌పి హైస్కూల్‌లో విపిఆర్ పౌం డేషన్ నిధులు 30 లక్షలతో నిర్మించిన నూతన తరగతిగదులను ఎమ్మెల్యే గురువారం ప్రారంబించారు. అంతకు ముందు దామరమడుగు పల్లిపాళెం వద్ద 17 లక్షలతో నిర్మించిన శ్లాబ్ కల్వర్ట్ ,10 లక్షలతో మంజూరైన సిసిరోడ్డు, జలజీవన్ మిషన్ నిదులు 7 .68 లక్షలతో చేపట్టిన పైపు లైన్లు తాగునీటి కుళాయిలను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌బాబు విద్యార్ధులకు ఎన్నో ఆధునిక వసతులతో విద్యాబోధన కల్పిస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యాక్షులు ఎం.వి శేషయ్య , బుచ్చి రూరల్ బ్యాంకు అద్యక్షులు ఏటూరు శివరామ కృష్ణారెడ్డి, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, రూరల్ అద్యక్షులు జగదీష్, శేషయ్య, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ శాంతి, నీటి సంఘం అద్యక్షులు బత్తల హరికృష్ణా, నీటి సంఘం అద్యక్షులు రమణారెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సూర్యఘర్‌తో ఇళ్లకు సౌర విద్యుత్

ఎమ్మెల్యేల దృష్టికి ఆర్డీఎస్ఎస్ అభివృద్ధి పనులు

**చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:** సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సౌర విద్యుత్ అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అధ్యక్షతన విద్యుత్ సంస్కరణల అమలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఎస్ఇ అమరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు వేర్వేరు విద్యుత్ లైన్లు ఏర్పాటుతో పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. రూ.468.33 కోట్ల వ్యయంతో చేపట్టిన 11కెవి ఆర్‌డిఎస్ఎస్ పనుల్లో ఇప్పటి వరకు రూ.241.52 కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు.

# భూములిచ్చిన రైతులకు త్వరలోనే పరిహారం ఇస్తాం

పేరూరు ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హామీ

**అనంతపురం, జూన్ 18 ప్రభాతవార్త బ్యూరో:** పేరూరు ప్రాజెక్ట్‌కు నీరందించే పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ కోసం భూములిచ్చిన ప్రతి రైతుకు త్వరలోనే పరిహారం అందిస్తామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌తో కలిసి రామగిరి, కనగానపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా కనగానపల్లి మండల కేంద్రంలోని రెడ్డివారి కుంట చెరువు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ చెరువు మరమ్మతులకు ఇప్పటికే రూ.86లక్షలు విడుదల చేయగా.. ఈ పనులను కలెక్టర్, ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. గతంలో చెరువు కట్ట తెగి పొలాలకు నష్టం వాటిల్లిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా..ఉపాధి హామీ పథకం కింద అక్కడ పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతు శ్రీనాథ్ సాగు చేసిన వేరుసెనగ పంటను పరిశీలించారు. పంట ఎప్పుడు వేశారు.. ప్రస్తుతం ఎలా ఉంది.. దిగుబడి ఎంత వస్తుందన్నది తెలుసుకున్నారు. ఆ తర్వాత జీడిపల్లి రిజర్వాయర్ నుంచి అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు (పేరూరు ప్రాజెక్ట్) వరకు జరుగుతున్న 54కిలోమీటర్ల పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ పనులను పరిశీలించారు.

## నేడు మేధా టవర్స్ లో ఈ ఇంక్యుబేటర్ ప్రారంభించనున్న చండీగఢ్ యూనివర్సిటీ

**విజయవాడ, జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీని అంతర్జాతీయ స్థాయి క్వాంటం డీప్‌టెక్ ఇన్నోవేషన్ హబ్ గా మార్చటమే లక్ష్యంగా మరో కీలకమైన ముందడుగుపడింది. డీప్‌టెక్ స్టార్టప్ లకు సహకారం అందించేలా మొట్టమొదటి క్వాంటం ఇంక్యుబేటర్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభంకానుంది. చండీగఢ్ యూనివర్సిటీ తొలి క్వాంటం ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 19 తేదీన గన్నవరం లోని మేధా టవర్స్ లో ఈ ఇంక్యుబేటర్ ను ప్రారంభించనున్నారు.

# ఆదురుపల్లిలో భారీగా అక్రమ యూరియా నిల్వలు సీజ్

రూ.12.89 లక్షల విలువైన స్టాక్ గుర్తింపు

**చేజర్ల (నెల్లూరు), జూన్ 18, ప్రభాతవార్త :** చేజర్ల మండలం ఆదురుపల్లి గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన భారీ యూరియా నిల్వలను అధికారులు గురువారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఈ అక్రమ నిల్వలు బయటపడ్డాయి. అధికారుల కథనం ప్రకారం.. ఆదురుపల్లి గ్రామంలోని శ్రీ వీరాంజనేయ ఏజెన్సీస్ ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ షేక్ సుభాని ఏవో పి.వేణుగోపాల్‌రావు, స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారి హిమబిందు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎరువుల దుకాణంలో రికార్డులకు, అక్కడ ఉన్న నిల్వలకు పొంతన లేకపోవడాన్ని అధికారులు గమనించారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి కంటే అదనంగా ఉన్న 1,423 యూరియా బస్తాలను అధికారులు గుర్తించారు. పట్టుబడిన ఈఅదనపు స్టాక్ విలువ మార్కెట్ ధర ప్రకారం రూ. 12,89,847 ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిబంధనలు ఉల్లంఘించి, అక్రమంగా ఎరువులను నిల్వ ఉంచినందుకు గాను సదరు శ్రీ వీరాంజనేయ ఏజెన్సీస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. రైతులకు ఇబ్బంది కలిగించేలా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చ రించారు.

## వాడిన మద్యం సీసాల నిర్వహణపై సర్క్యులర్ ఎకానమీ విధానాల పరిశీలన

**విజయవాడ, జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఎక్సైజ్ విధానాలపై సూచనలు చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రుల బృందం (జీవోఎం) సమావేశం గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎక్సైజ్, గనులు భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఎఆర్‌టి కేంద్రంలో ఎపిసాక్స్ పిడి తనిఖీలు



**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం(ఏపిసాక్స్) ప్రాజెక్టు డైరెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ విజయవాడ లోని పాత ప్రభుత్వవైద్యశాలలోని ఏఆర్‌టి సెంటర్‌ను, ఐసిటిసి కేంద్రాలను గురువారం తనిఖీ చేసారు. ఈసందర్బంగా సోచ్ పోర్టల్‌లో నమోద వుతున్న వివరాలను, రోగుల ఇన్‌వర్డ్ రిజిస్టర్లను పరిశీలించారు. ఐసిటిసి, ఏఆర్‌టి కేంద్రాల్లో పని చేస్తున్న కౌన్సిలర్‌లు, డేటామేనేజర్‌లు, ల్యాబ్ టెక్నిషియన్స్, వైద్యఅధికారులతో సమావేశమయ్యారు. ఈకార్యక్రమంలో బిఎస్‌డి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసవర్మ, సిఎస్‌టి డిడి డాక్టర్ ఎస్ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆకాంక్షితబ్లాక్‌లను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి : అశోక్‌బాబు

**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్‌జిల్లాలోని ఆకాంక్షితబ్లాక్‌లను ఆదర్శబ్లాక్‌లుగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషిచేస్తున్నట్లు కేంద్రప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు తెలిపారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించారు. కొటికలపూడిలోని హెల్త్‌అండ్‌విల్‌నెస్ సెంటర్‌ను, అంగన్వాడికేంద్రాన్ని సందర్శించారు. మహిళాశిశు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. మూలపాడులో ఉపాధిహామీ పథకం అనుసంధానంతో చేపట్టిన మునగ, నిమ్మ ప్లాంటేషన్ ప్రాంతాల ను, బట్టర్‌ఫ్లై పార్కును సందర్శించారు. కొండపల్లిలో బాలికల ఉన్నత పాఠశాలతోపాటు, గుంటుపల్లి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని సందర్శించి మహిళలకు ఇస్తున్న శిక్షణాకార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఆయన యంపిడిఓ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 500పైగా బ్లాక్‌లను ఆకాంక్షితబ్లాక్‌లుగా ప్రకటించిందని, ఇందులో రాష్ట్రంలోని ఏడుజిల్లాలో 15బ్లాక్‌లు ఉన్నాయన్నారు. ఎన్‌టిఆర్‌జిల్లాలోని ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాక్‌లు(మండలాలు) ఉన్నాయని చెప్పారు. ఈరెండుబ్లాక్‌లను పూర్తిస్థాయి అభివృద్ధిచేసేందుకు పలుకార్యక్రమాలుచేపడుతున్నట్లు ఆయన వివరించారు.

## అసెంబ్లీలో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సమావేశం

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీలో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సమావేశం ఆ కమిటీ చైర్మన్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయం, పట్టు పరిశ్రమ, సహకార, రైతు సంక్షేమ రంగాలు, పశు సంవర్థక, మత్స్య, వెటర్నరీ, సామాజిక సంక్షేమ సంస్థల పని తీరుపై చర్చించారు. ఏపీ స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ కార్యకలాపాలు, సెరిఫెడ్, రైతు సాధికార సంస్థల పురోగతిపై కమిటీ ఆరా తీశారు. రేపు మరిన్ని సంస్థలపై చర్చలు ఉంటాయని కూన రవికుమార్ వెల్లడించారు.

# పేదలందరికీ ఇళ్లు: మంత్రి పార్థసారథి

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ పేదల గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. అదే విధానాన్ని ఇప్పుడు మరింత వేగంగా అమలు చేస్తున్నామని వివరించారు. రెండేళ్ల గృహనిర్మాణ శాఖ ప్రగతిపై మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో గృహ నిర్మాణానికి అవసరమైన నిధులు సరైన స్థాయిలో విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. వివిధ దశల్లో ఉన్న దాదాపు 4 లక్షల ఇళ్ల ప్రాజెక్టులు రద్దు చేశారని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 15.54 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. జగన్ హయాంలో నిలిపివేసిన గృహ నిర్మాణాలను తిరిగి ప్రారంభించి, ఇప్పటికే 4.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందించినట్లు మంత్రిపార్థసారథి పేర్కొన్నారు. అదేవిధంగా మిగిలిన 4.14 లక్షల ఇళ్లను కూడా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు.

## డిఎస్సీ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు

లోక్‌భవన్‌లో గవర్నర్‌తో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** డీఎస్సీ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు కోరుతూ విజయవాడ లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను వైయస్సార్‌సీపీ ప్రతినిధులు కలిసారు. మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ నేతృత్వంలో గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మురుగుడు హనుమంతరావు, వరుదు కల్యాణి, ఎంపీ రామచంద్రారెడ్డి, మొహమ్మద్ రుహుల్లా, డీఎస్సీ ప్రక్రియపై గవర్నర్ దృష్టికి పలు అంశాలను వైఎస్సార్సీపీ నేతలు తీసుకెళ్లారు.

## విశాఖపట్నం రేంజ్‌లో మాదకద్రవ్యాల నిర్మూలనకు బహుముఖ వ్యూహం

**విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం' నిర్మాణంలో భాగంగా విశాఖపట్నం రేంజ్ పోలీస్ శాఖ చారిత్రాత్మక విజయాలను నమోదు చేస్తోంది ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని స్థాపించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ జులై 2024లో తాము నిర్దేశించుకున్న సున్నా సాగు చారిత్రాత్మక లక్ష్యాన్ని జనవరి 2026 నాటికి నూటికి నూరు శాతం సాధించగలిగాము అని తెలియజేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు: 65,560 కిలోల గంజాయి, 83.19 కిలోల హషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకొని, రవాణాకు ఉపయోగించిన 832 వాహనాలను సీజ్ చేసామన్నారు. 19 కేసుల్లో 18 మంది నిందితులకు చెందిన రూ.11.02 కోట్ల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేశామని తెలిపారు. కఠిన నిర్బంధ చర్యలు ... పునరావృత నేరస్థులపై కఠిన చర్యల్లో భాగంగా 132 మందిపై ప్రతిపాదనలు పంపగా, 51 మందిని ఇప్పటికే నిర్బంధించామని. అలాగే 1,942 హిస్టరీ షీట్లు తెరిచామని చెప్పారు.

## తెలంగాణ స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ ఎంపీ విజయ్



**విశాఖ, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ ని గురువారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. చింతకాయల విజయ్ ఇటీవల నూతనంగా రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన సందర్భంగా ఈ ఆత్మీయ కలయిక చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ విజయ్ ని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆట



# హ్యాట్రిక్ కొట్టిన హాకీ అమ్మాయిలు

**అక్లాండ్, జూన్ 18:** న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. టోర్నీలో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన తమ చివరి గ్రూపు మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3-2 తేడాతో భారత్ విమెన్ టీమ్ గెలుపొందింది. ఇరు జట్ల మధ్య ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్ ఆరంభంలో ఉరుగ్వే ఆధిక్యం కనబరిచింది. 13వ నిమిషంలో కియారా అపెన్నినో గోల్‌తో ఉరుగ్వే 1-0 ఆధిక్యం చాటింది. ఆ తర్వాతి నుంచి భారత్ అటాక్ పెరిగింది. 24వ నిమిషంలో దీపిక సెహ్రావత్ గోల్ చేసి 1-1తో సమం చేసింది. అనంతరం 43వ నిమిషంలో దీపిక సోరెంగ్ చేసిన గోల్‌తో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక 55వ నిమిషంలో ఉరుగ్వే గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేయడంతో ఉత్కంఠ నెలకొంది. ఆతర్వాతి నిమిషంలోనే దీపిక సెహ్రావత్ అద్భుతమైన గోల్ తో భారత్‌ను 3-2తో ఆధిక్యంలోకి తీసుకెళ్లింది. సెహ్రావత్‌కు ఇది రెండో గోల్. అదే ఆధిక్యాన్ని చివరి నిమిషం వరకు కాపాడుకుని భారత్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌కు ముందు భారత విమెన్ టీమ్... అమెరికా, జపాన్‌లను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లింది. ఈ గెలుపుతో గ్రూపు దశను అజేయంగా ముగించిన భారత్... శనివారం చిలీతో సెమీస్‌లో తలపడనుంది.

# మన్‌ప్రీత్ సింగ్ సరికొత్త రికార్డు

**రోటర్‌డామ్(నెదర్లాండ్స్), జూన్ 18:** భారత హాకీ జట్టు స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ చరిత్ర సృష్టించాడు. దేశం తరపున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్



మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మన్‌ప్రీత్ తన 413వ మ్యాచ్ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో హాకీ ఇండియా ప్రస్తుత అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేరిట ఉన్న 412 మ్యాచ్‌ల రికార్డును మన్‌ప్రీత్ అధిగమించాడు. మన్‌ప్రీత్‌కు భారత హాకీ జట్టు కూడా గుర్తిండిపోయే కానుక ఇచ్చింది. ప్రో లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ ఛాంపియన్ జర్మనీపై 3-1 గోల్స్‌తో నెగ్గింది.

అరుదైన మైలురాయి అందుకున్న మన్‌ప్రీత్ సింగ్‌ను హాకీ ఇండియా అభినందించి, 10 లక్షల నజరానా ప్రకటించింది. 15యేళ్లుగా భారత హాకీ జట్టుకు మన్‌ప్రీత్ గుండెకాయలా నిలుస్తున్నాడని, ఆయన నిలకడ అసాధారణమని కొనియాడింది. 2011లో 19ఏళ్ల వయసులో భారత జట్టులోకి అడుగుపెట్టిన మన్‌ప్రీత్ సింగ్... టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించిన జట్టు సభ్యుడు. ప్రపంచంలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ సింగ్ ఐదో స్థానంలో ఉన్నాడు. ఈ మైలురాయిని తన సహచరులు, కుటుంబసభ్యులకు అంకితం చేస్తున్నట్లు మన్‌ప్రీత్ సింగ్ చెప్పాడు. జాతీయ జట్టుకు అత్యధిక మ్యాచ్‌ల్లో ఆడడం గర్వంగా ఉందని... ఒలింపిక్ స్వర్ణం, ప్రపంచ కప్ గెలువాలనేదే తన లక్ష్యమని స్పష్టంచేశాడు.



# ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్లో మీనాక్షి

**గ్వియాంగ్(చైనా), జూన్ 18:** చైనాలోని గ్వియాంగ్‌లో జరుగుతున్న ప్రపంచ కప్ బాక్సింగ్‌లో భారత బాక్సర్ మీనాక్షి హుడా సత్తా చాటుతోంది. ప్రస్తుతం మహిళల 48 కిలోల విభాగంలో వరల్డ్ నెంబర్ వన్ అయిన మీనాక్షి... 51 కిలోల విభాగంలోకి మారి పోటీపడుతోంది. గురువారం మహిళల 51 కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో పోలాండ్ బాక్సర్ నటాలియా కుచ్వెస్కాపై పడిగుద్దులతో విరుచుకుపడింది. 5-0తో ఏకపక్ష విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో కజకిస్థాన్ బాక్సర్ అలువ బల్కిబెకోవాతో మీనాక్షి హుడా తలపడనుంది. కాగా మరో భారత భాక్సర్ అభినాష్ జమ్వాల్ పరుషుల 65 కిలోల విభాగంలో ఇంటిదారి పట్టాడు. అతను కిర్గిజిస్థాన్ బాక్సర్ మిర్జోఖిద్ చేతిలో 0-5తేడాతో ఓటమి పొందాడు.

భారత బాక్సర్లు రెండు విభాగాల్లో పతకాలు పక్కా చేశారు. మహిళల 48 కిలోల విభాగంలో జ్యోతి, 85 కిలోల విభాగంలో జుగ్నూ సెమీఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా భారత్‌కు పతకాలను ఖాయం చేసుకున్నారు. కాగా ఈ బాక్సింగ్ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఐదుగురు భారత బాక్సర్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 55 కిలోల విభాగంలో నిఖిల్, 70 కేజీల విభాగంలో దీపక్, 57 కిలోల విభాగంలో ప్రాచి, 65 కిలోల విభాగంలో సనేహ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు.



గోల్ కొట్టి సంబరాలు జరుపుకున్న లూయిస్ డియాజ్

పనామా ఆశలకు ఘనా చెక్ * మెక్సికోతో తలపడనున్న దక్షిణ కొరియా * కెనడాతో ఖతర్ ఢీ

# సాకర్ ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్, కొలంబియా అదుర్స్

**లాస్‌ఏంజిల్స్, జూన్ 18**

ఇంగ్లాండ్ ఘనవిజయంతో ఫీఫా ప్రపంచకప్ జైత్రయాత్రను ప్రారంభించింది. క్రొయేషియాను 4-2తో చిత్తు చేసింది. హ్యారీ కేన్ రెండు గోల్స్‌తో జట్టు విజయంలో కీరోల్ పోషించాడు. మరో వైపు 8 ఏళ్ల తర్వాత ఫిఫా బరిలోకి దిగిన కొలంబియా రీ ఎంట్రీ అదిరింది. ఉజ్బెకిస్థాన్‌పై 3-1 గోల్స్‌తో నెగ్గింది. ఇక అదనపు సమయం గోల్‌తో పనామాపై ఘనా విజయం సాధించింది. ఇక గ్రూప్-బిలో స్విట్జర్లాండ్‌తో బోస్నియా- హెర్జెగోవినా, అతిథ్య కెనడాతో ఖతార్, గ్రూప్-ఎలో మెక్సికోతో దక్షిణ కొరియా తలపడనుంది.

**అదరగొట్టిన ఇంగ్లాండ్**

హాట్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్... తొలి మ్యాచ్‌లో క్రొయేషియాను చిత్తు చేసింది. స్టార్ ఆటగాడు హ్యారీ కేన్ 12వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌తో గోల్‌కొట్టి ఇంగ్లాండ్‌కు ఆధిక్యం అందించాడు. అయితే, క్రొయేషియా ప్లేయర్ మార్టిన్ బతురినా 36వనిమిషంలో చేసిన గోల్‌తో స్కోర్లు సమమయ్యాయి. మళ్లీ 42వ నిమిషంలో హ్యారీ కేన్ చేసిన రెండో గోల్‌తో ఇంగ్లాండ్ ఆధిక్యం 2-1కు పెరిగింది. తొలి అర్ధభాగం అదనపు సమయంలో (45+5వ నిమిషం) పీటర్ ముసా అద్భుతమైన గోల్‌తో క్రొయేషియాను 2-2తో సమంగా నిలిపాడు. రెండో అర్ధభాగంలో ఇంగ్లాండ్ అటాకింగ్ గేమ్‌తో అదరగొట్టింది. జుడె బెల్లిగ్‌హామ్ (47వ నిమిషం), మార్కస్ రాష్‌ఫోర్డ్ (85వ నిమిషం) గోల్స్‌తో ఇంగ్లాండ్ 4-2 తేడాతో క్రొయేషి యాపై విజయం సాధించింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ కేన్... ఫుట్‌బాల్ దిగ్గజం డేవిడ్ బెక్‌హామ్‌ను సమం చేశాడు. మూడు వేర్వేరు ప్రపంచ కప్‌ల్లో గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా హ్యారీ కేన్ (2018, 2022, 2026) నిలిచాడు. అతడి కంటే ముందు బెక్‌హామ్ (1998, 2002, 2006) పేరిట ఈ రికార్డు ఉండేది.


**కొలంబియా గ్రాండ్ రీ ఎంట్రీ**

గ్రూప్-కేలో జరిగిన మ్యాచ్‌తో కొలంబియా గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చింది. ఉజ్బెకిస్థాన్‌పై 3-1 గోల్స్ తేడాతో నెగ్గింది. 8ఏళ్ల తర్వాత ఫిఫా కప్ ఆడుతున్న కొలంబియా గ్రాండ్ విక్టరీ కొట్టింది. మొదటి అర్ధభాగంలో డేనియల్ మునోజ్ చేసిన గోల్‌తో కొలంబియా ఖాతా తెరిచింది. తొలి అర్ధభాగం ముగిసేవరకు 1-0ఆధిక్యం నిలుపుకుంది. రెండో అర్ధభాగం 60వ నిమిషంలో ఉగ్లీ ఫైజుల్లావ్ అద్భుత గోల్‌తో ఉజ్బెకిస్థాన్ సమవుజ్జీగా నిలిచింది. ఇది ఉజ్బెకిస్థాన్ జట్టుకు ఫిఫాలో తొలి గోల్. దీంతో ఆ జట్టు అభిమానులకు సంబరాలు చేసుకున్నారు. ఆ తర్వాతి ఐదు నిమిషాల్లోనే డియాజ్ గోల్ సాధించడంతో మళ్లీ కొలంబియా అధిక్యంలోకి వెళ్లింది. ఇక ఇంజ్యూరీ టైమ్ చివరి నిమిషాల్లో కుచో హెర్నాండెజ్ కుడి వింగ్‌లో బంతిని సబ్‌స్ట్యూట్ కాంపాజ్‌కు క్రాస్ చేయగా అతను హెడర్‌తో గోల్‌లోకి పంపించాడు. ఈ విజయంతో కొలంబియా ఖాతాలో మూడు పాయింట్లు చేరాయి. డానియల్ మునోజ్ (40వ నిమిషం), లూయిస్ డియాజ్ (65వ నిమిషం), జామిన్‌టన్ క్యాపాజ్ (90+9వ నిమిషం) కొలంబియా తరపున గోల్స్ కొట్టారు.

**ఘనామైన విజయం**

సాకర్ ప్రపంచకప్‌ను ఘనామైన విజయంతో ప్రారంభించింది. పనామాపై ఏకైక గోల్‌తో విజయం సాధించింది. స్టార్ ఆటగాడు థామస్ పార్టీ లేకున్నా ఘనా చక్కగా పోరాడింది. పనామాను





బెక్‌హమ్‌ను సమం చేసిన హ్యారీ కేన్

నిలువరించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. ఆట అదనపు సమయంలో ఘనా ప్లేయర్ కలేబ్ (90+5వ నిమిషం) గోల్ సాధించాడు. దీంతో డ్రా చేద్దామనుకున్న పనామా ఆశలకు తెర పడింది.

# ఐదో రోజూ లాభాల్లో ముగిసిన మార్కెట్లు




**ముంబయి, జూన్ 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్లోనూ లాభాలతో ముగిశాయి. ముడి చమురు ధరలు తగ్గడం, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సడలడం మార్కెట్ సెంటిమెంట్కు బలాన్నిచ్చాయి. హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లు కొనుగోళ్లతో పెరిగితే, ఐటీ షేర్లు మాత్రం ఒత్తిడిలో కొనసాగాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గడం, అమెరికాఇరాన్ శాంతి చర్చలపై సానుకూల సంకేతాలు, ఎఫ్‌పిఐల కొనుగోళ్లు పునరుద్ధరించటం, బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు పెరిగి 77,409.98వద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 82.30 పాయింట్లు 24,168 వద్ద స్థిరపడింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 4.85 పెరగగా, నిఫ్టీ 4.35 ఎగబాకింది. మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ 6.46లాభం హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ 1.74శాతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.56 చొప్పున పెరిగాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే బీఎస్ఈ 150మిడ్‌క్యాప్ సూచీ 0.41 పెరిగితే బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.67 లాభపడింది.



# పసిడి వెండి ధరలపై ఫెడ్‌రిజర్వు ఎఫెక్ట్

**న్యూఢిల్లీ, జూన్ 18:** అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గినప్పటికీ బంగారం ధరలు ఆశించిన స్థాయిలో ఊపందుకోవడంలేదు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధాన సంకేతాలు ఇవ్వడంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. గురువారం స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 4,270 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, రోజులో గరిష్ఠంగా 4,330 డాలర్లను తాకింది. మరోవైపు స్పాట్ సిల్వర్ 68.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, సెషన్‌లో 69.85 డాలర్ల వరకు పెరిగింది. అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం, హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు పెరగడం వల్ల ముడి చమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణ ఆందోళనలు కొంత తగ్గి బంగారం, వెండి కొనుగోళ్లకు మద్దతు లభించిందని కోటక్ సెక్యూరిటీస్ విశ్లేషించింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ, ఈ ఏడాది చివర్లో మరోసారి రేట్ల పెంపు అవకాశం ఉందని సంకేతాలు ఇవ్వడంతో బులియన్ మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగుతోంది.






# ధరలు పెంచుతున్న టాటా మోటార్స్

**ముంబయి, జూన్ 18:** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటామోటార్స్ వాణిజ్య వాహనాల ధరలను పెంచుతున్నటువెల్లడించింది. ట్రక్కులు, బస్సులు సహా కమర్షియల్ వాహనాల శ్రేణిలో గరిష్ఠంగా 2.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త ధరలు జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ముడి పదార్థాల ధరలు, ఇతర ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ భారాన్ని కొంత మేర భర్తీ చేసేందుకు ధరల సవరణ చేపడుతున్నట్లు కంపెనీ వివరించింది. ధరల పెంపు అన్ని వాహనాలపై ఒకేలా ఉండదని తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెరుగుదల మారుతుందని పేర్కొంది. ఇదే నెల ప్రారంభంలో టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహనాల ధరలను కూడా పెంచుతున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కార్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలపై 1.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు స్పష్టంచేసింది. ఆ పెంపు కూడా వచ్చే నెల నుంచే అమల్లోకి రానుంది. ఇటీవల ముడి పదార్థాల ధరల పెరుగుదల, నిర్వహణ వ్యయాల భారం కారణంగా పలు ఆటో కంపెనీలు ధరలను సవరించాయి. గత నెలలో హ్యుందాయ్ తమ వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచగా, మారుతి సుజుకి కూడా ఈ ఏడాది ప్రారంభంలో పలు మోడళ్ల ధరలను పెంచింది.

# ఎటిఎంల ద్వారానే పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ, జూన్ 18:** ఉద్యోగుల భవిష్య నిది సంస్థ డిజిటల్ సేవలను మరింత విస్తరిస్తోంది. ఈపీఎఫ్‌వో 3.0 కింద పీఎఫ్ ఖాతాదారులు యూపీఐ యాప్‌లు, పీఎఫ్‌కు అనుసంధానమైన ఏటీఎంల ద్వారా నేరుగా తమ నిధులను ఉపసంహరించుకునే సౌకర్యాన్ని ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకువస్తోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌ఆఫ్‌ఇండియా(ఎన్‌పీసీఐ) సహకారంతో రూపొందించిన ఈ వ్యవస్థకు సంబంధించిన టెస్టింగ్ ఇప్పటికే పూర్తయ్యాయి. కొత్త విధానంలో పీఎఫ్ ఖాతాలో ఉన్న మొత్తంలో 75 శాతం వరకు నిధులను వెంటనే బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పీఎఫ్ డబ్బులు తీసుకోవాలంటే క్లెయిమ్ దాఖలు చేసి, ఆమోదం కోసం కొంత కాలం వేచి చూడాల్సి వస్తోంది. కొత్తవ్యవస్థ అమల్లోకి వస్తే ఈ ప్రక్రియ మరింత సులభం, వేగవంతం కానుంది. ఈమార్పుతో ఉద్యోగులకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక సహాయం అందుబాటులోకి వస్తుంది. అదే సమయంలో పారదర్శకత, జవాబుదారీతనం కూడా పెరుగుతాయి. అయితే పదవీ విరమణ నిధుల భద్రత దృష్ట్యా పటిష్ఠమైన ధ్రువీకరణ, మోసాల నివారణ వ్యవస్థలు అవసరమని వారు సూచిస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ సాధించిన పురోగతిని సామాజిక భద్రతా వ్యవస్థలకూ విస్తరించే ప్రయత్నంగా ఈపీఎఫ్‌వో 3.0ను భావిస్తున్నారు.

# బ్రిటిష్ కార్ల దిగుమతులకు రాయితీ సుంకం

**న్యూఢిల్లీ, జూన్ 18:** భారత్‌యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమలులో భాగంగా, వచ్చే 15 ఏళ్లలో బ్రిటన్ నుంచి 3.78 లక్షల సంప్రదాయ ఇంధన (పెట్రోల్, డీజిల్) కార్ల దిగుమతులకు భారత్ కస్టమ్స్ రాయితీ సుంకాలను అనుమతించింది. ఈ ఒప్పందం జూలై 15 నుంచి అమల్లోకి రానుంది. ఆటోమొబైల్ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న సుమారు 110 శాతం దిగుమతి సుంకం దశలవారీగా 10 శాతానికి తగ్గనుంది. ఇరు దేశాలు కోటా విధానాన్ని అనుసరించనున్నాయి.

సీఈటీఏ పత్రాల ప్రకారం, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే సంప్రదాయ ఇంధన కార్ల కోటా ఐదో ఏడాదికి గరిష్టంగా 37వేల యూనిట్లకు చేరుతుంది. అనంతరం కస్టమ్స్ సుంకం 10 శాతం వద్ద స్థిరపడుతుంది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# జంగారెడ్డిగూడెంలో భారీ భూ మోసం గుట్టురట్టు

**ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**నకిలీ పత్రాలతో భూ కబ్జా**

**బతికుండగానే మరణ ధృవీకరణ పత్రం సృష్టించిన కేటుగాళ్లు**





**జంగారెడ్డిగూడెం జూన్ 18 ప్రభాత వార్త** నకిలీ పత్రాలతో కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి, భూ కబ్జాకు పాల్పడిన ఏడుగురు నిందితుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత రామనాథన్ గురువారం ఈ కుంభకోణానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

**ఏఎస్పీ సుస్మిత ఆర్ తెలిపిన వివరాల ప్రకారం.**

జంగారెడ్డిగూడెం పట్టణంలోని రామచంద్రపురం ప్రాంతానికి చెందిన రాజనాల రమాదేవికి 625 చదరపు గజాల విలువైన ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని అక్రమంగా కాజేయాలనే ఉద్దేశంతో నిందితులు నేరపూరిత కుట్ర పన్నారు. రమాదేవి బతికుండగానే ఆమె మరణించినట్లు ఒక నకిలీ మరణ ధృవీకరణ పత్రాన్ని సృష్టించారు. అంతేకాకుండా, ఆ ఆస్తిని ఉండి కృష్ణవేణి అనే మహిళకు రాసిచ్చినట్లు నకిలీ వీలునామాను కూడా తయారు చేశారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అనంతరం ఆ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి మత్స్య లోవరాజు, కాలివర్తి సుజాతల పేర్లపై మార్చారు. ఆపై పల్లి సత్తిబాబు, కంపరం చంద్రకళ అనే అమాయక కొనుగోలుదారులకు ఆ ప్లాట్లను విక్రయించి సుమారు రూ. 55 లక్షలు అక్రమంగా వసూలు చేశారు. ఈ మోసంపై అసలు బాధితురాలు రాజనాల రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ భారీ కుంభకోణం వెలుగుచూసింది. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులైన ఉండి కృష్ణవేణి, మత్స్య లోవరాజు, సింగంశెట్టి సత్యనారాయణ అలియాస్ సత్తిరాజు, జెట్టి ఉమామహేశ్వరరావు, సజ్జా రమేష్ బాబు, గెడా సుబ్రహ్మణ్యం, దాసరి సురేష్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి నకిలీ వీలునామా, నకిలీ మరణ ధృవీకరణ పత్రంతో పాటు వీటి తయారీకి ఉపయోగించిన ల్యాప్‌టాప్, ప్రింటర్‌ను సీజ్ చేశారు. అరెస్టయిన వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏఎస్పీ తెలిపారు. భూములు, ఇళ్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు ఈసీ, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, మోసాలపైన డయల్-112కు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలను మోసం చేయడానికి మాయ మాటలు చెబుతారని అటువంటి అపోహలు నమ్మవద్దని ఏఎస్పీ సుస్మిత ఆర్ తెలిపారు



# అమెరికా వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆస్తి మాయం..

- మీసేవ పేరుతో నకిలీ సర్టిఫికెట్లు.
- కైకలూరు సబ్ రిజిస్టర్‌తో సహా నలుగురిపై కేసు నమోదు.

**ముదినేపల్లి, జూన్ 18( ప్రభాత వార్త).** గత కొన్ని రోజులుగా ముదినేపల్లి మండలంలో కలకలం రేపుతున్న నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై గురువారం ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు నలుగురిపై పలు సెక్షన్ల పై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే ములకలపల్లి గ్రామానికి చెందిన త్రిపురనేని శ్రీలక్ష్మి అదే గ్రామంలో 2. 30 సెంట్లు వ్యవసాయ భూమి, మరికొన్ని సెంట్లు ఇండ్ల స్థలం ఉండగా భూమిని లీజుకు ఇచ్చి ఆమె తన పిల్లలు వద్దకు అమెరికా వెళ్ళగా తిరిగి వచ్చేసరికి అదే గ్రామానికి చెందిన నల్లపు శివ, మీసేవ నడుపుతూ శ్రీలక్ష్మి భూమిపై కన్నేసి గోపతాటి మహంకాళి, లలిత కొండమ్మ ముగ్గురు కలిసి కుమ్మక్కై ఆస్తి కాజేశారు అని వారు వాపోతున్నారు ప్రధమ ముద్దాయి శివ, శ్రీ లక్ష్మీ భర్త ఏసుబాబు హైదరాబాదులో చనిపోగా ఏలూరు పురపాలక సంఘంలో చనిపోయినట్లుగా నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకువచ్చి, అదేవిధంగా శ్రీలక్ష్మి భర్త ఏసుబాబును మహంకాళి భర్తగా, కొండమ్మను కూతురిగా తన మీసేవ కేంద్రం ద్వారా మండల తాసిల్దార్ సంతకం ఫోర్జరీ చేసి ,నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ సృష్టించి ,వీటితో కైకలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం కు వెళ్లి రిజిస్ట్రేషన్ తో కుమ్మక్కై రిజిస్ట్రేషన్ చేయించుకోగా, ఈ వ్యవహారంలో అక్రమ రిజిస్ట్రేషన్ కు పాల్పడిన కైకలూరు సబ్ రిజిస్టర్ పైన కూడా కేసు నమోదు అయినట్లు ముదినేపల్లి పోలీసులు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరుగుతుందని వారు తెలిపారు.

# కాలం చెల్లినా తొలగించని ఫ్లెక్సీలు

**జరుగుతున్న ప్రమాదాలు.**



**భీమవరం టౌన్, జూన్ 18 : ప్రభాతవార్త** వివిధ సంస్థలు, పట్టణ ప్రజలు పలు సందర్భాల్లో ముఖ్యమైన కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ఆయా సందర్భాలు ముగిసినప్పటికీ వాటిని తొలగించకపోవడం అనర్థాలకు కారణం అవుతున్నాయి. ఎటు వంటి అనుమతులు లేకనే ఏర్పాటు చేసు కోవడం, వాటంతట అవే చిరిగి పోయే వరకు ఎవ్వరు వాటిని పట్టించు కోకపోవడం జరుగుతుంది. స్థానిక మారుతి థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ నెలలుగా ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా పరిణమించింది. ఈ విధంగా ప్రధాన కూడళ్లలో ఏర్పా టు చేసే ఫ్లెక్సీలు ప్రయాణీకులకు అసౌ కర్యంగా తయారవుతు న్నాయి. నాలుగు రోడ్ల కూడళ్లు మరియు మలుపుల వద్ద ఏర్పా టు చేస్తుండటంతో వాహన చోదకులకు అవతలి వైపు వచ్చే వాహ నాలు కనిపించక ప్రమాదాలు జరుగు తున్నా యి. నెలల తరబడి ప్రజలు ఇబ్బం దులు పడుతున్నా ఎవరూ పట్టించు కోకపో వడం విమర్శలకు తావిస్తుంది.మున్సి పల్ అధికా రులకు ఆ ఫ్లెక్సీలు కనిపించకపోవడం విచి త్రం. గతంలో సినిమాల విడుదల సందర్భంగా పలువైపుల ఏర్పాటుచేసిన భారీ ఫ్లెక్సీల వలన పలు వైపు హీరోల సినీ అభిమానుల మధ్య గొడవ లు జరిగి కేసులు పెట్టుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కొద్ది సంవత్స రాల కిందట పట్టణంలో ఎటువంటి ఫ్లెక్సీలు చేయకూడదని నిబంధనలు విధించిన మునిసిపల్ అధికారు లు ఆ ఊసే మరిచి పోయినట్టున్నారు. రాజ కీయ నాయకుల సంబంధిత ఫ్లెక్సీలు పార్టీల వారీగా పోటీపడి మరీ ఏర్పాటు చేస్తుండటం శోచనీయం. వాటిని కాలం చెల్లిన తర్వాత కూడా ఎవరూ తొలగించేలా సాహసం చేయలే కపోవడం వైచిత్రమని ప్రజలు వ్యాఖ్యానిస్తు న్నారు. అధికారులు ఎప్పటికి గుర్తిస్తారో, తొలగిస్తారో , సమస్య పరిష్కరిస్తారో వేచి చూడడం తప్ప చేయగలిగింది ఏమీలేదు



**జిల్లాలో నీట్ (యూజీ)--2026 పరీక్ష నిర్వహణకు**

# పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**శాంతియుత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు పనిచేయాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం జూన్ 18 ప్రభాతవార్త** జిల్లాలో ఈనెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్-యూజీ) 2026 పరీక్షలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో నీట్ (యూజీ)--2026 పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, భీమవరం ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్డీవో ఎం.సూర్యారావు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, నీట్ (యూజీ)--2026 పరీక్ష ఈనెల 21వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాటిలో భీమవరంలో రెండు, తణుకులో రెండు, తాడేపల్లిగూడెంలో ఒక కేంద్రం ఉన్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలుగా భీమవరం డీఎన్ఆర్ పీజీ అటానమస్ కళాశాల, డీఎన్ఆర్ యూజీ అటానమస్ కళాశాల, తాడేపల్లిగూడెం ఎంఎంఎం అకాడమిక్ కాంప్లెక్స్, నిట్ కళాశాల, తణుకు పీఎం శ్రీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జేఎస్ఎంఎల్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలోని 5 కేంద్రాలలో మొత్తం 2,475 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాలలోకి ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య అనుమతిస్తారని, అనంతరం ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. అందువల్ల అభ్యర్థులు సమయపాలన పాటిస్తూ ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణ సందర్భంగా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరుగుతున్న రోజున అన్ని పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్--144 అమలు చేసి, అనధికార వ్యక్తులు గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే అభ్యర్థులకు అవసరమైన త్రాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల వద్ద అంబులెన్సులు సిద్ధంగా ఉంచడంతో పాటు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి, భీమవరం డీఎస్పీ రఘువీర్ విష్ణు, తాడేపల్లిగూడెం తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, తణుకు తహసీల్దార్ అశోక్ వర్మ, నిట్ ఎగ్జామ్స్ సూపరింటెండెంట్ దీపిక, జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి, జడ్పీ బాలికల పాఠశాల సూపరింటెండెంట్ టి.వరలక్ష్మి, సిటీ కోఆర్డినేటర్ సిహెచ్. ఏడుకొండలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల కూటమి పాలనకు ప్రజలు బ్రహ్మారథం

- అభివృద్ధి, సంక్షేమానికి సమాంతరంగా అధిక ప్రాధాన్యత.....
- గొడ్డల పార్టీ విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలి
- పాలకొల్లులో కూటమి రెండేళ్ల నమ్మకం సభలో మంత్రులు శ్రీనివాస్ వర్మ, రామానాయుడు.



**పాలకొల్లు జూన్ 18 ప్రభాతవార్త** అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యమిచ్చి కూటమి ప్రభుత్వం దూసుకు పోతోందని... అందుకు మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లా కలయిక వల్లే సాధ్యపడిందని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు లు అన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు గొడ్డలి పార్టీ అబద్ధాలు అసత్యాలతో విష ప్రచారాన్ని కూటమి శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రామచంద్ర గార్డెన్స్ లో గురువారం ప్రధానిగా మోడీ 12 ఏళ్లు పూర్తి, కూటమి ప్రభుత్వ రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో పాల్గొని మాట్లాడారు. కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు జేజేలు పలుకుతున్నారని, దీనిని గొడ్డల పార్టీ ఓర్వలేకపోతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పనితీరును వివరిస్తూ చంద్రబాబు పవన్ కళ్యాణ్ లకు మోడీ ఉండడమే కారణం అన్నారు. మంత్రి రామానాయుడు గురించి మాట్లాడుతూ రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తున్నారని, ఎక్కడెక్కడ నిధులు ఉన్నాయో కనిపెట్టి తీసుకువచ్చే ఘనుడని ప్రసంశించారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ పనిచేసే ఎమ్మెల్యేల్లో మంత్రి రామానాయుడు మొదటి ఉంటారన్నారు. సభకు అధ్యక్షత వహించిన మంత్రి నిమ్మల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనకు అన్ని వర్గాల ప్రజలు పూర్తి సంతృప్తి చెందారని, బ్రహ్మరథం పడుతున్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయన్నారు. కాగా గొడ్డలి పార్టీ, ఆ పార్టీ అధినేత జగన్ కుట్రలు కుతంత్రాలతో అభివృద్ధికి అడ్డు తగులుతున్నాడు అన్నారు. రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం రక్షణ కవచం వంటిదన్నారు. 2024 లో అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్ పై ఉన్నప్పటికీ ప్రజలకు ఎటువంటి లోటు లేకుండా అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్ళుగా సమాంతరంగా పాలన అందిస్తున్నామన్నారు.

గత ఐదేళ్లు కక్షలు వేధింపులు విధ్వంసంతో పాలన అందించిన గొడ్డలి పార్టీ నేడు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 సీట్లకే పరిమితమైన మన కూటమి ప్రభుత్వ పాలన గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటీవల వెన్నుపోటు అనే కార్యక్రమాన్ని నిర్వహించారని, మన ప్రభుత్వంలో అమలు చేస్తున్న వృద్ధులు, వితంతువులకు నువ్వు 2000 నుంచి 3000 పెన్షన్ పెంపు, రంగులకు 3000 నుంచి 6000 పెంపు, కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ 15000 చొప్పున తల్లికి వందనం పథకం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, డీఎస్సీ ద్వారా 16,350 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ, అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20,000, ఆటో డ్రైవర్ల సేవలో 15000, రద్దు చేసిన అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి అనేక పథకాలు అమలు చేయడం వెన్నుపోటా అంటూ ప్రజలే ప్రశ్నిస్తున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. ఆ పార్టీ చేసే విష ప్రచారం పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని రామా నాయుడు పిలుపునిచ్చారు. ఒక్క ఛాన్స్ అంటే ప్రజలు నమ్మి ఐదేళ్లపాటు అధికారం ఇస్తే కక్షలు, కార్పన్యాలు, నియంతృత్వ పోకడలతో పాలన సాగించడం మనమందరం చూసామన్నారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనకు, రెండేళ్ల కూటమి పాలనకు ప్రజలు తేడా గమనించాలన్నారు. అధికారం పోయిన ఈ రెండేళ్లలోనూ జగన్ పార్టీ పరిస్థితి పిచ్చివాడి చేతిలో రాయిలా మారిందన్నారు. రోజు రోజుకి క్షీణిస్తున్న పార్టీని కాపాడటానికి, క్యాడర్ను నిలబెట్టుకోవడానికి అడ్డదారులు తొక్కుతున్నాడు అన్నారు. నియోజకవర్గంలో రెండేళ్లలో 986 కోట్లు నిధులు తీసుకువచ్చి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామని ఇప్పటికే కొన్ని పూర్తిగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. శాఖల వారీగా వచ్చిన నిధులను జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా అహర్నిశలు కష్టపడి పని చేస్తానని, అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. సభలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్,టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు నాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, బోనం చిన్న నరసయ్య, ఉన్నమట్ల కబర్ది, గండేటి వెంకటేశ్వరరావు, పాముల రజనీ కుమార్, మామిడి శెట్టి పెద్దిరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, కర్నేన గౌరు నాయుడు, రోజా రమణి, తుల రామలింగేశ్వరరావు, ఎర్రం శెట్టి పద్మారావు, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, పేదల శ్రీనివాస్, వీరబాబు, ఉన్నమట్ల ప్రేమ్ కుమార్, రియా తదితరులు మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గం నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ మంత్రి నిమ్మల ప్రత్యేకమైన భోజనాలను ఏర్పాటు చేశారు.

# విద్యార్థి దశ నుంచే హరిత విప్లవానికి కృషి చేయాలి

**ప్రతి విద్యార్థి తమ తల్లి పేరుతో మొక్క నాటాలి - తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపు**



**తణుకు, జూన్ 18 ( ప్రభాత వార్త)** ప్రతి ఒక్కరూ ఒక మొక్కకు జన్మను ఇచ్చే విధంగా కృషి చేసి హరిత విప్లవానికి నాంది పలకాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. గురువారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడ్ బాల్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు ఎమ్మెల్యే రాధాకృష్ణ వివరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలతో సీడ్ బాల్స్ తయారు చేసి పర్యావరణాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 కోట్లు సీడ్ బాల్స్ తయారు చేసి అటవీ ప్రాంతాలతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చల్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరున ఒక మొక్కను నాటే విధంగా కృత నిశ్చయంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలన విజయోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జె. సి.రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం జూన్ 18ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 19న పెదఅమీరం గ్రామంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు మరియు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. సభా వేదిక (డయాస్), సీటింగ్ ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే ఉద్దేశంతో వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్య శాఖ, మత్స్యశాఖ, స్త్రీశక్తి, విద్య, పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన తదితర రంగాలకు సంబంధించిన ప్రభుత్వ పథకాల అమలు, వాటి ద్వారా లబ్ధి పొందిన వర్గాల వివరాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రదర్శించాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ప్రాంగణాన్ని సభా ప్రాంగణం ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్. వెంకటేశ్వర్లుకు సూచించారు. అలాగే ఆర్టీసీ బస్సు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ట్రాక్టర్, పీఎం అజయ్ ఆటోలు, స్వచ్ఛ రథం వంటి పథకాల ప్రదర్శన వాహనాలను సభాస్థలికి వెలుపల ప్రత్యేక ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటు ధరలో భోజనం అందిస్తున్న అన్న క్యాంటీన్‌కు సంబంధించిన ప్రత్యేక ప్రాంగణాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం పథకం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి కీలక పథకాలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి ప్రయోజనాలను కళ్లకు కట్టినట్లు చూపించేలా ఆకర్షణీయమైన నమూనాలు, ప్రతిరూపాలు, సమాచార స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులు ప్రతి పథకం గురించి పూర్తి అవగాహన పొందేలా, అర్హతలు, దరఖాస్తు విధానం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలను స్పష్టంగా వివరించే సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సభకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారులు మరియు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్-ఎస్ వేణుగోపాల్, డి పి ఆర్ ఓ టి.నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, హౌసింగ్ పీడీ జి. పిచ్చయ్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ యు.మంగపతిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆక్వా రైతులను ఆదుకున్నది చంద్రబాబు.. అన్యాయం చేసింది జగన్ : మంత్రి నిమ్మల



**పాలకొల్లు జూన్ 18 ప్రభాత వార్త**

రాష్ట్రంలో ఆక్వా రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు గొడ్డలి పార్టీ అధినేత జగన్ కి లేద రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. ఆక్వారైతులకు అండగా నిలబడింది, ఆదుకున్నది చంద్రబాబు నాయుడు మాత్రమేనని నిమ్మల పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల్లో ఏర్పడిన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ మంత్రి నిమ్మల ఆధ్వర్యంలో గురువారం జరిగిన 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం' సభలో ఆయన మాట్లాడారు. 2014- 19 మధ్యకాలంలో... తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులకు సరఫరా చేసే విద్యుత్ యూనిట్..రేటు 3 రూపాయల 86 పైసలు ఉండగా దానిని రెండు రూపాయలు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదే అని ఆయన పేర్కొన్నారు. అలాగే ఆక్వా రైతులకు అనేక రాయితీలు ఇచ్చినది కూడా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనేనని ఆయన స్పష్టం చేశారు. ఆక్వా అంటేనే చంద్రబాబు , చంద్రబాబు అంటేనే ఆక్వా అని పేర్కొన్నారు.

వైకాపా గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు రూపాయలు యూనిట్ రేట్ ను 1. 50 పైసలకు తగ్గించినట్లే తగ్గించి అనేక ఆంక్షలు, కొత్త నిబంధనలు పెట్టి ఆక్వా రైతులను నట్టేట ముంచేసాడన్నారు. ఆక్వా, నాన్ ఆక్వా జోన్, పది ఎకరాల నిబంధనలతో నూటికి 90 శాతం మంది ఆక్వా రైతులకు సబ్సిడీ జగన్ ఎగ్గొట్టాడని విమర్శించారు. అలాగే టిడిపి ప్రభుత్వంలో ఆక్వా రంగానికి అవసరమైన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఉచితంగా అందించి రైతులకు భరోసా కల్పించామని తెలిపారు. అదే వైకాపా పాలనలో ట్రాన్స్ఫార్మర్ కావాలంటే మూడు నుంచి ఐదు లక్షల చెల్లించే పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. ఆక్వా రైతులపై అంత భారం మోపటానికి కారకుడు జగన్మోహన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. అదనపు ట్రాన్స్ఫార్మర్ చార్జీల భారం, బల్కుగా కొనుగోలు వ్యవహారం "జె" టాక్స్ వసూలు కోసమే అని రామానాయుడు విమర్శించారు. ట్రాన్స్ఫార్మర్లను అధిక ధరకు బల్క్‌గా కొనుగోలు అగ్రిమెంట్ చేయడం వల్ల రాబోయే రోజుల్లో కూడా రొయ్య రైతులు భారాన్ని భరించాల్సి వస్తుందని అన్నారు. ఆక్వా కల్చర్‌ను దెబ్బతీసిన రైతు వ్యతిరేకి జగన్ అని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఫీడు ధరల నియంత్రణకు కృషి చేస్తుందన్నారు. అలాగే మార్కెట్ ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో రొయ్య ధరలు పెరుగుదల, తగ్గింపులకు అనుగుణంగా రైతులే నిర్ణయించుకునే విధంగా రైతులకు ప్రాతినిధ్యం కల్పించేలా ఓ కమిటీని వేసి ఆక్వారంగ అభివృద్ధికి చంద్రబాబు పాటుపడుతున్నారని మంత్రి రామానాయుడు వెల్లడించారు.



# యూరియా అమ్మకాలు పరిశీలించిన వ్యావసాయాధికారి



**ఆగిరిపల్లి జూన్ 18 ప్రభాత వార్త** మండలములో ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 యాప్ ద్వారా రైతులకు యూరియాడి ఏ పిఅమ్మకములను గురువారం మండల వ్యవసాయాధికారి జె.భవాని పరిశీలించారు. మండలములోని రైతులందరూ యాప్ ద్వారా మొదటి డోస్ కొనుగోలు చేసే ముందుగానే రైతులు యాప్ లో ఏమైనా వ్యత్యాసములు ఉంటే తమ తమ రైతు సేవా కేంద్రములలో సరి చేయించుకోవాలని సూచించారు. మొదటి డోస్ కొనుగోలు చేసిన తరువాత ఎటువంటి మార్పులు చేర్పులకు అవకాశము ఉండదని తెలియచేసారు. ఈనాం భూములు, వెబ్ ల్యాండ్ లో లేని భూములు, దేవాదాయ భూములు పంట నమోదు కానట్లు అయితే రైతు సేవ కేంద్రముల సిబ్బందిని సంప్రదించి పంట నమోదు, ఏమైనా వ్యత్యాసములు మొదటి డోస్ కొనుగోలు చేయుటకు ముందే సరిచేయించుకోవాలని తెలియచేసారు. డీలర్లు అందరూ తప్పనిసరిగా యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని తెలియచేశారు. నిబంధనలు ఉల్లంఘించి అమ్మకాలు జరిపిన యెడల కఠిన చర్యలు తీసుకొనబడతాయని తెలియచేసారు.

# మామిడికి సిరులు కురిపించే హైడెన్సిటీ విధానం

## రావిచర్ల లో ప్రయోగాత్మకంగా కాపా శ్రీను సాగు మామిడి రైతుల్లో చిగురిస్తున్న ఆశలు




**నూజివీడు, జూన్ 18 ప్రభాతవార్త:** గత కొన్నేళ్లుగా మామిడి పంటకు పలు రకాల తెగుళ్లు వ్యాపించి, దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. పంట నాణ్యత కూడా కోల్పోవడం జరిగింది. రాను రాను మామిడి సాగు రైతుకు గుదిబండగా మారింది. పెద్దపెద్ద మామిడి తోటలు రైతులు నరికేసి పామాయిల్ సాగు వైపు దృష్టి సారించారు. మామిడి కి పుట్టిల్లు అయిన నూజివీడు పరిసర ప్రాంతాల్లో మామిడి కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయ రైతు కుటుంబం నుంచి వచ్చిన ప్రముఖ అభ్యుదయ రైతు, నూజివీడు ఏ.ఎం.సీ మాజీ చైర్మన్ , రావిచెర్ల గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి నియోజకవర్గ నాయకులు కాపా శ్రీనివాసరావు ప్రయోగాత్మకంగా హైడెన్సిటీ విధానములో మామిడి సాగు చేపట్టారు. ఈ విధానం ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, ఏ.పీ లో చిత్తూరు లో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ విధానం పై ప్రముఖ రైతు కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ హైడెన్సిటీ విధానంలో మామిడి సాగు అంటే తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలను శాస్త్రీయ పద్ధతిలో నాటి, కత్తిరింపు (ప్రూనింగ్), నీటి యాజమాన్యం, ఎరువుల నిర్వహణ ద్వారా అధిక దిగుబడి పొందే సాగు విధానం అని తెలియజేశారు.ముఖ్య లక్షణాలు తమ తండ్రి కాలంలో ఎకరానికి సాధారణ సాగులో 18, 25 మొక్కలు మాత్రమే నాటుతారు. ప్రస్తుత హైడెన్సిటీ విధానంలో 200 వరకు మొక్కలను నాటవచ్చు. అయితే తాము ఒక ఎకరం70 సెంట్ల భూమిలో 450 మొక్కలు నాటామని పేర్కొన్నారు. కొన్ని అల్ట్రా హైడెన్సిటీ విధానాల్లో ఇంకా ఎక్కువ మొక్కలు కూడా నాటుతారు.మొక్కల ఎత్తు, కొమ్మలను క్రమం తప్పకుండా కత్తిరించి నియంత్రిస్తారు. డ్రిప్ ఇరిగేషన్, ఫెర్టిగేషన్ ద్వారా నీరు, ఎరువులు అందిస్తారు. ప్రయోజనాలు: ఎకరానికి ఎక్కువ దిగుబడి. త్వరగా కాపుకు రావడం.కోత, మందుల పిచికారీ సులభం. నీరు, ఎరువుల వినియోగం సమర్థవంతంగా ఉంటుంది.ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది.జాగ్రత్తలు:.క్రమం తప్పకుండా ప్రూనింగ్ చేయాలి.డ్రిప్ సిస్టమ్ ఉండటం మంచిది.పోషకాలు, పురుగు-వ్యాధుల నిర్వహణ శాస్త్రీయంగా చేయాలి.నాణ్యమైన నర్సరీ మొక్కలను మాత్రమే నాటాలి. సాధారణ మొక్కల మధ్య దూరంసంప్రదాయ పద్ధతి: 10 ఐ 10 మీటర్లు ఉండగా హైడెన్సిటీ పద్ధతి: 5 ఐ 5 మీటర్లు లేదా 4 ఐ 2 మీటర్లు (రకం, నిర్వహణను బట్టి మారుతుంది) అని వివరించారు. తాను 4 అడుగులు దూరంలో 3 సంవత్సరాల క్రితం చిన్న రసాల మొక్కలు నాటామన్నారు. చెట్టుకు 70 నుంచి 100 కాయలు కాసాయన్నారు. ఈ విధానం సరైన నిర్వహణతో అమలు చేస్తే, సంప్రదాయ సాగుతో పోలిస్తే ఎకరానికి గణనీయంగా అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుందన్నారు. పెద్ద మామిడి చెట్లు టన్ను కాయలు కాసినప్పటికీ నాణ్యత లేకపోవడం వలన గిట్టుబాటు ధర ఉండటం లేదన్నారు. పెద్ద చెట్లు ఎక్కి కాయలు కోసే కూలీలు కూడా దొరకడం లేదన్నారు. ఈ కారణంగా కాయలను గ్రేడింగ్ చేసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ కారణంగా తమకు రావాల్సిన ఆదాయం కూడా తగ్గిపోయింది అన్నారు. మామిడికి ప్రధానంగా తేనె మంచి పురుగు, ముద్ది పుచ్చు, పండు ఈగ తెగుళ్లతో సర్వ నాశనం చేస్తుందన్నారు. 4.4 దూరంతో సాగు చేస్తున్న మామిడి మొక్కలు సాగు చేసేందుకు అన్ని విధాల ప్రయోజనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాకాలం పశువుల ఎరువు వేయటం, వర్షపు నీరు కూడా చెట్ల పాదులలోనే ఇంకిపోయే విధంగా ఏర్పాటు చేస్తున్నాము. తాము 20వేల కాయలకు కవర్లు కట్టామని , ఈ విధానం వలన మామిడికాయలకు ఏ విధమైన తెగులు , పురుగు కూడా వ్యాపించదు అన్నారు. మామిడికాయలు నాణ్యత పెరుగుతుందన్నారు. రైతులందరూ ఈ విధంగా సాగు చేస్తే మామిడి మరల నూజివీడులో పునర్ వైభవం పొందుతుందన్నారు.

# మలేరియాను ఇప్పుడే నిర్మూలిద్దాం.



**లింగపాలెం జూన్ 18 (ప్రభాతవార్త )** లింగపాలెం ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ సారథ్యం లో వైద్యధికారి నైమేష, నాగార్జున అధ్యక్షతన మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ పీహెచ్సీ నుండి బస్టాండ్ వరకు జరిగినది.అక్కడ సిబ్బంది అందరూ మానవహారంగా ఏర్పాడి మలేరియా వ్యతిరేక ప్రతిజ్ఞ చేసారు. అనంతరం పీహెచ్సీ లో ఏర్పాటు చేసిన అవగాహన సదుస్సు లో చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి మలేరియా నిర్మూలన ఆవిష్యకత, నివారణ, తీసికోవలిసిన జాగ్రత్తలు, ఫ్రైడే డ్రై డే, పరిసరాల పరిశుభ్రత, జ్వరం అన్పిస్తే దగ్గరలో ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్షలు చెంచుకొని వైద్యులు సలహా మేరకు మందులు వాడితే మలేరియా రహిత సమాజంగా చేయవచ్చునని, దీనికొరకు మనం ఇప్పుడే చేయాలి, ఇప్పుడే చేయగలం అని మరియు మలేరియా లైఫ్ సైకిల్ ను వివరించారు. ఈ కార్యక్రమం లో ఎం పి హెచ్ ఈ ఓ అర్జునరావు, పీహెచ్ఎన్ పద్మజకుమారి, ఎం పి హెచ్ ఎస్ వి. ఇమ్మిబాబు కె. శ్రీనివాసరావు, ఎంపీ హెచ్ లు వి ప్రసాద్, జగన్, లు, ఏ ఎం ఎం లు, ఆశాలు మరియు అంగనవాడి టీచర్లు హాజరైయ్యారు

# ఘనంగా బొమ్మిడి సునీల్ జన్మదినం



**నరసాపురం ప్రభాతవార్త**నర్సాపురం ఎమ్మెల్యే నాయకర్ సోదరుడు బొమ్మిడి సునీల్ జన్మదిన వేడుకలను కూటమి నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నాయకర్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు వలవల నాని పొత్తూరి రామరాజు కొల్లు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# తేతలి సాయిబాబా రెడ్డికి మానవతా అశ్రు నివాళి



**పెనుమంట్ర, జూన్-18, (ప్రభాతవార్త)** మండల కేంద్రమైన పెనుమంట్ర లో సాయినాథ్ ట్రావెల్స్ అధినేత తేతలి సాయిబాబా రెడ్డి అకాల మరణానికి చింతిస్తూ బుధవారం చిర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మానవతా మండల శాఖ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంతాప సభ లో తేతలి సాయిబాబా రెడ్డి వ్యాపార వేత్త, సేవాతత్పరులు, దానశీలి అని అన్నారు. మానవత కు శాశ్వత సభ్యులు అని, మండలం ఆయన చేయని సేవా కార్యక్రమం లేదని, ఆయన సహాయం పొందని అభాగ్యులు లేరంటే అతిశయోక్తి కాదని అన్నారు. తేతలి సాయిబాబా రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయిన వారు చేసిన సేవాకార్యక్రమాలలో ఆయన కనిపిస్తారని, ఆయన లోటు ఆ కుటుంబానికే కాకుండా మండల ప్రజలకు తీరని లోటని అన్నారు. వారి కుటుంబానికి ఆ భగవంతుడు ఆత్మస్థైర్యాన్ని కలుగ చెయ్యాలని, కీ. శే. తేతలి సాయిబాబా రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ సంతాప సభ కు జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణ మూర్తి, కో-చైర్మన్ పడాల జగన్నాథ రెడ్డి, కోశాధికారి అమృతవక్కుల సత్యనారాయణ, సంస్థ సభ్యులు చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కోనాలా నర్సిరెడ్డి, రోబ్బి భాస్కరరావు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భూ వివాదం లా అండ్ ఆర్డర్‌ను ఉల్లంఘిస్తే

## కేసులు నమోదు సబ్ కలెక్టర్ వినూత్న హెచ్చరిక



**ముసునూరు,జూన్18 ప్రభాతవార్త:** ముసునూరు మండలం, చింతలవల్లి గ్రామంలో భూ వివాదంపై నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. చింతలవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 207 లో ఏనుగుదాటి నాగరాజుకు చెందిన 74 సెంట్లు పట్టా భూమి ఉంది. ఆ పొలానికి ప్రధాన రహదారికి మధ్య 2 ఎకరాల 5 సెంట్లు వాగు పోరంబోకు భూమి ఉండగా పలువురు ఆక్రమించుకుని పక్కా గృహాలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే పట్టా భూమికి ప్రక్క నుండి ఊర చెరువుకు వెళ్ళే వాగును బాగుచేయించాలని, తద్వారా మా భూములు వరద ముంపుకు గురికాకుండా ఉంటాయని భూ యజమాని నాగరాజు సబ్ కలెక్టర్ కు విన్నవించారు. వాగును ఆక్రమించుకుని నిర్మాణాలు చెయ్యడం వల్ల నీరు ఎటూ వెళ్ళే అవకాశం లేకుండా పోయిందని, వర్షం వచ్చినప్పుడు పంట పొలాలు మునిగిపోయి తమకు నష్టం వాటిల్లుతుందని భూ యజమాని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సదరు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకున్న వారు భూ యజమానిపై వ్యతిరేకంగా పలు ఆరోపణలు చేశారు. తాము ఏళ్ల తరబడి ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నామని సబ్ కలెక్టర్ కు తెలిపారు. పట్టా భూమిని తాము ఆక్రమించుకోలేదన్నారు. వాగు పోరంబోకు భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతుంటే రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వాగు పోరంబోకు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. పట్టా భూమిని సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని సూచించారు. ప్రభుత్వ భూమిలో ఇకపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా, ఘర్షణ వాతావరణం నెలకొన్నా చర్యలు తీసుకోవాలని పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ముందస్తుగా భూ యజమానిపై, వాగు పోరంబోకు భూమిలో ఆక్రమణలు చేసినవారిపై బైండోవర్ కేసులు నమోదు చెయ్యాలని చెప్పారు. అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని భూ యజమాని నాగరాజు చెప్పారు. మా భూములు వర్షం వచ్చినప్పుడు ముంపుకు గురికాకుండా వాగును విడగొట్టి బాగుచేయించాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తానని, ఇకపై ఎవ్వరూ ఈ విషయంలో గొడవలు పడవద్దని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఇరు వర్గాలకు సూచించారు. అధికారులు వాగును విడదీసి సక్రమంగా వర్షపు నీరు పారుదల అయ్యేలా చూస్తారో? లేక కాలయాపన చేస్తారో? లేక రాజకీయ వత్తిడికి తలొగ్గి రైతులకు అన్యాయం చేస్తారో? వేచి చూడాల్సిందే.

# అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



**పెనుమంట్ర, జూన్-18, (ప్రభాతవార్త)** మండలంలోని మార్టేరు గ్రామం-02 అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్-డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెనుమంట్ర ఐసిడీఎస్ ప్రాజెక్టు అధికారిని అంగర కృష్ణకుమారి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అందిస్తున్న ప్రీ-స్కూల్ విద్య, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ సేవల ప్రాధాన్యాన్ని ఆమె వివరించారు.ప్రాథమిక విద్యకు ముందు చిన్నారుల్లో మానసిక, శారీరక, సామాజిక నైపుణ్యాల పెంపొందింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. చిన్నారుల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలక భూమిక పోషిస్తున్నాయని పేర్కొన్నారు.గ్రాడ్యుయేషన్-డే సందర్భంగా చిన్నారులకు ప్రత్యేక టోపీలు ధరింపజేసి, సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్‌వాడీ నుంచి పాఠశాల విద్యలోకి అడుగుపెడుతున్న చిన్నారులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు.

# కైకలూరులో ఘనంగా

## బోడె రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు



**కైకలూరు,జూన్ 18 (ప్రభాతవార్త)** బిసివై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు కైకలూరు నియోజకవర్గ బిసివై పార్టీ అధ్యక్షులు తోకల రామకృష్ణ ఆధ్వర్యంలో కైకలూరు పట్నంలోని సివిన్నార్ గార్డెన్స్ నందు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన జన్మదినోత్సవం పురస్కరించుకుని కేక్ కట్ చేసి వితంతువులకు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు రామచంద్ర యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొంతమందికి బీసీవై పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

# మావుళ్ళమ్మను దర్శించుకున్న విప్ కంచర్ల శ్రీకాంత్



**భీమవరం జూన్ 18 ప్రభాతవార్త** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణం లో వేంచేసి ఉన్న ప్రముఖ ఇలవేల్పు ఆరాధ్యదైవం శ్రీ మావుళ్లమ్మ అమ్మవారిని ప్రకాశం,నెల్లూరు,చిత్తూరు గ్రాడ్యుయేట్స్ ఎం ఎల్ సి ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ సరిత దంపతులు దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు వీరికి పూజా మరియు ఆశీర్వచనాలు నిర్వహించినారు,దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ఆలయ చైర్మన్ బొండాడ నాగ భూషణం, ధర్మకర్తలు రామాయణం శ్రీనివాస్ ఫోటో ప్రసాదాలు వీరికి అందచేసారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన,



**పెనుమంట్ర, జూన్ 18, (ప్రభాతవార్త)** మండలంలోని బ్రాహ్మణచెరువు నాలుగు రోడ్ల సెంటర్‌లో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు గున్నేపల్లి పుల్లాజీ ఆధ్వర్యంలో, ఓబీసీ మోర్చా ప్రభుత్వ పథకాలపై అవగాహన మరియు రిజిస్ట్రేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకుని దేశంలో అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా నిలిచిన సందర్భంగా, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పోస్టల్ శాఖ సహకారంతో ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన వారికి రిజిస్ట్రేషన్ చేపట్టారు. ముఖ్య అతిథులుగా పెనుమంట్ర బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ బి. నాగేంద్ర కుమార్, పోస్టుమాన్ ఎల్. రాజ్ కమల్ హాజరై పథకాల వివరాలను వివరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గోపి సుందర్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తుపాకుల గోవిందాచార్యులు, కోడి నరసింహ, పెనుమంట్ర మండల అధ్యక్షులు మారుతి కృష్ణ, పృథ్వీ ఇందిరప్రియదర్శిని, రమణకుమారి, లక్ష్మీప్రసన్నతో పాటు బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాప్ ద్వారా యూరియా పంపిణీ



**చాట్రాయి, జూన్ 18 ప్రభాతవార్త** చాట్రాయి మండలంలోని తుమ్మగూడెం సహకార సంఘములో సందర్శించి యూరియా మరియు డి ఏ పి ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించిన్నట్లు మండల వ్యవసాయాధికారి బి శివ శంకర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ 2.ఉ వెబ్సైట్ ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ గురించి రైతులతో చర్చించి వాటి వివరాలను తెలియ చేసినట్లు ఆయన తెలిపారు. వెబ్సైట్ నందు రైతు ఆధార్ నెంబరు ఎంటర్ చేసిన వెంటనే ఓటీపీ ధ్రువీకరణతో పంట విస్తీర్ణము,పంట రకము ఆధారంగా రైతులకు దపాల వారీగా డి ఎ పి , యూరియా కేటాయించబడిన వివరములు రైతులకు కనబడతాయని ఆయన వివరించారు. రైతులకు కేటాయించిన ఎరువులు సులభంగా పొందవచ్చుని ఏపీ ఎయిమ్స్ వెబ్సైటు నందు కౌలు రైతులు,వెబ్ ల్యాండ్ లో లేని భూమి పాసుబుక్ పొందని సాగుచేయి రైతుల కూడా ఎరువులను పొందుటకు సులభతరం అవుతుందన్నారు. మీకు మీ దగ్గరలోని రైతు సేవ కేంద్రం ని సంప్రదించి మీ పంట వివరాలను తెలిపిన యెడల ఆ గ్రామ వ్యవసాయ మరియు ఉద్యానవన సహాయక అధికారులు విస్తీర్ణము పంట వివరములను తెలియజేయవచ్చు అని అన్నారు.

# దత్తాశ్రమంలో మజ్జిగ పంపిణీ



**మండవల్లి జూన్ 18(ప్రభాతవార్త)** మండలంలోని లోకుమూడి దత్తాశ్రమం నందు నిర్వహిస్తున్న మజ్జిగ వితరణ కార్యక్రమంలో నూతన రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పోసిన చెంచు రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఆయన వంతుగా గురువారం మజ్జిగ పంపిణీకి దాతగా నిలిచారు. ముందుగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ గత నెల రోజులుగా వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు దత్తాశ్రమ నందు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు పరసా ఏడుకొండలు, మాదేం కృష్ణారావు, అల్లూరి సత్యనారాయణ, మారగాని బద్రి , కందుల నితిన్ సామ్రాట్, పోలగాని మహాలక్ష్మణుడు,సొంటి చిన్న, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన జోయల్ డెన్నిస్‌కు సత్కారం



**అత్తిలి, జూన్ 18 ( ప్రభాత వార్త )** కీబోర్డు వాయిద్యంలో అసాధారణ ప్రతిభను కనబర్చి, గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించిన రాయుడు జోయల్ డెన్నిస్ అభినందనీయుడని వరిఘేడు పారీస్ పాస్టర్ జి సుధీర్‌బాబు అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో ట్రినిటీ లూథరన్ చర్చిలో సంఘ సభ్యులు రాయుడు జోయల్ డెన్నిస్‌ను సన్మానించారు. ఈసందర్భంగా పాస్టర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ చిన్నవయస్సులోనే జోయల్ డెన్నిస్ గంట సమయం పాటు నిరవధికంగా కీబోర్డును వాయించి గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించడం గొప్పవిషయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రాయుడు ధర్మారావు మాట్లాడుతూ 7వ తరగతి చదువుతున్న తన మనువడు జోయల్ డెన్నిస్ హైదరాబాద్‌లో హల్లెల్ మ్యూజిక్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో 22 దేశాలకు చెందిన 2 వేల మంది కీబోర్డు వాయిద్యకారులు గంట పాటు నిరవధికంగా కీబోర్డు వాయించారని, ఇందులో ప్రతిభకనబర్చిన 777 మందిని ప్రత్యేకంగా ఎంపిక చేసారన్నారు. ఇందులో గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ రాయుడు జోయల్ డెన్నిస్ ప్రతిభను గుర్తించి అధికారికంగా రికార్డు నమోదు చేసిందన్నారు. గిన్నీస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించి జోయల్ డెన్నిస్‌కు పెందుర్తి ఇండియన్ పెంతెకోస్తల్ చర్చిలో నిర్వహించిన గిన్నిస్ అచీవర్స్ మీట్‌లో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టిన్ దండింగి చేతులు మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందజేసారని తెలిపారు. ట్రినిటీ లూథరన్ చర్చి సీఆర్ కరపోతు రమేష్ రాయుడు జోయల్ ను సంఘం తరపున సత్కరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు రాయుడు మోహన్, మణికుమారి, స్వర్ణకుమారి, సంఘ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

# ప్రవాస భారతీయురాలి సహకారంతో నోటు పుస్తకాల పంపిణీ



**అత్తిలి జూన్ 18 (ప్రభాత వార్త )** తాను చదివిన పాఠశాలను మరిచిపోకుండా అమెరికాలో ఉద్యోగం చేస్తూ విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేయడం అభినందనీయమని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఎన్ రమేష్ అన్నారు. అత్తిలి ప్రాథమిక బాలుర పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రవాస భారతీయురాలు మహమ్మద్ మిన్హాజ్ ఆర్థిక సహాయంతో నోటు పుస్తకాలను అందజేశారు. మండల విద్యాధికారి 2 ఎమ్ వి ఎల్ కె ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. విద్యార్థులు మిన్హాజ్ ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయిని బిఎల్ సుజాత, మరో దాత కొనకళ్ళ కాంతారావు, మస్తాన్, ఉర్దూ ఉపాధ్యాయిని బి.గౌసియా బేగం, ఎస్ఎంసి చైర్మన్ టి ఆదినారాయణ, ఉపాధ్యాయులు ఆకుల భాస్కరరావు, బి రోజా, సిహెచ్ నాగ శిరోమణి తదితరులు పాల్గొన్నారు

# అతిసార నిరోధక కార్యక్రమం



**గణపవరం,జూన్ 18 (ప్రభాతవార్త)** గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయంలలో ఆరోగ్య కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ , హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు సచివాలయ సిబ్బందితో స్టాప్ డయేరియా కంట్రోల్ ప్రోగ్రామ్స్ వైద్యాధికారి డాక్టర్ కే . ఓంకార్ నాథ్ ఆధ్వర్యంలో గణపవరం .3 సచివాలయ పరిధిలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు లో జూలై 31 వ తేదీ వరకు అతి సార నిరోధక కార్యక్రమం నిర్వహిస్తున్నారు.నీళ్ల విరోచనాలు 5 సంవత్సరముల లోపు పిల్లలకు అయితే వారినీ ఈ 15 రోజులు ప్రత్యేకంగా సర్వే చేసి ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ టాబ్లెట్ ద్వారా చికిత్స చేస్తామని వైద్యాధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబుపాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2190, మంది 5 సంవత్సరములు లోపు పిల్లలు ఉన్నారని వారందరినీ ఇంటింటా సర్వేలో ఆశా కార్యకర్తలు సర్వే చేస్తారని తెలిపారు.ఐదు సంవత్సరముల లోపు పిల్లలు ఉన్నఇంటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్ ఇస్తామని తెలిపారు. సత్యవతి,డి . నున్న పాప, ఇంజేటి జయమ్మ,హెల్త్ అసిస్టెంట్ ,ఎం ఎస్ .యోహాన్ , అంగనవాడి కార్యకర్త , బి . రామకోటి ఆశ కార్య కర్తలు జి జ్ఞానరత్నం , ఎం .సీత .లక్ష్మి 104 స్టాఫ్ శ్రీనివాస్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


# 'సర్' సర్వేతో పారదర్శకమైన ఓటర్ల జాబితా

## బిజెపి నాయకులు మల్లెపూడి రాజశేఖర్



**నూజివీడు/చాట్రాయి, జూన్ 18, ప్రభాతవార్త** ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కు భద్రత కోసం అర్హులైన ప్రతీ పౌరుడు సర్ యంత్రాంగానికి సహకరించాలని బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపూడి రాజశేఖర్ కోరారు. గురువారం నూజివీడు మండలం దిగవల్లి, వెంకటాద్రిపురం గ్రామాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వేలో అయన నూజివీడు మండల పార్టీ అధ్యక్షుడు నక్కా నాగ శివ తో కలిసి పాల్గోని ప్రజలకు " సర్ "పై అవగాహన కల్పించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ఉద్దేశించిన సర్ సర్వే వివిధ రాజకీయ పక్షాల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతుందని ఖచ్చితమైన సమాచారం అందించి ఓటు హక్కుని పరిరక్షించుకోవాలన్నారు. డబుల్ ఎంట్రీ,చనిపోయిన ఓటర్ల గుర్తింపు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లినవారి పేర్లను పరిశీలించటంలో ప్రత్యేక శ్రద్ద చూపాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు అయన సూచించారు.అదే విధంగా 18 సంవత్సరాలు నిండినవారికి ఓటు హక్కు లభించే విధంగా వారికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ జంపిన శ్రీనివాసరావు,బిజెపి మండల అధ్యక్షుడు నక్కా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఆలూరి సుధాకర్, చలసాని కిరణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి మరీదు శ్రీకాంత్,పులి పరిమళ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వ్యాస మహర్షి అవార్డుకు పాల ఎంపిక



**అత్తిలి, జూన్ 18 (ప్రభాతవార్త )** రాష్ట్రస్థాయి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల వ్యాస మహర్షి పురస్కారానికి మంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పాల శ్రీనివాసరావు ఎంపికైనట్టు సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల తెలిపారు. జాతీయవాద ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి వ్యాస మహర్షి పురస్కారాలు, హిందూ వీరులకు హైందవ శ్రేష్ఠ పురస్కారాల ప్రదానోత్సవం జూలై 26న రాజమహేంద్రవరంలో జరుగుతుందన్నారు. ఆ కార్య క్రమంలో పాల శ్రీనివాసరావుకి పురస్కారం అందించనున్నట్టు రంగినీడి మహాలక్ష్మి ఆధ్వర్యంలోని వ్యాస మహర్షి పురస్కారాల కమిటీ వారు వెల్లడించారు. అవార్డుకు ఎంపికైన పాలను ప్రధానోపాధ్యాయుడు కె.వి రామారావు అభినందించారు.


# చదువుని మించిన సంపద లేదు

## - సహకార సంఘ అధ్యక్షులు మోరంపూడి



**చాట్రాయి, జూన్ 18 ప్రభాతవార్త** చదువే సంపదనీ, పంచెకొద్దీ పెరిగే గొప్ప సంపదనీ చనుబండ పీ ఏ సీ ఎస్ ఛైర్మన్ మోరంపూడి శ్రీనివాస రావు అన్నారు.గురువారం చనుబండ మెయిన్ ప్రాథమికోన్నత పాఠశాల లో విద్యార్థినీ, విద్యార్థులకు బుక్స్, బ్యాగ్ లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మన విద్యా శాఖా మాత్యులు నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్ళ స్థాయి మౌళిక వసతులు కల్పిస్తున్నారని, అందువల్లనే 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన స్టూడెంట్స్ మంచి ప్రతిభ కనబరచి మంచి మార్కులు సాధించారని కొనియాడారు.చక్కగా చదువుకొని, అభివృద్ధి చెంది ఉన్నత స్థానాలకు చేరుకోవాలని స్టూడెంట్స్ కు మోరంపూడి సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షెహనాజ్, టీచర్ మోదుగు రవికుమార్, బూత్ కన్వీనర్ పరసా శ్రీను, నియోజక వర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నక్కా రాము,విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ ట్రేడర్స్‌లో జెసి అశోక్ ఆకస్మిక తనిఖీలు



**లింగపాలెం జూన్ 18 (ప్రభాతవార్త)** జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు అందిస్తున్న యూరియా డి ఎ పి పంపిణీని పరిశీలించడానికి ధర్మాజీగూడెం లోని శ్రీ లక్ష్మి థియేటర్స్ ఆకస్మికంగా సందర్శించారు స్థానిక రైతులతో ఏపీ ఏఐఎంఎస్ లో యూరియా మరియు డిఏపి పంపిణీ విధానాన్ని అడిగి ఇద్దరూ రైతులకు ఈ ఏపీ ఏఐఎంఎస్ ల వీరు సాగు చేసే విస్తీర్ణం మరియు పంటలు బట్టి వారు ఎప్పుడు వచ్చిన తీసుకునే వెసుల బాటు బాటిచ్చినందుకు రైతులు సంతోషించారు ఈ కొత్త విధానంలో కావలసిన ఎరువులు ఇవ్వటానికి ఒక్క నిమిషం లోపే పట్టడంతో వెంటనే రైతుకు అందించగలుగుతున్నారు జై కలెక్టర్ అశోక్ గౌడ్ ఈ సందర్భంగా రైతుల వెరిఫికేషన్ త్వరితగతిన చేయాలన్నారు మరియు యాప్ లో ఉన్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేస్తూ పరిష్కరించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాష చింతలపూడి వ్యవసాయ సంచాలకులు వై సుబ్బారావు. తహసిల్దార్ నజీముల్లాషా.మండల వ్యవసాయ అధికారి వి ప్రదీప్ కుమార్ ఏఈఓ ఎన్. నగేష్ ధర్మాజీగూడెం రైతు సేవా కేంద్రం ఇంచార్జ్ పి శ్రావణి. మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## మానసిక శారీరక వికలాంగులకు 10 వేలరూపాయలు ఆర్థిక సహాయం అందించిన అసిస్టెంట్ రిజిస్టర్ ఎన్ వెంకటేశ్వరరావు.



లింగపాలెం జూన్ 18 (ప్రభాత వార్త)లింగపాలెం మండలం బోగోలు గ్రామ కాపురస్తులు పర్వ స్వామి, విజయలక్ష్మి భార్య భర్తలకు ఒక కుమార్తె మరియు కుమారుడు కలరు. వారు ఇరువురు మానసిక శారీరక వికలాంగులు గా జన్మించి ఉన్నారు. సుమారు 16 సంవత్సరాలు నుండి మీద ఆధారపడి జీవించుచున్నారు. వారి పనులు వారు కూడా చేసుకోలేని వారి యొక్క తల్లి పిల్లల వద్ద ఉండి వారి యొక్క బాగోగులు చూసుకొనుచున్నారు. వార్తాపత్రికల ద్వారా వారి పరిస్థితి మానస ముట్టగొంగా సహకార సంఘం సీఈఓ ద్వారా నిర్ధారణ చేసుకొని ఎన్ వెంకటేశ్వరరావు (అసిస్టెంట్ రిజిస్టర్, విజయవాడ) వారు, వారి యొక్క పరిస్థితి చలించి 10000/ వేల రూపాయలు ఆర్థిక సాయం చేసియున్నారు. ఈ కార్యక్రమం నకు వివి నాగేశ్వరరావు (అసిస్టెంట్ రిజిస్ట్రర్), డి సి ఏ ఓ ఆఫ్ ఏలూరు, గ్రామ పెద్దలు రాఘోలు రామ్మోహన్ రావు గారు , పలగాని రామకృష్ణ గారు మరియు సంఘ సిబ్బంది ఈ కార్యక్రమం పాల్గొని ఉన్నారు.

## ఎన్ని ప్రభుత్వాలు మారినా తొలగని అక్రమాలు

**-చాపకింద నీరులా వ్యవహరిస్తున్న ఆర్ & బి అధికారులు**



మొగల్తూరుజూన్ 18 (ప్రభాతవార్త) పశ్చి మగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి -- వెంపపల్లెప్రధాన రహదారి వెంబడి కొనసాగుతున్న అక్రమ ఆక్రమణలు స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని గ్రామస్తులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు పేర్కొన్నారు. ప్రధాన రహదారి పరిధిలోని ప్రభుత్వ భూముల, రోడ్డు మార్జిన్ల ఆక్రమణలను గుర్తించినప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి (రోడ్డు మరియు భవనాల శాఖ) అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. గతంలో కొన్ని ఆక్రమణలను తొలగించినప్పటికీ, కాలక్రమేణా మళ్లీ అదే ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు వెలిసినట్లు తెలిపారు.ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నప్పటికీ అధికారులు చాపకింద నీరులా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ సమస్య మాత్రం అలాగే కొనసాగుతోందని, ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రహదారి ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.రహదారి భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం దృష్ట్యా ప్రత్యేక సర్వే నిర్వహించి అక్రమ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అక్రమ డీజిల్ అమ్మకాలు పట్టించుకోని అధికారులు



మొగల్తూరుజూన్ 18 (ప్రభాతవార్త)పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కొత్తపాలెం గ్రామ పరిధిలో 216 జాతీయ రహదారిపై ట్యాంకర్ వాహనాన్ని నిలిపి అక్రమంగా డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారి పక్కనే ట్యాంకర్‌ను నిలిపి కొనుగోలుదారులకు డీజిల్ విక్రయాలు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అక్రమ డీజిల్ విక్రయాల వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలగడమే కాకుండా, అగ్ని ప్రమాదాల ముప్పు కూడా పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇంధన విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, సివిల్ సప్లైస్, పోలీస్ శాఖ అధికారులు స్పందించి అక్రమ డీజిల్ విక్రయాలపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ఈ అక్రమ కార్యకలాపాలను అరికట్టి ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇన్సూరెన్స్ నగదు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారు...



మొగల్తూరు జూన్ 18 (ప్రభాతవార్త) నా పేరు ,గుబ్బల గంగాదేవి, నా తండ్రి గుబ్బల మాణిక్యాలరావు ఉపాధి హామీ పథకంలో కూలి పనులకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు వాహన ప్రమాదంలో మృతి చెందగా మొగల్తూరు స్టేట్ బ్యాంకు కార్యాలయం నుండి నాకు రావలసిన ఇన్సూరెన్స్ నగదు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులు కలిగిస్తున్నారని మొగల్తూరు గ్రామం కాళీపట్నం పాలెం గ్రామానికి చెందిన గుబ్బల మల్లికార్జునరావు ఆరోపించారు. గురువారం బ్యాంకు కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ ఆవేదనను వెల్లడించారు. బ్యాంకు నుండి ఇన్సూరెన్స్ నగదు ఇప్పించిందుకు అధికారులతో పాటు డ్వాక్రా గ్రూపు సభ్యులు కలిసి వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. నా తల్లి తండ్రి వాహన ప్రమాదంలో ఉపాధి హామీ పథకం లో పనిచేస్తూ మృతి చెందగా ప్రస్తుతం ఇన్సూరెన్స్ నగదు ఇప్పించకుండా అధికారులతో పాటు డ్వాక్రా గ్రూప్ సభ్యులు నన్ను ఇబ్బందులు పెడుతున్నారని మల్లికార్జునరావు వెల్లడించారు. ఇన్సూరెన్స్ నగదు కలిపించాలని నా పేరు మీద చెబుతున్న వారే చనిపోయిన నా తల్లి డ్వాక్రా సొమ్ము నువ్వే కట్టాలంటూ నాపై ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాను ఈ సమస్యపై స్టేట్ బ్యాంక్ ఉన్నత అధికారులకు మరియు వెలుగు కార్యాలయ అధికారి దృష్టికి జిల్లా కలెక్టర్ వారికి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యం



టి. నరసాపురం జూన్ 18 ప్రభాతవార్త చదువుతోపాటు విద్యార్థులకు ఆటపాటలు కూడా ముఖ్యమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకట లక్ష్మమ్మ అన్నారు. గురువారం మండలంలోని మక్కినవారిగూడెం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూలును ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.అలాగే పాఠశాల లో గత సంవత్సరం పదవ తరగతి విద్యా ఫలితాలు ,అలాగే ప్రస్తుత విద్యార్థుల స్థితిగతులను వారి యొక్క బోధన పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతి ఒక్కరు శ్రద్ధతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.విద్యార్థులకు పోషకాహారం కూడిన ఆహారము క్రమం తప్పకుండా మెనూ ప్రకారం మిడ్ డే మిల్ అందించాలని కోరారు. నేటి బాలలే రేపటి పౌరులని అటువంటి పౌరులకు విలువలతో కూడిన విద్యను అందించడం మందరిది ఆమె సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఆక్రమంగా నివాసముంటున్నవారు విద్యార్థులకు విద్యా బోధనలకు ఆటంకం కలిగించకుండా ఉండాలని వీలైనంత త్వరలో ఆ ప్రాంగణాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 కళ్యాణి ,స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు,స్కూలు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం

భీమవరం జూన్ 18 ప్రభాతవార్త బ్యాంక్ కాలనీలోని శ్రీ కృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, భీమవరం పురపాలక సంఘ మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా ప్రతి వ్యక్తిలో క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్ ఎ. రాంబాబు , ఆయుష్ డాక్టర్ డి హెచ్ ఓ ఓ ఆపారావు, శ్రీవిజ్ఞాన వేదికకు చెందిన రంగసాయి, కృష్ణదేవరాయ కళ్యాణ మండపం అధ్యక్షులు కాగిత మహంకాళరావు, ప్రధాన కార్యదర్శి మెంటే పార్థసారథి, ఎమ్మెల్సీ గోపీమూర్తి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేళం దుర్గాప్రసాద్, కార్యదర్శి పాండురంగారావు, జిల్లా వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ వడుపుగోపి , బ్యాంక్ కాలనీ--మైత్రి కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కమల రాము, కార్యదర్శి అడ్డగళ్ల ప్రభాకరరావు పాల్గొన్నారు.అదేవిధంగా యోగా ఇన్‌స్ట్రక్టర్లు, శ్రీ కృష్ణదేవరాయ పతంజలి యోగా మిత్ర మండలి సభ్యులు, శ్రీ రామాయణం రమేష్ బాబు గారు మరియు ఇతర యోగా సాధకులు పెద్ద సంఖ్యలో హాజరై యోగాసనాలు, ప్రాణాయామాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, యోగా శిక్షకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టణంలోని 28, 29, 30, 31, 32 వార్డుల్లో నీటి సరఫరా నిలిపివేత

**-పురపాలక సంఘ ఇంజనీర్ వెంకటరమణ**

తాడేపల్లిగూడెం,జూన్ 18 (ప్రభాత వార్త).తాడేపల్లిగూడెం పట్టణంలోని 28, 29, 30, 31, 32 వార్డుల్లో శుక్రవారం సాయంత్రం నీటి సరఫరాను నిలిపివేయనున్నామని పురపాలక సంఘ ఇంజనీర్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు కడకట్ల రిజర్వాయర్ వద్ద అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టనున్నామని చెప్పారు. ఈ పనుల కారణంగా 28, 29, 30, 31, 32 వార్డులో నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని, పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. సంబంధిత వార్డు ప్రజలు శుక్రవారం సాయంత్రానికి అవసరమైన తాగునీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

## ప్రీ-ప్రైమరీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ



మొగల్తూరుజూన్ 18 (ప్రభాతవార్త): సీడీపీఓ బి. ఊర్మిళ ఆదేశాల మేరకు మొగల్తూరు మండలం శేరేపాలెం పంచాయతీ పరిధిలోని శేరేపాలెం గురువు అంగన్వాడీ కేంద్రంలో ప్రీ-ప్రైమరీ విద్యను పూర్తి చేసిన చిన్నారులకు గురువారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ టోపీలు ధరింపజేసి, వారి విద్యా ప్రస్థానంలో తొలి అడుగును గుర్తు చేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులకు పిల్లల సమగ్ర అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని వివరించారు. చిన్నారులకు నైతిక విలువలు, క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవర్చడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును అందించవచ్చని సూచించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల విద్యా, మానసిక, సామాజిక అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు విజయ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ పి. విజయకుమారి పాల్గొని చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసంపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది.

## వస్త్ర వ్యాపారి ఎస్‌విఆర్‌కు సత్కారం



నరసాపురం జూన్ 18 ప్రభాత వార్త స్థానిక అర్బన్ సొసైటీ కీ డైరెక్టర్ గా నియమితులైన వస్త్ర వ్యాపారి సమతం వెంకటేశ్వరరావును గురువారం ఆయన షాపులో దేవాంగ సంఘ పెద్దలు శా లువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల కు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తుందని వారన్నారు. తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజుకు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో. కనకం ప్రసాద్. బూడిద జోగేశ్వరరావు బల్ల రమేష్ . దేశెట్టిసత్యనారాయణ. ఊటుకూరి దుర్గాప్రసాద్. టైలర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## గిరిజన ఆశ్రమ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి



బుట్టాయగూడెం, జూన్ 18(ప్రభాత వార్త): కోట రామచంద్రపురం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో గిరిజన పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని గిరిజనులు ఆందోళన చేపట్టారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో నూతన సంస్కరణలు తీసుకురావడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తూ మూడో తరగతి నుండి పదవ తరగతి వరకు పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని లంక పాకల గిరిజన ఆశ్రమ పాఠశాలకు తాళాలు వేసి విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. రెండో రోజు ఆందోళనలో అఖిలభారత ఆదివాసి వేదిక ఏ ఐ టీ ఎఫ్ జాతీయ కన్వీనర్ ఎస్ రామ్మోహన్, అంతర్వేది గూడెం ఎంపీటీసీ కొవ్వాసు గోవిందరాజు, ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు కె.పోతిరెడ్డి, మాజీ సర్పంచ్ కారం లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ చింతల కృష్ణ లు మాట్లాడుతూ ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంత ఆదివాసి ప్రజలు ఆర్థికంగా ,సామాజికంగా సాంస్కృతికంగా వెనుకబడి ఉన్న దశలో విద్యా వ్యవస్థ అభివృద్ధి చాలా ముఖ్యం అన్నారు. ఆదివాసి గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నటువంటి పాఠశాలల్లో విద్యాసంస్కరణలు తీసుకువచ్చి, విద్యార్థులను చదువులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సంస్కరణల కారణంగా విద్యార్థుల డ్రాప్ అవుట్ సమస్య తీవ్రతరం అవుతుందని అన్నారు. గిరిజన విద్యార్థుల కోసం ఐటిడిఏ పరిధిలో 25 పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలల్లో నాలుగు పాఠశాలలు మాత్రం మూడవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు విద్యాబోధన జరగాలని మరియు ఐదవ తరగతి నుండి పదో తరగతి వరకు 21 పాఠశాలల్లో విద్యాబోధన జరగాలని ప్రభుత్వం నూతన సంస్కరణని తీసుకు రావడం జరిగిందని తెలిపారు.ఈ నేపథ్యంలో గిరిజన విద్యార్థులు లంకపాకల, పులిరామన్నగూడెం, రెడ్డి కోపల్లి, ఇటికలకోట పాఠశాలల్లో చదువుకుంటున్నటువంటి విద్యార్థులకు 8, 9, 10 తరగతతులు అందుబాటులో లేకపోవడం వల్ల డ్రాప్ అవుట్సుగా మారే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా 21 పాఠశాలల్లో ఐదో తరగతి నుండి పదో తరగతి వరకు క్లాసులు కొనసాగించాలనే ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా ఈ పాఠశాలల్లో మూడు, నాలుగు తరగతులను బోధించకపోవడం వల్ల వారికి హాస్టలు సదుపాయం లేక దూర ప్రాంతానికి వెళ్లలేక ఈ విద్యార్థులు చదువులు మానివేసి డ్రాప్ అవుట్సుగా మారతారని అన్నారు. విద్యారంగంలో ఏదైనా మార్పులు తీసుకువస్తున్న సమయంలో విద్యార్థి సంఘాలను, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు ద్వారా మార్పులు తీసుకురావాలి తప్ప ప్రభుత్వం ఒంటెత్తు పోకడతో నిర్ణయాలు తీసుకోకూడదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో తీసుకువచ్చిన నూతన సంస్కరణలను వెనక్కి తీసుకొని, పాత పద్ధతిలోనే పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లంకపాకల పాఠశాలలో రెండవ రోజు ధర్నా కార్యక్రమాన్ని కొనసాగించారు. ఉపాధ్యాయుల విధులను అడ్డుకొని, పాఠశాల గేటుకు తాళాలు వేసి, ప్రజలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయులు స్కూలు ప్రారంభం నుండి స్కూలు ముగింపు సమయం వరకు బయట చెట్లు కింద వేచి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

**-దివ్యాంగుల పీజీఆర్ఎస్ జూన్ 27న -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



భీమవరం జూన్ 18 ప్రభాతవార్త "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల జూన్ 19వ తేదీన భీమవరం నియోజకవర్గంలో నిర్వహించాల్సి ఉండగా, అనివార్య పరిపాలనా కార్యక్రమాల కారణంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.జూన్ 19వ తేదీన ఉదయం భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న థీమాటిక్ యోగా కార్యక్రమంలో, అనంతరం డి.ఎన్.ఆర్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల అభివృద్ధి విజయాలను ప్రజలకు వివరించే సమగ్ర కమ్యూనికేషన్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో, అలాగే పెద్దఅమీరం గ్రామంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన విజయాలపై నిర్వహించనున్న కార్యక్రమాలలో జిల్లా యంత్రాంగం పాల్గొనాల్సి ఉన్నందున ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని ఆమె వెల్లడించారు.అదేవిధంగా, ప్రతి నెల మూడవ శుక్రవారం నిర్వహించే దివ్యాంగుల ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కూడా ఇదే కారణాల దృష్ట్యా జూన్ 19న నిర్వహించడం సాధ్యంకాకపోవడంతో రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల సమస్యలు, వినతులను స్వీకరించి పరిష్కరించేందుకు ఉద్దేశించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఈ నెల జూన్ 27వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు, దివ్యాంగులు ఈ మార్పును గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విజ్ఞప్తి చేశారు.

## మానసిక శారీరక ఆరోగ్యం యోగాతో సాధ్యం కమీషనర్ రామచంద్రారెడ్డి



భీమవరం టౌన్, జూన్ 18 : ప్రభాతవార్త యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా ప్రతి వ్యక్తిలో క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందుతాయని భీమవరం మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్ ఎ. రాంబాబు , ఆయుష్ డాక్టర్, అప్పారావు , శ్రీవిజ్ఞాన వేదిక రంగసాయి, శ్రీ కృష్ణదేవరాయ కళ్యాణ మండపం అధ్యక్షులు ,కాగిత మహంకాళరావు , ప్రధాన కార్యదర్శి మెంటే పార్థసారథి, ఎమ్మెల్సీ గోపీమూర్తి , సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేళం దుర్గాప్రసాద్ , కార్యదర్శి పాండురంగారావు , జిల్లా వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ వడపుగోపి , బ్యాంక్ కాలనీ--మైత్రి కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ కమల రాము, కార్యదర్శి అడ్డగళ్ల ప్రభాకరరావు పాల్గొన్నారు.యోగా ఇన్‌స్ట్రక్టర్లు, కృష్ణదేవరాయ పతంజలి యోగా మిత్ర మండలి సభ్యులు, రామాయణం రమేష్ బాబు మరియు ఇతర యోగా సాధకులు పెద్ద సంఖ్యలో హాజరై యోగాసనాలు, ప్రాణాయామాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని వెల్లడించారు.మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, యోగా శిక్షకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత

**-మార్టేరు విజయోత్సవ సభలో ఎమ్మెల్యే పితాని**



పెనుమంట్ర, జూన్-18, (ప్రభాతవార్త) మండలంలోని మార్టేరు నాలుగు కూడలి సెంటర్‌లో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో "కూటమి ప్రభుత్వ రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" పేరిట భారీ విజయోత్సవ సభ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు, కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభ జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. "సూపర్ సిక్స్" పథకాలను దశలవారీగా అమలు చేస్తూ మహిళలు, యువత, రైతులు, వృద్ధులు సహా అన్ని వర్గాలకు ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు.స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, "తల్లికి వందనం" పథకం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అలాగే అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం ద్వారా పేదలకు తక్కువ ధరలో భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను అరికట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.అమరావతి రాజధాని నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తామని, ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పథకాల లబ్ధిదారులు, పాల్గొన్నారు.

## యూఎఫ్ఎస్ డేటా ధృవీకరణకు గ్రామ సభలు

జీలుగుమిల్లి, జూన్ 17 (ప్రభాతవార్త)మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యూఎఫ్ఎస్) డేటా వాలిడేషన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ జూన్-18న గ్రామ సచివాలయాల్లో యూఎఫ్ఎస్ సోషల్ ఆడిట్ డేటాను ప్రజల పరిశీలనకు ఉంచి, జూన్ 19న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కుటుంబ, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర వివరాలను ప్రజల సమక్షంలో ధృవీకరిస్తామని తెలిపారు.అలాగే జూన్ 19 నుంచి 24 వరకు ప్రజలు తమ వివరాలపై అభ్యంతరాలు, సవరణలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పాలకొల్లు జూన్ 18 ప్రభాతవార్త పాలకొల్లు ఏబీ స్పెషల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగనవాడి కేంద్రంలో ఐదు సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకుని ప్రథమ తరగతిలో ప్రవేశం పొందుతున్న చిన్నారుల కోసం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ టోపీలు ధరింపజేసి, వారి విద్యా జీవితంలో కొత్త దశకు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో సీడీపీఓ ఎం. ఉమా, ప్రథమ్ కోఆర్డినేటర్ ఎం. కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ పి. సత్య వేణి గారు, పాలకొల్లు మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి, ఏబీ స్పెషల్ ప్రధానోపాధ్యాయులు శశికళ గారు, తల్లిదండ్రులు, అంగనవాడి కార్యకర్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి మాట్లాడుతూ, అంగనవాడి కేంద్రాల నుంచి ప్రథమ తరగతిలోకి ప్రవేశిస్తున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.సీడీపీఓ ఎం. ఉమ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, భద్రత మరియు సమగ్ర అభివృద్ధి విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం చిన్నారులకు మరపురాని అనుభూతిని అందించగా, ప్రథమ తరగతిలో అడుగుపెడుతున్న చిన్నారులకు అందరూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై విచారణ జరిపించాలి



భీమవరం టౌన్, జూన్ 18 : ప్రభాతవార్త పలు మండలాల విద్యాశాఖాధికారులపై వచ్చిన ఆరోపణలు, కథనాలు, ఫిర్యాదులపై శాఖా పరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపా ధ్యాయ సంఘాల సమాఖ్య (ఫాప్టో) పశ్చిమ గోదావరి జిల్లా యూనిట్ గురువారం వినతి పత్రం సమర్పించింది. కొంతమంది మండల విద్యాశాఖ అధికారుల అవినీతి, అనుచిత ప్రవర్తనపై అనేకమార్లు సంఘాలుగా ఫిర్యా దు ఇచ్చినప్పటికీ చర్యలు లేవని ఫాప్టో తెలియ జేసింది. జిల్లాలో వివిధ మండల విద్యాశాఖ అధికారుల నిరంకుశ వైఖరి మరియు యొక్క కక్షపూరిత చర్యలు, అవినీతి ఆరోపణలు పై చర్యలు తీసుకో వాల్సిందిగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య కోరుతుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మండల విద్యాశాఖ అధికా రులు పై జిల్లా వ్యాప్తంగా విచారణ జరిపించి, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై తక్షణమే శాఖపరమైన తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెనకాడ బోమని తెలియజేస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి అందుబాటులో లేకపో వడంతో ఫోన్లో మాట్లాడి డిఇఓ కార్యాలయ సూపరిండెంట్ తిరుపతి రాజుకి ఫాప్టో జిల్లా యూనిట్ పక్షాన వినతిపత్రం అందజేసినట్లు తెలిపిందిఫాప్టో జిల్లా చైర్మన్ పి స్ విజయ రామరాజు,సెక్రటరీ జనరల్ జి ప్రకాశం, కో చైర్మన్లు పి సాయి వర్మ ,ఎన్ శ్రీనివాసరావు, కె వెంకటేశ్వర రావు డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రమణ రావు, పి క్రాంతి కుమార్, కె.వి.రామచం ద్రరావు, ట్రెజరర్ సిహెచ్ పట్టాభి రామయ్య తదితరులు ప్రాతినిధ్యం వహించిన వారిలో ఉన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అద్వితీయ పాలన

**-తెదేపా నియోజకవర్గ ఇన్ఛార్జ్- వలవల మల్లికార్జునరావు (బాజ్జి)**



తాడేపల్లిగూడెం,జూన్ 18 (ప్రభాత వార్త) ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అద్వితీయ పాలన అందిస్తుందని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాజ్జి) తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గురువారం గ్రీవెన్స్ -- ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెదేపా నియోజకవర్గ పరిశీలకులుగా ఇటీవల నియమితులైన గోపాలపురం ఏఎంసి చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు హాజరయ్యారు. నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలను స్వీకరించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 35 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ 15,09,933 రూపాయలు విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వలవల మల్లఖార్జునరావు (బాజ్జి) మాట్లాడుతూ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన యద్దనపూడి బ్రహ్మారాజు పార్టీ కోసం ఎన్నో సేవాలందించారని కొనియాడారు. కార్యకర్తల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిని పరిశీలకులుగా నియమించటం ఎంతో ఆనందాయికమని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతోమంది పేదలకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి ఎన్ని చెక్కులు అడిగినా వాటిని మంజూరుచేస్తూ పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. తాను సెక్రటేరియట్ కు వెళ్లినప్పుడల్లా అధికారులను కలిసి చెక్కులు త్వరితగతిన మంజూరయ్యే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ నెల 19న భీమవరంలో విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని పురోగతి పథంలో నడిపిస్తున్నాయని చెప్పారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడి ఆకర్షణ, ఉపాధి కల్పన వంటి రంగాల్లో కూటమి ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందన్నారు. విజయోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని వివరించారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు యద్దనపూడి బ్రహ్మారాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందని చెప్పారు. ఏమైనా చిన్న చిన్న సమస్యలుంటే నాయకులు, కార్యకర్తలు వాటిని సర్దుబాటు చేసుకుంటూ ముందుకెళ్లాలని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు. ముందుగా బాజ్జి పరిశీలకులు బ్రహ్మారాజును పుష్పగుచ్ఛం, సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల వీర వెంకట సత్యనారాయణ, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, ముప్పిడి రమేష్, శ్రీరాముల విజయలక్ష్మి, కాకర్ల సుభద్ర, అబ్బిన వీర వెంకట్రావు, ఎరుబండి సతీష్, రాంబాబు, మాదాసు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ సంగీత దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



భీమవరం జూన్ 18 ప్రభాతవార్త సంగీతం ఒక సముద్రం లాంటిదని, అంతమైన సంగీతానికి పశుపక్ష్యాదులు కూడా అస్వాదిస్తాయని భీమవరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఉపాధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో మూడు రోజులపాటు జరిగే ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకల బ్రోచర్ ను గురువారం వెంకట్రామ థియేటర్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. మావుళ్ళమ్మ దేవస్థాన ట్రస్ట్ సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ మన భీమవరం కళలకు పుట్టినిల్లు అని, భీమవరంలో మూడు రోజులపాటు సంగీత దినోత్సవ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 19,20,21 తేదీల్లో సంగీత దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని, 21వ తేదీన 16 మంది సంగీత కళాకారులను సత్కరిస్తామని తెలిపారు. సంగీత దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టివివి ప్రసాద్, గంటా సుందర్ కుమార్, పుప్పాల శేషు, అడపా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## మన పరిశుభ్రత మన ఆరోగ్యం-హరినాథ్



భీమవరం జూన్ 18 ప్రభాతవార్త మన పరిశుభ్రత మన ఆరోగ్యమేనని, అపరిశుభ్రతకు చోటిస్తే అనారోగ్య వాతావరణం వస్తుందని కోపా కళ్యాణ మండపం అధ్యక్షులు యర్రంశెట్టి హరినాథ్, టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు అంబళ్ల జోగేశ్వరి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం రెస్ట్ హౌస్ రోడ్డులోని శంకర మఠం నుంచి ఒంటెద్దు ఆంజనేయ స్వామి ఆలయం, కోపా కళ్యాణ మండపం, అంబళ్ల వారి వీధి వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రం చేశారు. వారు మాట్లాడుతూ ఒకరు చెబితే చేసిది కాదు శుభ్రత అని, మనందరి పరిశుభ్రత తోనే మన ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నెలరోజులుగా అన్ని వార్డులను వీధుల్లోనూ దేవాయల చుట్టూ పక్కల ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ గవర్నర్ వడుపు గోపి, కర్రి సోమేశ్వరరావు, వలవల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్రంలో గ్రామీణ బ్యాంకుల ద్వారా 130 లక్షల మందికి సాయం



ఏలూరు, జూన్, 18 : ప్రభాత వార్త ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా రాష్ట్రాల్లో 1. 30 కోట్ల మందికి సేవలందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి చెప్పారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలో గురువారం జరిగిన క్రెడిట్ ఔట్రీచ్ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కు రాష్ట్రంలో 1359 శాఖలు ఉన్నాయని, 2025-2026 ఆర్థిక సంవత్సరం లో బ్యాంకు రూ.64672.87 కోట్లు డిపాజిట్లు గా సేకరించి,రూ.71664.51 కోట్లు రుణాలు మంజూరు చేసిందన్నారు. దీని లో 93 శాతం ప్రాధాన్యత రంగం క్రింద గ్రామీణ కుటీర పరిశ్రమలకు,సన్న, చిన్న కారు, ఇతర వ్యవసాయ అవసరాలకు, స్వయం సహాయక సంఘాలకు, గృహ నిర్మాణాలకు, విద్యా రుణాలు కు, సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలు కు మంజూరు చేయడమైనదన్నారు. మా బ్యాంకు రాష్ట్రం లో అత్యధిక నెట్ వర్క్ తో దాదాపు గా 1.30 కోట్లు ఖాతాదారులుకు సేవలు అందిస్తోందన్నారు. . అలాగే దేశవ్యాప్తంగా ఉన్న 23 గ్రామీణ బ్యాంకు లలో తమ బ్యాంకు వ్యాపారపరంగా ద్వితీయ స్థానంలో ఉన్నట్లు తెలిపారు.బ్యాంకు జనరల్ మేనేజర్ జుమ్మిలాల్ మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకు ద్వారా రిటైల్ మరియు మీవీజు రుణాలు కూడా మంజూరు చేస్తామని, అందరూ వినియోగించుకోవాలి అనే ఉద్దేశంతో ఈ క్రెడిట్ ఔట్రీచ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏలూరు రీజినల్ మేనేజర్ ఎం. సంపత్ కుమార్ మాట్లాడుతూ ఏలూరు రీజియన్ పరిధిలో 59 శాఖలు పనిచేస్తున్నాయన్నారు త్వరలో మరో 4 శాఖలు ఈ రీజినల్ లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం లో ఏలూరు రీజియన్ పరిధిలో రూ.2096.55 కోట్లు డిపాజిట్లు సేకరించి,రూ.2736.02 రుణాలు మంజూరు చేసి మొత్తం వ్యాపారం 4832.58 కోట్లు చేసిందన్నారు. ఖాతాదారులు సౌకర్యార్థం తక్షణమే రుణాలు మంజూరు చేయాలని ఉద్దేశంతో ఏలూరు లో క్రెడిట్ ప్రాసెసింగ్ విభాగం ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. అదేవిధంగా ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన క్రింద రూ.20 చెల్లించి రూ.2 లక్షలు వరకు ప్రమాద బీమా పొందవచ్చన్నారు. . ప్రధాన మంత్రి జీవన భీమా యోజన క్రింద రూ.436 ప్రీమియం చెల్లించి జీవిత బీమా క్రింద 2 లక్షలు వరకు భీమా ప్రయోజనం పొందవచ్చన్నారు ఇంకా అటల్ పింఛను పథకాన్ని కూడా వినియోగించుకోవాలన్నారు.జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రి మాట్లాడుతూ జిల్లా లో గ్రామీణ బ్యాంకులు మారుమూల గ్రామాల్లో కూడా విస్తరించి ఉన్నాయన్నారు. అందరూ గ్రామీణ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో దెందులూరు సెర్ప్ ఏపిఎం సురేష్ పాల్గొని రాష్ట్రంలో అత్యధిక రుణాలు, తక్కువ వడ్డీలకు మహిళల కు బ్యాంకు ద్వారా అందిస్తున్నామన్నారు. గ్రామీణ బ్యాంకు లలో కేవలం రుణాలు మంజూరు చేయటం లోనే కాకుండా ఖాతాదారులుకు సేవలు అందించడంలో కూడా ఉత్తమ బ్యాంకన్నారు.ఈ కార్యక్రమంలో ఏలూరు రీజియన్ పరిధిలో శాఖల ద్వారా రిటైల్ రుణాలు కు ? 100 లక్షలు, వ్యవసాయ రంగానికి ?. 100 లక్షలు, చేపల పెంపకం కోసం ? 30 లక్షలు మరియు మహిళా సంఘాలు కు ? 25 కోట్లు బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి అందించారు బ్రాంచ్ మేనేజర్స్ , మరియు సిబ్బంది మరియు మహిళా సంఘాలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


## స్వచ్ఛమైన పట్టణం.... ఆరోగ్యకరమైన భవిష్యత్తు మన లక్ష్యం

**-పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు**



తాడేపల్లిగూడెం జూన్18 (ప్రభాతవార్త) స్వచ్ఛమైన పట్టణం ఆరోగ్యకరమైన భవిష్యత్తు మన లక్ష్యమని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా స్థానిక 6వ వార్డులోని వాసవి పార్క్ ప్రాంతంలో విస్తృత శుభ్రత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రస్తుతం వినియోగంలో లేని వాసవి పార్క్‌లోని చెత్తాచెదారాన్ని, పొదలు, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను, పార్కు చుట్టూ ఉన్న ముళ్ల కంపలను తొలగించి, నడక మార్గాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ దోమలు, ఇతర క్రిమికీటకాలకు నిలయంగా మారిన ఈ పార్కును భవిష్యత్తులో పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ముందస్తుగా ప్రక్షాళన చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కారుమూరి సునీల్ అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపే : రాయంకుల



కామవరపుకోట,జూన్ 18(ప్రభాతవార్త): వైసీపీలో కీలకమైన బీసీ సామాజికవర్గ నాయకులను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు, అరెస్టులతో రాజకీయ కక్షసాధింపునకు పాల్పడుతోందని కామవరపుకోట మండల వైసీపీ అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ మండిపడ్డారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుండి జోగి రమేష్, కారుమూరి కుటుంబం వంటి బీసీ నేతలను వరుసగా టార్గెట్ చేస్తూ వేధిస్తోందని ధ్వజమెత్తారు.మద్యం రవాణా కుంభకోణం పేరుతో కారుమూరి సునీల్‌కుమార్‌ను హైదరాబాద్‌లో ఈడీ అరెస్టు చేయడం హేయమైన చర్య అని రాయంకుల ఖండించారు. వైసీపీలో బీసీలను రాజకీయంగా అణగదొక్కేందుకే కూటమి ప్రభుత్వం ఇటువంటి కుయుక్తులు పన్నుతోందని రాయంకుల విమర్శించారు. ఇప్పటికైనా కక్షాపూరిత రాజకీయాలు ఆపాలని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలు, ప్రజలు కూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడటం ఖాయమని ఆయన హెచ్చరించారు.